LGTV

RNI NO. APBIL/2013/50718

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ఎడిటర్: చిలకమర్రి రెంరెడ్డి

ద్విభాషా దినపత్రిక

www.localguidenews.com

లోకల్ గైడ్ www.localguidenews.com తెలంగాణ

విలేకరులు కావలెను

సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.

ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి

8977761499/9110308094

ప్రచురణ : , తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,280 | పేజీలు -12 | బుధవారం - 04 - నవంబర్ - 2026 | వెల రూ.2/-

భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది: ఏపీఎస్డీఎంఏ అలర్ట్



- దక్షిణ కోస్తాంధ్రపై మురసు తీవ్ర తుపాను ప్రభావం
- రానున్న 3 గంటల్లో పలు జిల్లాలకు కుండపోత వర్ష సూచన
- ఆకస్మిక వరదలపై లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక
- పొంగిపొర్లే వాగులు దాటవద్దని అధికారుల విజ్ఞప్తి
- క్రమంగా బలహీనపడనున్న తుపాను, రాత్రికి తగ్గనున్న గాలులు

డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్

మొత్తం 20 వేదికలపై 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ

- యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- క్రీడల కోసం అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాలి
- తెలంగాణ కర్రసాము క్రీడను కూడా ఆతిథ్య రాష్ట్ర కోటాలో చేర్చే విధంగా వెంటనే కార్యాచరణ చేపట్టాలి
- నిరంతర పర్యవేక్షణ కోసం గ్రూప్-1 స్థాయి అధికారులకు ఆయా బాధ్యతలు అప్పగించాలి



హైదరాబాద్: డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాశ్వత ప్రాతిపదికన యూత్ గేమ్స్ ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. ఈ క్రీడల కోసం అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన మిగతా 2 లో



రెవెన్యూ-అటవీ సరిహద్దుల సమస్యలపై సర్వే

- రెండు శాఖల మధ్య సమన్వయం అవసరం
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది'
- శాస్త్రీయ పద్ధతుల్లో సంయుక్త సర్వే..
- నేనే స్వయంగా పర్యవేక్షిస్తా..
- సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్‌ను పరిశుభ్రమైన నగరంగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి

- నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- నగరంలో ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి
- నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్: హైదరాబాద్‌ను పరిశుభ్రమైన నగరంగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



డెమోక్రాట్లు గెలిస్తే 'మిస్టర్ వీటో'గా మారిపోతా..

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- డెమోక్రాట్లు గెలిస్తే అన్ని నిర్ణయాలను వీటో చేస్తానన్న ట్రంప్
- మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయాలని ఉందని వ్యాఖ్య
- రాజ్యాంగం ప్రకారం మూడోసారి ఎన్నిక కావడం సాధ్యం కాదని అంగీకారం
- తన సిబ్బందిపై విచారణలు జరిగితే ముందస్తు క్షమాభిక్షలు ఇస్తానని వెల్లడి

ఓటర్ల నమోదుపై శ్రద్ధ చూపాలి

వరంగల్ జిల్లా నేతలకు భట్టి, పొంగులేటి, సీతక్క సూచన



- కాంగ్రెస్ విజయం కోసం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధతో పనిచేయాలి
- పార్టీ అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించే బాధ్యత అందరిపై ఉంది
- పట్టభద్రులను ఓటర్ల జాబితాలో నమోదు చేయించడం, వారితో సమావేశం నిర్వహించడంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి

హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క సూచించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ప్రజాభవన్‌లో వారు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. భట్టి మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం వారీగా పట్టభద్రులను ఓటర్ల జాబితాలో నమోదు మిగతా 2 లో

స్థానిక ఎన్నికల ఫలితాలు వస్తున్నాయి.. ఇది సుపరిపాలనకు దక్కిన విజయం

- : సీఎం చంద్రబాబు
- స్థానిక ఎన్నికల ఫలితాలపై స్పందించిన సీఎం చంద్రబాబు
- సుపరిపాలనను చూసే ప్రజలు కూటమికి ఓటేశారని వెల్లడి
- రాజకీయాల కన్నా ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత అని ఉద్ఘాటన
- అమరావతి, పోలవరం పనులను వేగవంతం చేశామని వివరణ
- ప్రజలు మెచ్చే పాలన అందించడమే తమ లక్ష్యమని స్పష్టీకరణ




అమరావతి: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్పందించారు. వెలువడుతున్న ఫలితాల్లో అధికార కూటమి స్పష్టమైన ఆధిక్యం దిశగా పయనిస్తోందని తెలిపారు. సాయంత్రానికి మిగతా 2 లో



ముందే వచ్చిన కాలుష్య సంక్షోభం.. ఢిల్లీకి పాక్ పాగ సెగ

- దీపావళికి ముందే ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం
- 300 దాటిన గాలి నాణ్యత సూచీ.. 'వెరీ పూర్' కేటగిరీకి చేరిక
- భారత్‌తో పాటు పాకిస్థాన్‌లోని వ్యవసాయ వ్యర్థాల దహనాలే ప్రధాన కారణం
- నాసా శాటిలైట్ డేటాతో బహిర్గతమైన వాస్తవాలు
- కాలుష్య నియంత్రణకు గ్రాప్-2 చర్యలు అమలు

మురసు తుపాను: వచ్చే 4-5 గంటలు కీలకం.. యంత్రాంగానికి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



- ఒంగోలు-బాపట్ల సమీపంలో 120 కి.మీ. వేగంతో తుపాను కదలిక
- ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రథమ ప్రాధాన్యమన్న ముఖ్యమంత్రి
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం
- తుపాను తీవ్రత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వెల్లడి



ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం: సీఎం చంద్రబాబు

- అర్నబ్, మురసు తుఫాన్లపై ఆర్టీజీఎస్‌లో సీఎం మీడియా సమావేశం
- ప్రాణ నష్టం నివారించి, ఆస్తి నష్టం తగ్గించగలిగామన్న చంద్రబాబు
- టెక్నాలజీ సాయంతో 90 శాతం కచ్చితత్వంతో అంచనాలు

ఏపీకి అండగా ఉంటామన్న అమిత్ షా..

కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు

తీరం దాటిన మురసు తుపాను

- ఏపీలో పలు చోట్ల వర్షాలు
- ఏపీకి అన్నివిధాలా అండగా ఉంటామని అమిత్ షా హామీ
- చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్న హోంమంత్రి
- క్షేత్రస్థాయిలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహాయక చర్యలు
- కేంద్ర, రాష్ట్ర బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వెల్లడి



అమరావతి: మురసు తుపాను నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న తక్షణ సహాయానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర బృందాలతో రాష్ట్ర యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేస్తోందని, మిగతా 2 లో

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంగారెడ్డి ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

స్థానిక ఎన్నికల ఫలితాలు వస్తున్నాయి.. ఇది సుపరిపాలనకు దక్కిన విజయం: సీఎం చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్పందించారు. వెలువడుతున్న ఫలితాల్లో అధికార కూటమి స్పష్టమైన ఆధిక్యం దిశగా పయనిస్తోందని తెలిపారు. సాయంత్రానికి పూర్తిస్థాయి ఫలితాలు వెలువడి, మరింత స్పష్టత రానుందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎన్నికల ఫలితాలు తమ ప్రభుత్వ సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని ఆయన అభివర్ణించారు. "మేం చేస్తున్న సుపరిపాలనను మెచ్చి, మా పనితీరును గమనించే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారు. 'గుడ్ పాలిటిక్స్, గుడ్ గవర్నెన్స్' అనేదే నా ప్రాధాన్యత. రాజకీయమా, ప్రజల సమస్యల పరిష్కారమా అంటే.. నేను ఎప్పుడూ సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుపాను సమయంలో మూడు రోజుల పాటు రాత్రింబవళ్లు సహాయక చర్యల్లోనే నిమగ్నమైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ.. "అనునిత్యం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికే పనిచేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఇప్పటికే వెలిగొండ ద్వారా నీటిని అందించాం. అమరావతి పనులు పరుగులు పెట్టిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ధ్వంసమైన రోడ్లను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని తెలిపారు. అయితే, అన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం లేదని, వారసత్వంగా వచ్చిన కొన్ని సమస్యలు ఇంకా ఉన్నాయని ఆయన అంగీకరించారు. ప్రజలకు సేవలందించే విషయంలో ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చారు. కొందరు విమర్శలు చేస్తున్నా వాటిని పట్టించుకోకుండా ప్రజాసేవకే అంకితమయ్యామని చంద్రబాబు అన్నారు. "లబ్ధి పొందుతూ కూడా ఎగతాళి చేసేవారు ఉంటారు. కులాలు, మతాలు, మాకు ఓటు వేయని వారు అనే భేదాలు మేం చూడటం లేదు. అందరి కోసం పనిచేస్తున్నాం. ప్రజలు మెచ్చే పాలన అందించి, వారి ఇబ్బందులను దూరం చేయడమే మా లక్ష్యం" అని వివరించారు. ప్రజలు ఇదే విధంగా కూటమిని ఆశీర్వదించి, ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జగన్‌పై కేసు నమోదు చేసిన పులివెందుల పోలీసులు

అమరావతి: వైసీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ అధినేత జగన్‌పై పోలీసు కేసు నమోదయింది. కడప జిల్లా పులివెందులలో జగన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున అనుమతి లేకుండా ధర్నా చేసి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆయనపై ఆరోపణలు నమోదయ్యాయి. నవంబర్ 1వ తేదీన జరిగిన పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. తమ పార్టీ ఏజెంట్లను చాలా పోలింగ్ బూత్‌లలోకి రానివ్వడం లేదని ఆరోపిస్తూ జగన్ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలింగ్‌ను వెంటనే రద్దు చేసి, రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అయితే, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ముందస్తు అనుమతి లేకుండా ఆందోళన చేపట్టారని టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో పులివెందుల అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, పులివెందులలో రీపోలింగ్ నిర్వహించాలని కోరుతూ వైసీపీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. ఓట్ల లెక్కింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైకోర్టులో పిటిషన్ తిరస్కరణకు గురైన రోజే, ధర్నా ఘటనపై జగన్‌పై కేసు నమోదు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.


ట్రంప్‌కు అగ్నిపరీక్ష.. అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్

ఢిల్లీ: అమెరికా రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియ మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) మొదలైంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, కనెక్టికట్ సహా పలు తూర్పు తీర రాష్ట్రాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు పోలింగ్ మొదలవగా, ఓటు వేసేందుకు ప్రజలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు, సెనెట్‌లోని 100 స్థానాలకు గాను 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటికే 5.9 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ (జుఖితీశ్రీఎ ఎశీఱఅగ్ర) లేదా మెయిల్-ఇన్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ఆయన పాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా పరిగణిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, సరిహద్దు భద్రత, అక్రమ వలసలు, వాణిజ్య సుంకాల వంటి అంశాలు ఓటర్లను ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయి. అత్యధిక సర్వేల ప్రకారం ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్‌లోని రెండు సభల్లో (ప్రతినిధుల సభ, సెనెట్) రిపబ్లికన్లకు స్వల్ప మెజార్టీ ఉంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు కనీసం ఒక్క సభలోనైనా ఆధిపత్యం సాధిస్తే, అధ్యక్షుడు ట్రంప్ విధానపరమైన నిర్ణయాలకు, చట్టాల ఆమోదానికి అడ్డంకులు సృష్టించే అవకాశం లభిస్తుంది. అయితే, డెమోక్రాట్లు గెలిస్తే, వారు ప్రతిపాదించే ప్రతి బిల్లును తన వీటో అధికారంతో అడ్డుకుంటానని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టెక్సాస్, మిచిగాన్, ఐయోవా వంటి కీలక రాష్ట్రాల్లో సెనెట్ స్థానాలకు తీవ్రమైన పోటీ నెలకొంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, భారీ సంఖ్యలో ఉన్న మెయిల్-ఇన్ బ్యాలెట్ల లెక్కింపు కారణంగా తుది ఫలితాలపై పూర్తి స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముందే వచ్చిన కాలుష్య సంక్షోభం.. ఢిల్లీకి పాక్ పొగ సెగ

ఢిల్లీ: పండుగల సీజన్ సమీపిస్తుండగా, దేశ రాజధాని ఢిల్లీని మరోసారి వాయు కాలుష్యం కమ్మేసింది. గాలి నాణ్యత సూచీ (ూూ×) 300 మార్కును దాటడంతో 'వెరీ పూర్' కేటగిరీకి పడిపోయింది. దీపావళికి కొద్ది రోజుల ముందే ఈ పరిస్థితి నెలకొనడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భారత్‌లోని పంజాబ్, హర్యానాలతో పాటు పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో పెద్ద ఎత్తున జరుగుతున్న వ్యవసాయ వ్యర్థాల దహనమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన శాటిలైట్ డేటా ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది. అక్టోబర్ 1 నుంచి 29 మధ్య పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఏకంగా 13,241 వ్యవసాయ వ్యర్థాల దహనాలను గుర్తించగా, అదే సమయంలో భారత పంజాబ్‌లో 3,158 దహనాలు నమోదయ్యాయి. వాయవ్య దిశ నుంచి వీస్తున్న గాలులు ఈ పొగను ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతానికి మోసుకొస్తున్నాయి. దీనికి తోడు, వాతావరణంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, గాలి వేగం మందగించడం వంటి కారణాలతో కాలుష్య కారకాలు గాలిలోనే చిక్కుకుపోతున్నాయి. స్థానిక కాలుష్యానికి ఈ పొగ తోడవడంతో పరిస్థితి మరింత దిగజారింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (జీఆర్‌ఏపీ) స్టేజ్-2ను అమలులోకి తెచ్చారు. దీని కింద, రోడ్లపై నీళ్లు చల్లడం, యాంటీ-స్మాగ్ గన్‌ల వినియోగం, నిర్మాణ కార్యకలాపాలపై కఠిన నిఘా వంటి చర్యలు ముమ్మరం చేశారు. రాబోయే రోజుల్లో కూడా గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడం వల్ల కాలుష్యం మరింత ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అణు దాడి జరిగితే 24 గంటలు బయటకు రావొద్దు.. ప్రజలకు ఇరాన్ సంచలన సూచనలు!



ఢిల్లీ: అమెరికా దాడి చేస్తుందనే ఆందోళనల నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం ప్రజలకు అరుదైన అణు దాడి రక్షణ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఎనిమిది నిమిషాల నిడివి ఉన్న వీడియోలో అణు విస్ఫోటనం జరిగితే ఎలా ప్రాణాలు కాపాడుకోవాలో వివరించింది. భవనాల బేస్‌మెంట్లు, కిటికీలు లేని లోపలి గదుల్లో ఆశ్రయం పొందాలని, తలుపులు, కిటికీలు మూసివేయాలని సూచించింది. బయట గాలిని లోపలికి తీసుకొచ్చే ఏసీలు, వెంటిలేషన్ వ్యవస్థలను నిలిపివేయాలని తెలిపింది. దాడి తర్వాత కనీసం 24 గంటల పాటు ఆశ్రయంలోనే ఉండాలని, ప్యాక్ చేసిన ఆహారం, సీసాల్లోని నీటిని మాత్రమే వినియోగించాలని హెచ్చరించింది. ఈ మార్గదర్శకాలను ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్‌ఎన్‌ఏ అక్టోబర్ 29న ప్రచురించింది. ఒకవేళ అణు విస్ఫోటనం సమయంలో ఎవరైనా బయట ఉంటే.. పేలుడు వెలుగును నేరుగా చూడొద్దని, నేలపై పడుకుని తల, ముఖాన్ని కాపాడుకోవాలని సూచించింది. పేలుడు ప్రభావం తగ్గిన తర్వాత సమీపంలోని బలమైన భవనంలోకి వెళ్లాలని తెలిపింది. వాహనాల్లో ఆశ్రయం పొందడం సురక్షితం కాదని స్పష్టం చేసింది. రేడియోధార్మిక ధూళి శరీరంపై పడితే బయట దుస్తులను జాగ్రత్తగా తొలగించి, మూసిన సంచిలో ఉంచాలని, చర్మం, జుట్టును సబ్బు, గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించింది. రేడియేషన్ ప్రభావం తగ్గించేందుకు వాడే అయోడిన్ మాత్రలను వైద్యుల సలహా లేకుండా తీసుకోవద్దని హెచ్చరించింది. అధికారిక సమాచారం కోసం బ్యాటరీతో పనిచేసే రేడియోలను సిద్ధంగా ఉంచుకోవాలని కూడా పేర్కొంది. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్ అత్యవసర సేవల విభాగం రూపొందించిన ఈ వీడియో వెలువడటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. నతాంజ్ అణు కేంద్రానికి సమీపంలోని పికాక్స్ మౌంటెయిన్‌పై అమెరికా దాడి చేసే అవకాశం ఉందన్న ఊహాగానాల మధ్య ఈ సూచనలు వచ్చాయి. అక్టోబర్ 16న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకునే అవకాశాన్ని ప్రస్తావించినప్పటికీ, అణ్వాయుధాలు ఉపయోగించబోమని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడి కోసం అమెరికాపై ఒత్తిడి తెస్తున్నారంటూ జర్నలిస్ట్ టక్కర్ కార్ల్‌సన్ చేసిన ఆరోపణలు కూడా ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. అయితే ఈ మార్గదర్శకాలు ఇరాన్ నిర్వహిస్తున్న పౌర రక్షణ వారోత్సవాల్లో భాగంగా విడుదలయ్యాయని సమాచారం.

భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది: ఏపీఎస్డీఎంఏ అలర్ట్

అమరావతి: దక్షిణ కోస్తాంధ్రపై ప్రభావం చూపుతున్న 'మురసు' తీవ్ర తుపాను కారణంగా రానున్న మూడు గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి, ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం 'మురసు' తీవ్ర తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 6 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఇది బాపట్లకు 40 కి.మీ, ఒంగోలుకు 50 కి.మీ, విజయవాడకు 90 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో పోలవరం, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే, మన్యం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరుతో పాటు నెల్లూరు, కడప, నంద్యాల జిల్లాల్లోనూ అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ కీలక సూచనలు జారీ చేశారు. "భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉంది. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దు. ఆకస్మిక వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, 'మురసు' తుపాను క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ రోజు రాత్రి నుంచి ఈదురుగాలుల తీవ్రత కూడా తగ్గుముఖం పడుతుందని అంచనా వేశారు. అయినప్పటికీ, అధికార యంత్రాంగం నుంచి హెచ్చరికలు తొలగించే వరకు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

మురసు తుపాను: ఏపీకి అండగా ఉంటామన్న అమిత్ షా.. కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు

అమరావతి: మురసు తుపాను నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న తక్షణ సహాయానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర బృందాలతో రాష్ట్ర యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేస్తోందని, ప్రజల భద్రతే లక్ష్యంగా సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన వెల్లడించారు. అంతకుముందు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేసి మురసు తుపాను ప్రభావం, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీశారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే జాతీయ, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టి ప్రజలకు అండగా నిలుస్తున్నాయని అమిత్ షా తెలిపారు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని, ఏపీ ప్రజలకు పూర్తి భరోసా కల్పిస్తున్నామని ఆయన అన్నారు. అమిత్ షా భరోసాపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర బృందాలతో కలిసి రాష్ట్ర యంత్రాంగం సహాయక చర్యలు, రహదారుల పునరుద్ధరణ పనులు వేగంగా చేపడుతోందని వివరించారు. అందరి సమష్టి కృషితో వీలైనంత త్వరగా రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పుతామని, ప్రజల భద్రతకు సంపూర్ణ భరోసా ఇస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విధంగా, తుపాను సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ధైర్యం కల్పిస్తున్నాయి.

క్రమంగా బలహీనపడనున్న 'మురసు'!

ఒంగోలు సమీపంలో తీరం దాటిన మురసు తీవ్ర తుపాను ప్రస్తుతం దక్షిణ కోస్తాంధ్ర తీరంపై కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) వెల్లడించింది. ఈ తుపాను ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలహీనపడుతుందని వివరించింది. అయితే, దీని ప్రభావంతో నవంబర్ 3న కోస్తాంధ్ర, యానాం, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం, నేటి మధ్యాహ్నానికి ఇది తుపానుగా, అర్ధరాత్రికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడనుంది. నేడు కోస్తాంధ్ర, తెలంగాణతో పాటు రాయలసీమ, దక్షిణ ఒడిశాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది. దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో కూడా నవంబర్ 3, 4 తేదీలలో భారీ వర్షాలు పడతాయని ఐఎండీ పేర్కొంది. నవంబర్ 4న కోస్తాంధ్ర, యానాంలలో అతి భారీ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని అధికారులు సూచించారు. సురక్షిత ప్రాంతాలలో ఉండాలని, అనవసర ప్రయాణాలు చేయవద్దని హెచ్చరించారు.

మురసు తుపాను: వచ్చే 4-5 గంటలు కీలకం.. యంత్రాంగానికి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

అమరావతి: మురసు తుపాను ప్రభావం, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను తదనంతర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఒంగోలు-బాపట్లకు సమీపంలో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో తుపాను పయనిస్తోందని, రానున్న 4 నుంచి 5 గంటల సమయం అత్యంత కీలకమని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. చివరి వ్యక్తికి కూడా సహాయం అందే వరకు ప్రభుత్వ యంత్రాంగం విశ్రమించవద్దని ఆదేశించారు. "ఈరోజు సాయంత్రం వరకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దు. ప్రభుత్వం జారీ చేసే సూచనలను తప్పక పాటించాలి. క్షేత్రస్థాయిలో అధికారులు తక్షణమే స్పందిస్తుండటంతో బాధితుల్లో భరోసా కనిపిస్తోంది" అని తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాలైన ప్రకాశం, బాపట్లలో వర్షపాతం పెరిగిందని, వీటితో పాటు గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కూడా వర్షాలు కొనసాగుతాయని సీఎం తెలిపారు. ముఖ్యంగా 21 పట్టణ ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదవుతోందని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు తమ తమ ప్రాంతాల్లో చేపట్టిన చర్యలను సీఎంకు వివరించారు. ఒంగోలులో పలుచోట్ల పడిపోయిన చెట్లను వెంటనే తొలగించినట్లు, నెల్లూరు జిల్లాలో వ్యవసాయ భూముల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చెరువులు, రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయిలో లేనప్పటికీ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. తుపాను సమయంలో అద్భుతంగా పనిచేసిన అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరినీ ఆయన అభినందించారు. ఈరోజు రాత్రికి తుపాను తీవ్రత పూర్తిగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

డెమోక్రాట్లు గెలిస్తే 'మిస్టర్ వీటో'గా మారిపోతా.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే వారి ప్రతిపాదనలన్నింటినీ వీటో చేస్తానని హెచ్చరించారు. మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని, అయితే రాజ్యాంగ నిబంధనలు అందుకు అడ్డుగా ఉన్నాయని పేర్కొన్నారు. న్యూయార్క్ పోస్ట్ కాలమిస్ట్ మిరాండా డివైన్‌తో 'పాడ్ ఫోర్స్ వన్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ ఓటమి ఎదురైతే.. 'మిస్టర్ వీటో'గా మారతానని అన్నారు. నెల లేదా రెండు నెలల పాటు వరుసగా వీటోలు వేస్తే డెమోక్రాట్లు చర్చలకు వచ్చి ఒప్పందానికి అంగీకరిస్తారని వ్యాఖ్యానించారు. మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేసే అవకాశం వస్తే తప్పకుండా బరిలో ఉండాలని ఉందని ట్రంప్ చెప్పారు. అయితే రాజ్యాంగంలోని నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయని అంగీకరించారు. అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా ఎన్నికవడానికి వీల్లేదు. ట్రంప్ 2016, 2024 ఎన్నికల్లో విజయం సాధించారు. కాంగ్రెస్‌పై డెమోక్రాట్లు పట్టు సాధించి తనకు పనిచేసినవారిపై విచారణలు ప్రారంభిస్తే.. వారికి ముందస్తు క్షమాభిక్షలు ఇచ్చేందుకు సిద్ధమని ట్రంప్ వెల్లడించారు. గతంలో జనవరి 6 ఘటనకు సంబంధించి క్షమాభిక్షలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. డెమోక్రాట్లు ఆధిక్యంలో ఉన్నట్లు వెల్లడిస్తున్న సర్వేలను ట్రంప్ కొట్టిపారేశారు. అవి పక్షపాతంతో ఉన్నాయని ఆరోపించారు. రిపబ్లికన్లను సరిగా సర్వే చేయడం లేదని విమర్శించారు. డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనెట్‌తో పాటు భవిష్యత్తులో అధ్యక్ష పదవినీ గెలుచుకుంటే దేశం అంతమవుతుందని హెచ్చరించారు.

కుప్పంలో టీడీపీ క్లీన్ స్వీప్.. వైసీపీకి సున్నా

కుప్పం: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి విజయాల బాటలో పయనిస్తోంది. ముఖ్యంగా, చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీలో టీడీపీ అభ్యర్థులు అఖండ విజయం సాధించారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 32 వార్డులను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేశారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఒక్క సీటు కూడా దక్కలేదు. కనీసం ఖాతా కూడా తెరవకపోవడంతో ఆ పార్టీకి కుప్పంలో తీవ్ర నిరాశ ఎదురైంది. కుప్పం ఫలితం టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కుప్పంలో టీడీపీ సాధించిన ఈ ఘన విజయంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. ఫలితాలు వెలువడిన వెంటనే పలుచోట్ల బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఓటర్ల నమోదుపై శ్రద్ధ చూపాలి

హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క సూచించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ప్రజాభవన్‌లో వారు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. భట్టి మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం వారీగా పట్టభద్రులను ఓటర్ల జాబితాలో నమోదు చేయించడం, వారితో సమావేశం నిర్వహించడంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని సూచించారు. పొంగులేటి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శ్రద్ధతో పనిచేయాలన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించే బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను పరిశుభ్రమైన నగరంగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలి

హైదరాబాద్: హైదరాబాద్‌ను పరిశుభ్రమైన నగరంగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నగరంలో ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో చెత్త సేకరణకు ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్‌తో పాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో ప్రారంభించిన గ్రీన్ ట్యాంకర్లను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని అభిప్రాయపడ్డారు. జలమండలి తొలివిడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి గారితో పాటు హెచ్ఎండీఏ, మున్సిపల్ కార్పొరేషన్ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్

హైదరాబాద్: డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో శాశ్వత ప్రాతిపదికన యూత్ గేమ్స్ ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. ఈ క్రీడల కోసం అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో కూడిన క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. తెలంగాణలో నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో సమీక్షించారు. తెలంగాణ కర్రసాము క్రీడను కూడా ఆతిథ్య రాష్ట్ర కోటాలో ఖేలో ఇండియా క్రీడల్లో చేర్చే విధంగా వెంటనే కార్యాచరణ చేపట్టాలని ఈ సందర్భంగా సూచించారు. రానున్న కాలంలో ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, ప్రపంచస్థాయి క్రీడా శిక్షణను తెలంగాణ యువ క్రీడాకారులకు అందించేందుకు ఈ పోటీలను గొప్ప అవకాశంగా మలుచుకోవడం ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. క్రీడల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ కోసం గ్రూప్-1 స్థాయి అధికారులకు ఆయా బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. పలు క్రీడలు వివిధ జిల్లాల్లో నిర్వహిస్తున్నందున వాటి పర్యవేక్షణ కోసం స్థానికంగా పనిచేస్తున్న అధికారులను నియమించాలని అన్నారు. క్రీడాకారులకు వసతి సౌకర్యాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. యూత్ గేమ్స్ నిర్వహణ, పురోగతిపై ఇకనుంచి ప్రతి వారం సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో క్రీడా పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలలో అనవసరమైన ఆడంబరాలకు తావు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి వనరులను ఖేలో ఇండియా పోటీలకు సైతం ఉపయోగించుకోవాలని సూచించారు. క్రీడలు, క్రీడాభివృద్ధి రంగాలకు పెట్టుబడులను ఆకర్షించడం కూడా గ్లోబల్ సమ్మిట్‌లో అంతర్భాగమని, అందువల్ల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఖేలో ఇండియా క్రీడల్లో దేశవ్యాప్తంగా వేలాదిగా యువ క్రీడాకారులు పాల్గొననున్నారు. దాదాపు 2 వేల మంది కోచింగ్ సిబ్బంది, అధికారులు పాల్గొంటారు. రాష్ట్రంలో హైదరాబాద్ సహా ఆరు నగరాల్లో మొత్తం 20 వేదికలపై 27 రకాల క్రీడా పోటీలు, ఒక డెమో పోటీ నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సత్తా చాటే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు సమావేశంలో అధికారులు వివరించారు. వివిధ క్రీడల నిర్వహణ కోసం 20 వేదికల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై తెలిపారు. తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు గారు, వాకిటి శ్రీహరి గారు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి గారు, సలహాదారు కె. రామకృష్ణా రావు గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (స్పోర్ట్స్) ఎ. వాణీ ప్రసాద్ గారు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వీసీ, ఎండీ ఎ. సోనిబాలా దేవి గారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ-అటవీ సరిహద్దుల సమస్యలపై సర్వే

హైదరాబాద్: సంయుక్త సర్వేతోనే రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో రెవెన్యూ, అటవీ, భూమి కొలతలు-భూ దస్త్రాల నిర్వహణ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'సరిహద్దు వివాదాలతో సామాన్యులు, రైతులు నష్టపోకుండా.. రెండు శాఖలు సమన్వయంతో సంయుక్త సర్వే నిర్వహించాలి. రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది' అని స్పష్టంచేశారు.

శాస్త్రీయ పద్ధతుల్లో సంయుక్త సర్వే..

'రాష్ట్ర సరిహద్దుల్లో సమస్యలున్న చోట రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాలి. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తిగా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించి స్పష్టమైన సరిహద్దులు గుర్తించాలి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువగా అటవీ భూములు ఉన్నాయి. దశాబ్దాలుగా రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలున్నాయి. పట్టా భూములు, రెవెన్యూ, అటవీ శాఖల భూముల మధ్య కూడా వివాదాలు నెలకొన్నాయి. వీటన్నింటిని తేల్చేందుకు శాఖలు కలిసి సంయుక్త సర్వే చేపట్టాలి. క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించాలి. రికార్డులు, మ్యాప్‌లు, సర్వే వివరాలను సమగ్రంగా సరిపోల్చాలి. ఈ సమస్యలపై ఒక శాఖపై మరొక శాఖ నెట్టివేసే ధోరణి మారాలి. క్షేత్రస్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను అక్కడే పరిష్కరించాలి. ఉన్నతస్థాయి నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తే ఆ అంశాలను వెంటనే రాష్ట్రస్థాయికి నివేదించాలి' అని మంత్రి సూచించారు. సమీక్షలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, భూమి కొలతలు- భూ దస్త్రాల నిర్వహణ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ, అటవీ భూ సరిహద్దుల సమస్య పరిష్కార ప్రక్రియను తానే స్వయంగా పర్యవేక్షించనున్నట్లు పొంగులేటి స్పష్టం చేశారు. 'రెండు శాఖల మధ్య సమన్వయం, పురోగతికి ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తా. శాస్త్రీయంగా సరిహద్దులను నిర్ధరించడం ద్వారా భవిష్యత్తులో వివాదాలు పునరావృతం కావు. రాష్ట్రంలో భూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగా భూమి కొలతలు-భూ దస్త్రాల నిర్వహణ శాఖతో సంస్కరణలు అమలు చేస్తోంది. భూ రికార్డుల్లో పూర్తి పారదర్శకత, కచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ సర్వేకు క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజలు సహకరించాలి. జిల్లా, మండల స్థాయుల్లో రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి' అని సూచించారు.

ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం

రాష్ట్రంపై వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుపానులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, టెక్నాలజీని వాడుకుంటూ పక్కా ప్రణాళికతో పనిచేయడం వల్లే ప్రాణనష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం స్పందించిన తీరును ఆయన వివరించారు. తుపాను సహాయక చర్యల్లో భాగంగా రెస్క్యూ, రిలీఫ్, పునరావాసం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామని ఆయన తెలిపారు. "ఈ రెండు తుపానుల గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, గాలుల వేగాన్ని విశ్లేషించుకుంటూ ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు పక్కా సమాచారం అందించగలిగాం. 'అవేర్' (ూాబూ=జు) వేదిక ద్వారా విశ్లేషించుకుని, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నాం. గాలుల వేగం, వర్షపాతం, వరద నిర్వహణ వంటి అంశాలను 90 శాతం కచ్చితత్వంతో అంచనా వేశాం. ఈ అంచనాలను క్షేత్రస్థాయి వాస్తవాలతో పోల్చి చూసినప్పుడు మా విశ్లేషణ నిజమని తేలింది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ముందస్తు అంచనాల వల్లే ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సిబ్బందిని, అవసరమైన పరికరాలను మోహరించగలిగామని ఆయన చెప్పారు. అధికార యంత్రాంగాన్ని ఉన్నతస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కదిలించి, పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు తీసుకురాగలిగామని అన్నారు. విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, రాష్ట్రవ్యాప్తంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4095 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సీఎం తెలిపారు. 548 సబ్ స్టేషన్ల నుంచి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. "సాధారణంగా ఇంతటి నష్టాన్ని పూడ్చడానికి కనీసం 20 రోజులు పడుతుంది. కానీ పక్కా ప్రణాళికతో కేవలం 4 నుంచి 5 రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టగలిగాం" అని చంద్రబాబు వివరించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేశారని సీఎం ప్రశంసించారు. కుండపోత వర్షంలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారని, కూలిన చెట్లను తొలగిస్తూనే స్తంభాలు వేశారని గుర్తుచేశారు. ఆక్వా చెరువుల్లో పడిపోయిన స్తంభాలను సైతం తిరిగి నిలబెట్టారని, ఈ ప్రక్రియ కోసం పెద్ద ఎత్తున డ్రిల్లింగ్ మిషన్లను వినియోగించామని వివరించారు. ఈ సహాయక చర్యల్లో విద్యుత్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని చంద్రబాబు అభినందించారు. మొత్తం మీద, ముందస్తు అంచనాలు, టెక్నాలజీ వినియోగం, అధికార యంత్రాంగం సమన్వయం, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే తుపానుల ప్రభావాన్ని వీలైనంత త్వరగా అధిగమించి, సాధారణ పరిస్థితులు నెలకొల్పగలిగామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: బాలకృష్ణ రెంచెర్ల

గుండ్రతిమడుగులో పరామర్శల్లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్.



లోకల్ గైడ్ నవంబర్ 03. : మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని స్టేషన్ గుండ్రతిమడుగు గ్రామానికి చెందిన పలువురు నాయకులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ సత్యవతి రాథోడ్ పరామర్శించారు.ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న గ్రామ మాజీ సర్పంచ్ పాల్యా లాలు , శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ నాయకులు దేవత్ కబీర్ రెండు చేతులు విరిగి కోలుకుంటున్న ఇస్లావత్ బద్రు ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బోడ శ్రీను నాయక్, భూక్య కోటేష్, వీరన్న, సూర్య, తేజావత్ రాజు, భూక్య ధన్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ పట్టణం సాగర్ రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుండి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు వేయాలి.

నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి .



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్.: నల్లగొండ పట్టణం లోని 9వ డివిజన్ పరిధిలో సాగర్ రోడ్డు కొత్తగా నిర్మిస్తున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి వెంకటరమణ కాలనీకి లింక్ రోడ్డు వేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ రోడ్డు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సాగర్ రోడ్డు నుంచి వెంకటరమణ కాలనీ, వసుంధర కాలనీ, పటేల్ నగర్, సూర్యవంశం కాలనీ లతో పాటు చైతన్యపురి కాలనీలకు ఈ లింక్ రోడ్డు లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సాగర్ రోడ్ నుంచి కేవలం 100 మీటర్ల మేరకు ప్రభుత్వం స్థలం కేటాయించి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ భువనగిరి దేవేందర్,9 డివిజన్ కార్పొరేటర్ దీప్లా నాయక్, కార్పొరేటర్లు మారగొని భవాని గణేష్ , గోపగోని స్వాతి రాజశేఖర్ గౌడ్, టౌన్ యూత్ వైస్ ప్రెసిడెంట్ వజ్జ శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్ దండం పల్లి సత్తయ్య, రావుల శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ఎస్ నాయకులు దేపా రాంరెడ్డి, గోపగోని యాదయ్య , నరసింహ, మారేష్ , సైదులు , దేవరపల్లి ముత్తిరెడ్డి, మాధవరెడ్డి, కన్నె బోయిన రమేష్, కునుకుంట్ల శంకర్, కందుల నరేందర్, మన్నెం రాము,ముత్తి రెడ్డి, మాధవ్ రెడ్డి నేర్లకంటి సుధాకర్, నిలకంఠం నాగార్జున, లింగస్వామి, మామిడాల కృష్ణ, సురేష్ రెడ్డి, సత్యం,మాకమల్ల శివ,రుద్రాక్ష రవి, తదితరులు పాల్గొన్నారు

రైతులను ఆదుకోవాల్సిన సమయంలో రాజకీయాలు కాదు.. బాధ్యత ముఖ్యం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్. : నల్గొండ జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి విమర్శించారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుల సమస్యలపై చూపాల్సిన శ్రద్ధను చూపడం లేదని, ప్రజా సమస్యల పరిష్కారం కంటే తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో చూపాల్సిన శ్రద్ధను దోచుకోవడం, దాచుకోవడంపై చూపుతున్నారనే విమర్శలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. రైతుల కష్టాన్ని రాజకీయ ప్రచారానికి పరిమితం చేయకుండా, వారి పంటను సకాలంలో కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు, కాంటాలు, తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. రైతులను ఇలాగే నిర్లక్ష్యం చేస్తే భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన నిలబడి ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుతుందని డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, బీజేపీ నాయకులు వంగూరి రాఖీ,పాలకూరి రవిగౌడ్, మంగలిపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు

ప్రజల ఇబ్బందులు తొలగించడమే ప్రథమ ప్రాధాన్యత!

సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్

సర్పంచ్ ఆదేశాలతో భూపతిరాయుని చెరువు కట్టపై పిచ్చిమొక్కల తొలగింపు



కారేపల్లి, నవంబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్): గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ గాదెపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. గాదెపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని భూపతిరాయుని చెరువు కట్టపై పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి చెరువు కట్టపై రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ రంజిత్ కుమార్ చొరవపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని సర్పంచ్ చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విప్లవం ప్రకటనల్లో కాదు.. ప్రజల జీవితాల్లో కనిపించాలి!

కాగిత రహిత పాలనతోనే ప్రగతి సాధ్యం కాదు..

ఉద్యోగుల నైపుణ్యం నుంచి అధికారుల జవాబుదారీతనం వరకు

సమూల మార్పు వచ్చినప్పుడే డిజిటల్ తెలంగాణకు సార్థకత

సంపాదకీయం వనం రామకృష్ణ



కాలం మారుతోంది.. పాలనా పద్ధతులు మారుతున్నాయి.. ప్రజల అవసరాలు కొత్త రూపం సంతరించుకుంటున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం కూడా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల గుట్టలు తగ్గి, నిర్ణయాలు వేగవంతమై, ప్రజలకు సేవలు గడువులోగా అందితే అంతకంటే మంచి పరిపాలనా సంస్కరణ మరొకటి ఉండదు. ఈ లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ పాలనకు ప్రాధాన్యమివ్వడం ఆహ్వానించదగిన పరిణామం. అయితే సాంకేతికతను ప్రవేశపెట్టడమే పాలనా సంస్కరణ కాదు. దాని వల్ల సామాన్యుడి కష్టాలు తగ్గాయా? ప్రభుత్వ సేవల్లో వేగం పెరిగిందా? అవినీతి, జాప్యాలకు అడ్డుకట్ట పడిందా? అన్న ప్రశ్నలకు సమాధానం లభించినప్పుడే డిజిటల్ విప్లవం విజయవంతమైనట్లు.ప్రభుత్వ కార్యాలయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయ పని విధానాలను ఒక్కసారిగా మార్చడం అంత సులభం కాదు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానంపై పరిమిత అవగాహన ఉన్న ఉద్యోగులకు కొత్త విధానాలను పరిచయం చేయడం, వాటిపై నమ్మకం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. కంప్యూటర్లు అందించి, సాఫ్ట్‌వేర్ అమలు చేసి, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తే సరిపోదు. వాటిని సమర్థంగా వినియోగించే నైపుణ్యాన్ని కూడా పెంపొందించాలి. ప్రతి శాఖలో ఉద్యోగుల స్థాయిని బట్టి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. కొత్త విధానాలపై నిరంతర అవగాహన కల్పించడంతోపాటు సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు తక్షణ సహాయం అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఉద్యోగులను మార్పులకు దూరంగా ఉంచితే సంస్కరణలు కాగితాలకే పరిమితమవుతాయి. వారిని భాగస్వాములుగా మార్చితేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి.డిజిటల్ వ్యవస్థల అసలు ప్రయోజనం అధికారుల పనితీరులో జవాబుదారీతనాన్ని పెంచడమే. గతంలో ఒక ఫైలు ఏ అధికారి వద్ద ఉందో, ఎందుకు నిలిచిపోయిందో తెలుసుకోవడానికి సామాన్యుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఆన్‌లైన్ విధానంలో ఫైలు కదలిక, నిర్ణయాల స్థితి, పెండింగ్‌కు గల కారణాలు స్పష్టంగా తెలుసుకునే అవకాశం ఉంది. ఈ సదుపాయాన్ని ప్రజలకు అనుకూలంగా వినియోగించాలి. ప్రతి దరఖాస్తుకు పరిష్కార గడువు నిర్ణయించాలి. గడువు దాటితే సంబంధిత అధికారిని బాధ్యుడిని చేయాలి. జాప్యానికి కారణాలను నమోదు చేయాలి. ఒకరి వద్ద నుంచి మరొకరి వద్దకు ఫైలు బదిలీ చేస్తూ బాధ్యతను తప్పించుకునే పరిస్థితికి ముగింపు పలకాలి. సాంకేతికత అధికారుల పనిని సులభతరం చేయడమే కాకుండా వారి బాధ్యతను కూడా స్పష్టం చేయాలి.ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ప్రభుత్వ పనితీరును కొలిచే విధానం. ఎన్ని కంప్యూటర్లు కొనుగోలు చేశారు? ఎన్ని కార్యాలయాలకు డిజిటల్ సౌకర్యాలు కల్పించారు? ఎన్ని విభాగాలను ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చారు? అనే గణాంకాలతో విజయాన్ని ప్రకటించుకోవడం సరైంది కాదు. గతంలో నెల రోజులు పట్టిన పని ఇప్పుడు ఎన్ని రోజుల్లో పూర్తవుతోంది? పెండింగ్ దరఖాస్తులు ఎంత తగ్గాయి? ప్రజలు కార్యాలయాలకు ఎన్నిసార్లు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది? ఉద్యోగుల పనితీరు ఎంత మెరుగుపడింది? అన్న అంశాల ఆధారంగా ఫలితాలను అంచనా వేయాలి. ప్రతి శాఖకు నిర్దిష్ట లక్ష్యాలు విధించి, వాటి సాధనపై నెలవారీ సమీక్ష నిర్వహించాలి. పనితీరు వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. లోపాలను గుర్తించి సరిదిద్దే బాధ్యత ఉన్నతాధికారులదే.డిజిటల్ పాలనలో సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు ఉన్నవారికి ఆన్‌లైన్ సేవలు సులభమే. కానీ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, వృద్ధులు, నిరక్షరాస్యులు, దివ్యాంగులకు ఇవే సేవలు అందుకోవడం కష్టంగా మారవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం లేదనే కారణంతో ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, పౌర సేవలకు దూరం కాకూడదు. గ్రామ, మండల స్థాయిలో డిజిటల్ సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట ప్రత్యక్ష సేవలను కొనసాగించాలి. స్థానిక భాషలో మార్గదర్శకాలు అందించాలి. డిజిటల్ అక్షరాస్యతను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ఆధునిక సాంకేతికత కొందరికే ప్రయోజనం చేకూర్చి, మరికొందరికి అడ్డంకిగా మారితే అది సమగ్ర అభివృద్ధి అనిపించుకోదు.ఆర్థికంగా కూడా డిజిటల్ సంస్కరణలు సమర్థతను నిరూపించుకోవాలి. కంప్యూటర్లు, సర్వర్లు, సాఫ్ట్‌వేర్, నిర్వహణ, సైబర్ భద్రత కోసం వెచ్చించే నిధులు ప్రజాధనమే. అందువల్ల కొనుగోళ్లలో పారదర్శకత, నాణ్యత, దీర్ఘకాలిక నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి. తరచూ సాంకేతిక అంతరాయాలు ఏర్పడితే ప్రభుత్వ సేవలు నిలిచిపోతాయి. మరోవైపు పౌరుల వ్యక్తిగత సమాచారం, భూముల రికార్డులు, ఆర్థిక వివరాలు వంటి కీలక సమాచారం భద్రంగా ఉండాలి. సైబర్ దాడులు, సమాచార చోరీని నిరోధించేందుకు పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు అమలు చేయాలి. క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలి. విద్యుత్, ఇంటర్నెట్ అంతరాయాలు, సర్వర్ వైఫల్యాల సమయంలోనూ సేవలు కొనసాగేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలి.డిజిటల్ పాలన అంటే కేవలం కాగితాల వినియోగాన్ని తగ్గించడం కాదు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, ఒకే సమాచారాన్ని పదేపదే సమర్పించాల్సిన అవసరాన్ని తొలగించడం, ధ్రువపత్రాల కోసం ప్రజలు పడే ఇబ్బందులను తగ్గించడం కూడా అందులో భాగమే. ప్రజల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపే వ్యవస్థ ఉండాలి. సేవలపై పౌరుల అభిప్రాయాలను సేకరించాలి. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సాంకేతిక విధానాల్లో అవసరమైన మార్పులు చేయాలి. ప్రభుత్వ సంస్కరణలు ప్రజల అవసరాలకు అనుగుణంగా నిరంతరం మెరుగుపడాలి.డిసెంబర్ 1 నాటికి డిజిటల్ లక్ష్యాలను చేరుకోవడం ఒక పరిపాలనా మైలురాయి కావచ్చు. కానీ ఆ తేదీతో ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదు. అసలు పరీక్ష ఆ తర్వాతే ప్రారంభమవుతుంది. వ్యవస్థలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయా? ఉద్యోగులు వాటిని సమర్థంగా వినియోగిస్తున్నారా? ప్రజలకు సేవలు గడువులోగా అందుతున్నాయా? అన్నది నిరంతరం పరిశీలించాలి. ప్రకటనలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య అంతరం లేకుండా చూడాలి.ప్రజలకు కావాల్సింది డిజిటల్ కార్యాలయాల సంఖ్య కాదు.. తమ సమస్యలకు పరిష్కారం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి గొప్ప ప్రకటనలు కాదు.. అవినీతి, జాప్యం లేని సేవలు. ప్రభుత్వానికి సాంకేతిక హంగులు సమకూరడం ప్రగతికి ఆరంభం మాత్రమే. ప్రజల సమయం, శ్రమ, డబ్బు ఆదా కావడం అసలైన ప్రగతి. లికంప్యూటర్ల ముందు ఫైళ్లు కదిలితే అది కంప్యూటరీకరణ.. ఆ ఫైళ్లతోపాటు ప్రజల కష్టాలు కదిలిపోయినప్పుడే అది నిజమైన డిజిటల్ పాలన. తెలంగాణ ప్రభుత్వం గుర్తించాల్సిన అసలైన విజయసూత్రం ఇదే!

వనం రామకృష్ణ,
(జుఇ– ఈనాడు).
మేడ్చల్ జిల్లా లోకల్ గైడ్ ప్రతినిధి.

పేదల వైద్యం, విద్యకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట...

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల

శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి లో నిర్మాణంలో వున్న 100 పడకల

ఆసుపత్రి పనులను తనిఖీ చేసిన మంత్రి



ఖమ్మం/కూసుమంచి, నవంబర్ -3: లోకల్ గైడ్: సంక్షేమ కార్యక్రమాలతో పాటు వైద్య, విద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి, పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం గంగబండ తాండా వద్ద రూ. 45.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒకటో బ్లాక్ స్లాబ్ సెంట్రింగ్, స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు జరుపుతున్నట్లు, రెండో బ్లాక్ స్లాబ్ వేసినట్లు అధికారులు తెలిపారు. రెండో బ్లాక్ కాలం కాంక్రీట్ పనులు జరుగుతున్నట్లు మంత్రికి వివరించారు. నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవాళ్ల పిల్లలకు కూడా ఉన్నతమైన విద్యను అందించడంతో పాటు, పేదవాడికి రోగమొస్తే నయం చేసుకునే ఆర్థిక స్థోమత లేని పరిస్థితుల్లో రోడ్డున పడకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన ప్రతిచోటా 100 పడకల ఆసుపత్రులతో పాటు మౌళిక వసతులను ఏర్పాటు చేస్తూ, ఆసుపత్రుల రిక్వైర్మెంట్ బట్టి డాక్టర్లను కూడా కేటాయిస్తున్నామని తెలిపారు.గతంలో పేదవాడికి జబ్బు చేస్తే "అయ్యో.. ఇంత పెద్ద జబ్బు చేసింది, వైద్యం చేయించుకోవడానికి నా దగ్గర డబ్బు ఏముంది, నాకు చావే గతి" అనే రోజులు ఉండేవని, కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి పూర్తి భద్రత, భరోసా కల్పిస్తున్నామని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం తీసుకునే వారికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ధనికులకు ఏ రకమైన వసతులు అందుబాటులో ఉన్నాయో, అదే విధంగా పేదవాళ్లకు కూడా వైద్య, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో సైతం వైద్య రంగానికి కావలసిన పూర్తి మౌళిక వసతులను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.మంత్రి పర్యటన సందర్భంగా డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వైద్య శాఖ ఈఈ టీ. ఉమామహేశ్వర రావు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి రక్షణ కరువవుతోందా

చిన్నారులపై పెరుగుతున్న లైంగిక దాడులు.. సమాజం

తలదించుకునే పరిస్థితులు

చట్టాలు కఠినంగా అమలు చేయాలి..

నిందితులకు సత్వర శిక్షలు పడాలి

డాక్టర్ కె. సుధారాణి, జాతీయ యువజన అవార్డు గ్రహీత,

భారత ప్రభుత్వం, సామాజిక కార్యకర్త



కుత్బుల్లాపూర్ నవంబర్ 03 లోకల్ గైడ్ ప్రతినిధి : దేశ భవిష్యత్తుకు పునాదులైన చిన్నారుల బాల్యం నేడు అభద్రత మధ్య గడుస్తోంది. సాంకేతికంగా సమాజం ఎంతగానో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచార ఘటనలు మానవత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. అభం శుభం తెలియని పసిపిల్లల జీవితాలను కొందరు దుర్మార్గులు తమ కామవాంఛలకు బలిచేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల వార్తలు సమాజాన్ని కలచివేస్తున్నాయని జాతీయ యువజన అవార్డు గ్రహీత, సామాజిక కార్యకర్త డాక్టర్ కె. సుధారాణి ఆవేదన వ్యక్తం చేశారు.

కన్నవారే నమ్మలేని పరిస్థితులు.

ఒకప్పుడు అపరిచిత వ్యక్తుల నుంచి మాత్రమే పిల్లలకు ప్రమాదం ఉంటుందని భావించేవాళ్లం. కానీ నేటి పరిస్థితుల్లో కన్నవారు, సొంత బంధువులు, కుటుంబానికి దగ్గరగా ఉండే పరిచయస్తుల నుంచే చిన్నారులకు ప్రమాదాలు ఎదురవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. బడికి వెళ్లే వయసులో, ఆటపాటలతో ఆనందంగా గడపాల్సిన బాల్యంలోనే ఇలాంటి దాడులకు గురవడం అత్యంత బాధాకరం. పిల్లలు ఎవరితో ఉండాలి? ఎవరిని నమ్మాలి? అనే ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంటోంది.

కఠిన చట్టాలున్నా ఆగని అఘాయిత్యాలు..

చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టేందుకు పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) చట్టం వంటి కఠినమైన చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ నేరాలు పూర్తిగా నియంత్రణలోకి రావడం లేదని సుధారాణి పేర్కొన్నారు. నిర్భయ, దిశ వంటి చర్యలు, చట్టపరమైన వ్యవస్థలు ఉన్నప్పటికీ నేరస్తుల్లో శిక్షల పట్ల భయం కలగాల్సిన స్థాయిలో అమలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసుల విచారణలో జాప్యం, న్యాయం అందడంలో ఆలస్యం బాధిత కుటుంబాలకు మరింత మానసిక వేదన కలిగిస్తున్నాయని తెలిపారు.

బాలల రక్షణ సమాజం మొత్తం బాధ్యత.

చిన్నారులపై లైంగిక దాడులు కేవలం బాధిత కుటుంబానికి సంబంధించిన సమస్యగా చూడకూడదు. ఇది సమాజం మొత్తం స్పందించాల్సిన తీవ్రమైన సామాజిక సమస్య. ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థలు, న్యాయవ్యవస్థలు సమన్వయంతో పనిచేసి నేరాలను అరికట్టేందుకు మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి. పోక్సో కేసులను వేగంగా విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల పనితీరును బలోపేతం చేయాలి. నేరం రుజువైన వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు సకాలంలో పడేలా చూడాలి. అదే సమయంలో బాధిత చిన్నారులకు న్యాయం, వైద్య సహాయం, మానసిక కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలని సూచించారు.

ప్రతి ఇంటి నుంచే బాలల భద్రతపై అవగాహన ప్రారంభం కావాలి..

పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వయసుకు తగిన అవగాహన కల్పించాలి. ఏదైనా ఇబ్బంది ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పేలా ప్రోత్సహించాలి. పిల్లలు చెప్పే మాటలను నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధగా వినాలి. పాఠశాలలు, విద్యాసంస్థలు, బాలల సంరక్షణ కేంద్రాల్లో భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలి.

బాల్యాన్ని కాపాడితేనే దేశ భవిష్యత్తు భద్రం..

ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోని ఆడపిల్లలను ఎంత బాధ్యతగా చూసుకుంటారో సమాజంలోని ప్రతి చిన్నారిని కూడా అంతే బాధ్యతతో కాపాడుకోవాలి. బాలలపై అఘాయిత్యాలకు పాల్పడే నేరస్తులకు చట్టపరంగా కఠిన శిక్షలు పడటంతో పాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజం అప్రమత్తంగా ఉండాలి. చిన్నారులకు భయంలేని బాల్యాన్ని, సురక్షితమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. బాల్యం కన్నీటిపర్యంతం కాకుండా, చిరునవ్వులతో వికసించేలా చేయడమే మనందరి లక్ష్యం కావాలని డాక్టర్ కె. సుధారాణి పిలుపునిచ్చారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చంద్రకుమార్ రెడ్డి

కామ్రేడ్ పోట్ల రామ నరసయ్య త్యాగం మరువలేనిది!

ప్రజా హక్కుల కోసం ఉద్యమాలను బలోపేతం చేయాలి -- అశోక్ అన్న



కారేపల్లి, నవంబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్): భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం సాగిన పోరాటంలో ప్రాణాలర్పించిన పోట్ల రామ నరసయ్య త్యాగం మరువలేనిదని సీపీఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ అన్న అన్నారు. అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని, దోపిడీ, పీడనలేని నూతన సమాజ నిర్మాణానికి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని శాంతినగర్ గ్రామంలో నవంబర్ 2న పోట్ల రామ నరసయ్య 50వ వర్ధంతి సభ భూక్య శివ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్ అన్న మాట్లాడుతూ.. పోట్ల రామ నరసయ్య పీడిత, తాడిత ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. గోదావరి లోయ ప్రాంతంలో భూస్వాములు, పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా, తునికాకు కార్మికుల హక్కుల కోసం, వడ్డీ వ్యాపారుల దోపిడీతో పాటు అటవీశాఖ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అనేక ప్రజా పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమం ద్వారా గోదావరి లోయ ప్రాంతంలో ఆదివాసీ, గిరిజన పేదలకు లక్షలాది ఎకరాల పోడు భూములు దక్కేలా పోరాటాలు సాగాయని పేర్కొన్నారు. ఆనాటి ప్రభుత్వం పోట్ల రామ నరసయ్యతో పాటు పలువురు విప్లవకారులను నిర్బంధించి, బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చిందని విమర్శించారు. ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల పోరాట స్ఫూర్తిని నేటి తరాలు కొనసాగించాలని అన్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల విస్తరణ కారణంగా శాంతినగర్, బేకులగూడెం తదితర గిరిజన గ్రామాల్లో వందలాది ఎకరాల సాగుభూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధిత గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తుల దోపిడీకి, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై ఐక్య పోరాటాలు సాగించాలని అన్నారు. అమరవీరుల త్యాగాలను వృథా కానివ్వకుండా వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, బాలకృష్ణ, వెంకన్న, హరిబాబు, రాంబాబు, రాధా, గురువమ్మ, రాజు, బచ్చల కృష్ణ, రవి, మేస్త్రి వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న మాదారం కాంగ్రెస్ నేత అజ్మీర నరేష్ కుమార్!

సంగయ్యకు ప్రాణాపాయం తప్పేలా సకాలంలో వైద్య సహాయం..

కిమ్స్‌కు తరలింపులో చొరవ




కారేపల్లి, నవంబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్): ఆపదలో ఉన్న వ్యక్తికి ఆపన్నహస్తం అందించి, సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చొరవ చూపి మానవత్వాన్ని చాటుకున్నారు కాంగ్రెస్ నాయకుడు అజ్మీర నరేష్ కుమార్. ఆయన తక్షణ స్పందనతో మిరియాల సంగయ్యకు అత్యవసర వైద్యం అందడంతో ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడే అవకాశం లభించింది.సింగరేణి మండలం మాదారం గ్రామ పంచాయతీకి చెందిన మిరియాల సంగయ్య గత కొంతకాలంగా లివర్ ఇన్ఫెక్షన్, మూత్ర సంబంధిత సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదు రోజులుగా ఆహారం తీసుకోలేని పరిస్థితితో పాటు మూత్రనాళాల్లో అడ్డంకులు ఏర్పడి తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని సంగయ్య మేనల్లుడు, న్యూ డెమోక్రసీ నాయకుడు రావుల నాగయ్య కాంగ్రెస్ నాయకుడు అజ్మీర నరేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.విషయం తెలుసుకున్న నరేష్ కుమార్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో ప్రైవేట్ వాహనంలో సంగయ్యను ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో వైద్యులు తక్షణ చికిత్స ప్రారంభించి, యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య ప్రక్రియ ద్వారా దశలవారీగా సుమారు ఐదు లీటర్ల మూత్రాన్ని తొలగించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.సంగయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న సమయంలో నరేష్ కుమార్ సుమారు ఐదు గంటల పాటు ఆస్పత్రిలోనే ఉండి వైద్య సేవలు అందేలా ప్రత్యేక చొరవ చూపారు. ప్రస్తుతం మూడు రోజులుగా కిమ్స్ ఆస్పత్రిలో సంగయ్యకు వైద్య చికిత్స కొనసాగుతోంది. ఆపద సమయంలో వెంటనే స్పందించి తమ కుటుంబానికి అండగా నిలిచిన అజ్మీర నరేష్ కుమార్‌కు సంగయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాదారం గ్రామంలో ఇప్పటికే అనేక కుటుంబాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న నరేష్ కుమార్ సేవా గుణంపై గ్రామస్తులు, సన్నిహితులు, పలువురు రాజకీయ ప్రముఖులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల నిస్వార్థ సేవలే సమాజానికి ఆదర్శం...

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విద్యుత్ శాఖల లైన్ ఇన్స్పెక్టర్ గడ్డికొప్పుల రాములు ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్న మంత్రి



తిరుమలాయపాలెం, నవంబర్- 03: లోకల్ గైడ్ : ఉద్యోగుల నిస్వార్థ సేవలే సమాజానికి ఆదర్శమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, విద్యుత్ శాఖలో లైన్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగ విరమణ చేసిన గడ్డికొప్పుల రాములు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాములు వారి కుటుంబ సభ్యులను మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యుత్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు, రైతులకు విశేష సేవలందించి రాములు ఉద్యోగ విరమణ పొందారన్నారు. ఉద్యోగంలో చేరినప్పుడే విరమణ తేదీ ఖరారవుతుందని, అయితే, సర్వీసులో ఉన్నంత కాలం ప్రజలకు, రైతులకు మనం అందించిన సేవలే ఉద్యోగ విరమణ తర్వాత కూడా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. రాములు విద్యుత్ శాఖలో పనిచేసిన కాలంలో అందించిన సేవలు, చేసిన మంచి పనుల వల్లే ఈరోజు వర్షం పడుతున్నప్పటికీ వందలాది మంది రైతులు, ప్రజలు ఆత్మీయంగా తరలివచ్చారన్నారు. ఉద్యోగి సేవా కాలం ముగిసిన తర్వాత కూడా ప్రజలు వారిని గుర్తుపెట్టుకోవడమే అసలైన విజయమని మంత్రి తెలిపారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులకైనా, ప్రభుత్వ ఉద్యోగులకైనా భగవంతుడు ప్రజలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశాన్ని ఇస్తాడని, ఆ అవకాశాన్ని సొంత లాభం కోసం కాకుండా, ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించినప్పుడే జన్మకు సార్థకత లభిస్తుందని మంత్రి అన్నారు. రాములు ఉద్యోగానికి మాత్రమే రిటైర్మెంట్ ఇచ్చారు కానీ, సమాజ సేవకు కాదని, ఇప్పటివరకు పొందిన అనుభవంతో ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తూ, ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో చిన్నారి వైష్ణవి అరుదైన ఘనత..

ఒకేసారి 12 ప్రపంచ రికార్డులు!

12 గంటల పాటు ఏకధాటిగా నృత్య ప్రదర్శన.. 122 భంగిమలు, 522 పాటలకు అనుగుణంగా ప్రదర్శన

ప్రపంచ రికార్డుల నేషనల్ కోఆర్డినేటర్ లయన్ కె.వి. రమణారావు చేతుల మీదుగా రికార్డుల ధ్రువీకరణ పత్రాల అందజేత





కుత్బుల్లాపూర్ నవంబర్ 3 (లోకల్ గైడ్ ప్రతినిధి) : కూచిపూడి నృత్య కళలో తన అసాధారణ ప్రతిభతో 12 ఏళ్ల చిన్నారి రుంకు వైష్ణవి ఒకేసారి 12 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. స్పందన నృత్యకేళి స్కూల్ ఆఫ్ డాన్స్ ఆధ్వర్యంలో కొంపల్లిలోని పియర్సన్ స్కూల్ వేదికగా నిర్వహించిన 'గణ నృత్యం' కార్యక్రమంలో వైష్ణవి ఏకధాటిగా 12 గంటల పాటు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి అందరినీ అబ్బురపరిచింది. మొత్తం 122 నృత్య భంగిమలను ప్రదర్శిస్తూ, 522 పాటలకు అనుగుణంగా నృత్యం చేసి తన ప్రతిభను చాటుకుంది.ఈ వినూత్న ప్రపంచ రికార్డుల కార్యక్రమానికి ప్రముఖ కూచిపూడి నృత్య గురువు డాక్టర్ ఎన్. రవికుమార్ రూపకల్పన చేసి, తన ఆలోచనను కార్యరూపంలోకి తీసుకొచ్చారు. చిన్నారి వైష్ణవి చేసిన సుదీర్ఘ నృత్య ప్రదర్శనను పరిశీలించిన పలు ప్రపంచ రికార్డుల సంస్థలు ఆమె ప్రతిభను గుర్తించి రికార్డులధ్రువీకరణపత్రాలనుఅందజేశాయి.యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నోబెల్ వరల్డ్ రికార్డ్స్, భారత్ వరల్డ్ రికార్డ్స్, నేషనల్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్ బుక్, అమేజింగ్ కిడ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఎక్సెలెన్సీ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, ఇండియా ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్స్, తెలుగు వరల్డ్ రికార్డ్స్, హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, చిల్డ్రన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఢిల్లీ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థల్లో వైష్ణవి తన పేరును నమోదు చేసుకుంది.ఈ కార్యక్రమానికి భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు, ప్రపంచ రికార్డుల నేషనల్ కోఆర్డినేటర్ లయన్ కె.వి. రమణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ రికార్డుల జ్యూరీ సభ్యురాలు, మిస్ గార్జియస్ ఇండియా-2026 టైటిల్ విజేత అలిసియా జోసెఫ్, రాష్ట్ర ప్రతినిధి దండు ఉషశ్రీ తదితరులు పాల్గొని వైష్ణవి నృత్య ప్రదర్శనను వీక్షించారు. అనంతరం వైష్ణవికి 12 ప్రపంచ రికార్డుల గుర్తింపు పత్రాలను అందజేశారు.జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు బొంగూరి మహేందర్ రెడ్డి కార్యక్రమానికి హాజరై చిన్నారి వైష్ణవి ప్రతిభను అభినందించారు. ఈ ఘనత సాధించేందుకు కృషి చేసిన నృత్య గురువు డాక్టర్ ఎన్. రవికుమార్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు.అలాగే ప్రముఖులు నెమూరి శంకర్ గౌడ్, ప్రేమ్ కుమార్, అల్లాడి తనీష్, ఎరుకొండ రాజు, కుప్ప శ్రీకాంత్ గౌడ్, జక్క కృష్ణ, నందగిరి సతీష్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని వైష్ణవికి అభినందనలు తెలిపారు.కేవలం 12 ఏళ్ల వయసులో 12 గంటల పాటు అలుపెరగకుండా కూచిపూడి నృత్యం చేయడం విశేషమని పలువురు పేర్కొన్నారు. చిన్నారి వైష్ణవి సాధన, పట్టుదల, క్రమశిక్షణ, కళ పట్ల అంకితభావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సంప్రదాయ కూచిపూడి నృత్య కళకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో ఈ కార్యక్రమం ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

నీటిపాలైన పంటలు.. కన్నీటిపాలైన రైతులు!

ఎల్‌నినో కష్టాలకు తుఫాన్ల దెబ్బ..

సింగరేణి మండల రైతుల ఆవేదన

పంట నష్టాలను అంచనా వేసి రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి







కారేపల్లి, నవంబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్): ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తే ప్రకృతి వైపరీత్యాలు మా బతుకులను ఆగమాగం చేస్తున్నాయని సింగరేణి మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇప్పుడు ఆర్నబ్, మురుసు తుఫాన్ల ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు తమ ఆశలపై నీళ్లు చల్లాయని కన్నీటిపర్యంతమవుతున్నారు. పత్తి పంట సాగు కోసం వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, తీరా పంట మొలకెత్తిన దశలోనే అధిక వర్షాలతో మొక్కలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. మరికొన్ని పొలాల్లో పత్తి తడిసి నల్లబడిపోవడంతో నాణ్యత తగ్గి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన చెందుతున్నారు. పత్తి పంటపై ఎన్నో ఆశలు పెట్టుకుంటే వర్షాలు మా కష్టాన్ని మట్టిలో కలిపేశాయని అంటున్నారు. మరోవైపు చేతికొచ్చే దశలో ఉన్న వరి పంటలు వర్షాల ధాటికి నేలకొరిగి నీటిలో మునిగిపోయాయని రైతులు చెబుతున్నారు. నెలల తరబడి కష్టపడి పండించిన వరి పంట కోతకు వచ్చే సమయంలో ఇలా నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, పొలాల్లో నీరు నిలిచిపోవడంతో ధాన్యం మొలకెత్తి పనికిరాకుండా పోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం గిట్టుబాటు కాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల కోసం అప్పులు చేసి సాగు చేశామని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు పంటలు దెబ్బతినడంతో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని, చేసిన అప్పులు ఎలా తీర్చాలో, కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు.

కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం

సొంత భూములు లేక ఇతరుల భూములను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. భూమి కౌలు చెల్లించడంతో పాటు సాగు కోసం చేసిన అప్పులు తమపై భారంగా మారాయని, పంట నష్టపోతే కనీసం పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపరిహారం అందించే సమయంలో కౌలు రైతులను కూడా గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి

సింగరేణి మండలవ్యాప్తంగా వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు వెంటనే గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పత్తి, వరి పంటలను పరిశీలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మొలకెత్తిన పత్తి, నల్లబడిన పత్తి, నేలకొరిగిన వరి పంటలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి నివేదికలు రూపొందించాలని కోరుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే నష్టపోయిన తమకు తుఫాన్ల రూపంలో మరో దెబ్బ తగిలిందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తమను ఆదుకోకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోయి వ్యవసాయాన్ని కొనసాగించలేని పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భూమి రైతులతో పాటు కౌలు రైతులకు కూడా అర్హత మేరకు పంట నష్టపరిహారం, పంటల బీమా అందించాలని కోరుతున్నారు."కష్టపడి పంటలు పండించినా ప్రకృతి మమ్మల్ని బతకనివ్వడం లేదు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఒకవైపు.. చేతికొచ్చిన పంట నీటిపాలవడం మరోవైపు మమ్మల్ని కుంగదీస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంట నష్టాలను అంచనా వేసి తక్షణమే పరిహారం అందించాలి. రైతులను, కౌలు రైతులను ఆదుకొని వ్యవసాయాన్ని బతికించాలి" అని సింగరేణి మండల రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం...

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఏదులాపురం మునిసిపాలిటీ 14, 15, 16 వార్డులలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి





ఏదులాపురం, నవంబర్- 3: లోకల్ గైడ్: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం ఏదులాపురం మునిసిపాలిటీ 14,15,16 వార్డులు తెల్దార్ పల్లి లో రూ. 312.90 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షంలోనూ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు ఈ ప్రభుత్వంపై వారికున్న ప్రేమను చాటుతున్నాయన్నారు. తెల్లవారుపల్లి లో మూడు డివిజన్ల పరిధిలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల కోసం పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని తెలిపారు. గత 33 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కేవలం తెల్లవారుపల్లి ప్రాంత పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 16.86 కోట్లు వెచ్చించి శంకుస్థాపనలు, పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే, తెల్దారుపల్లి లో మొత్తం 105 ఇందిరమ్మ ఇళ్లను రూ. 5.25 కోట్లతో మంజూరు చేయడం జరిగిందని, పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం ద్వారా పేదవాడి గుమ్మానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు.పేదింటి ఆడబిడ్డలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీతో పాటు ఎకరానికి రూ. 12,000 రైతు భరోసా ఆర్థిక సహాయం, తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ, ఆసరా పింఛన్లు, నిరుపేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల క్రింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా గడచిన 33 నెలల్లో రూ. 73 వేల కోట్లు సున్నా వడ్డీకే మహిళలకు అందించామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేస్తున్నామన్నారు.


భూముల సమగ్ర సర్వే, అర్హులైన రైతులందరికీ 'భూధార్' కార్డుల జారీ


రాష్ట్రంలో సుమారు 125 సంవత్సరాల క్రితం భూముల సర్వే జరిగిందని, ఈనాడు రాష్ట్రంలో ఉన్న ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూములున్న ఆసాములకు పూర్తి భరోసా కల్పించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ సర్వేను వెంటనే చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. తెల్దారుపల్లి లో రాబోయే కొద్ది రోజుల్లోనే గ్రామమంతా సర్వే చేయించి, అర్హులైన వారందరికీ న్యాయబద్ధమైన భూములను కేటాయించనున్నామన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో సహా, ప్రతి మనిషికి ఆధార్ ఏ విధంగా అయితే ఉంటుందో అదేవిధంగా ప్రతి భూమికి భూధార్ ను మ్యాప్‌తో సహా అందిస్తామని మంత్రి తెలిపారు. తెల్దారుపల్లి ప్రాంత ప్రజల కొరకు నాగార్జున సాగర్ కాల్వపై రూ. 5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి కూడా అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాతి అని మంత్రి అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, గడిచిన ఒక నెల, నెలన్నర రోజుల్లోనే ఎదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్‌లో దాదాపు రూ. 35 నుండి 40 కోట్ల వరకు అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. యంత్రాంగం తరఫున ప్రతి ఒక్క పనిని చాలా త్వరగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వన్ హెల్త్ డే సందర్భంగా సీఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు

11 మాంసం దుకాణాలు, 4 డెయిరీ ఫారాల పరిశీలన.. ప్రజారోగ్యంపై అవగాహన







సైబరాబాద్, నవంబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మానవ ఆరోగ్యం, జంతు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పరస్పరం అనుసంధానమై ఉన్నాయనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వన్ హెల్త్ డే సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎంసీ వెటర్నరీ, వైద్య, పారిశుధ్య విభాగాలతో పాటు మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎంఎస్యూ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా అధికారులు 11 మాంసం దుకాణాలు, 4 డెయిరీ ఫారాలను తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్య పరిస్థితులు, జంతువుల ఆరోగ్యం, జంతు వ్యర్థాల నిర్వహణ, వాటి పారవేత విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణం, వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల ప్రజారోగ్యానికి కలిగే ప్రమాదాలను అధికారులు గుర్తించారు. అవసరమైన చోట సరిదిద్దాల్సిన చర్యలను సూచించారు. మాంసం విక్రేతలు, డెయిరీ కార్మికులకు సురక్షితమైన ఆహార నిర్వహణ, వ్యక్తిగత పరిశుభ్రత, పని ప్రదేశాల శుభ్రత, కలుషితాన్ని నివారించడం, వ్యర్థాలను సక్రమంగా పారవేయడంపై అవగాహన కల్పించారు. మానవులు, జంతువులు, పర్యావరణ ఆరోగ్యం ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నందున సమన్వయంతో ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం అవసరమని అధికారులు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణ వాతావరణాన్ని కల్పించడమే సీఎంసీ లక్ష్యమని పేర్కొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చాలకపల్లి రెండెళ్లి

గర్రెపల్లి గ్రామం రైతు వేదిక లో రైతులకు అవగాహన సదస్సు





పెద్దపల్లి జిల్లా నవంబర్ 03 (లోకల్ గైడ్) : భూసార పరిరక్షణే ధ్యేయంగా వ్యవసాయ శాఖ వారు నిర్వహిస్తున్న ఖేతి బచావో (సేవ్ ఫార్మ్ కాంపెయిన్) భూసార పరిరక్షణ కార్యక్రమం మండలంలోని గర్రెపల్లి గ్రామం రైతు వేదిక లో రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. మండలవ్యవసాయాధికారి ఈ.పైడితల్లి మాట్లాడుతూ భూసార పరిరక్షణ కొరకు మట్టి నమూనాను సేకరించి వ్యవసాయ శాఖ కు ఇచ్చినట్లయితే ల్యాబ్ కు పంపించి ఫలితాలను రైతులకు అందజేస్తామని తెలియజేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గత సీజన్ లో సేకరించిన మట్టి నమూనా ఫలితాలను రైతులకు అందజేస్తూ, ఫలితాల ఆధారంగా సిఫారసు చేయబడిన ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పెద్దపల్లి నుండి శాస్త్రవేత్త డా. ఓదెల సంపత్ కార్యక్రమానికి హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.(ఎల్నినో) విపత్తు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న అపరాల వంటి పంటలు వేసుకోవాలని రైతులకు తెలియజేయడం జరిగింది. వరి కొయ్యకాలు కలబెట్టకుండా తిరిగి భూమిలో కలియ దున్నుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, గర్రెపల్లి ఏ ఈ ఓ ఆనందరావు రైతులు పాల్గొన్నారు.

నవంబర్ 15న బహిరంగ సభ జయప్రదం చేయండి.

కార్మిక కర్షక ఐక్య పోరాటాలు కొనసాగిద్దాం.

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : నవంబర్ 15 నుండి 18 వరకు నల్గొండ పట్టణంలో జరుగు అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 15 జరుగు బహిరంగ సభ లో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని కార్మికకర్షక ఐక్యతను చాటాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం పిలుపునిచ్చారు.మంగళవారం సిఐటియు నల్గొండ పట్టణ సమన్వయ కమిటీ సమావేశం దొడ్డి కొమరయ్య భవన్లో జరిగింది. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ కార్మికుల పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు వ్యవసాయాన్ని కార్పొరేట్ఈకరణ చేయడం కోసం రైతులను కూలీలుగా మార్చే కుట్ర చేస్తూ కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ప్రభుత్వ విధానాలకు నిరసనగా కార్మికులు కర్షకులు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నవంబర్ 15 నుంచి 18 వరకు 36వ జాతీయ మహాసభలు నల్గొండ పట్టణంలో జరుగుతున్న సందర్భంగా 15న జరిగే బహిరంగ సభకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని రైతాంగానికి మద్దతు నిలవాలని పిలుపునిచ్చారు.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ అఖిలభారత 36వ రైతు మహాసభ సందర్భంగా నల్గొండ పట్టణంలో ఉన్న వివిధ రంగాల కార్మికులు స్వాగతం పలుకుతూ పట్టణం ఎరుపుమయం అయ్యే విధంగా అలంకరణ చేపట్టాలని అడుగడుగునా స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేయాలని ర్యాలీలో వేలాదిమంది కార్మికులు హాజరుకావాలని ఈ సమావేశంలో నిర్ణయించడం జరిగిందని తెలిపారు అన్ని యూనియన్ల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై చైతన్యపరిచి కార్మిక కర్షక మైత్రి కొనసాగించాలని పిలుపునిచ్చారు ఈనెల 14 నుండి 16 వరకు పెదగడియారం సెంటర్లోని పాత ఆర్ అండ్ బి కార్యాలయ స్థలాల్లో నిర్వహించడం జరుగుతుందని ఆధునిక వ్యవసాయ పరికరాలు నూతన వంగడాలు ఫెస్ట్ ఫ్లైట్స్ వెలినోవా ప్రభావం రైతులు పాటించవలసిన జాగ్రత్తలు తదితరు అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని ప్రతిరోజు వేలాదిమంది రైతాంగం యువ రైతులు మహిళలు అధిక సంఖ్యలో హాజరై తిలకించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ గంజి రాజేష్ సుంకరబోయిన వెంకన్న చింతకాయల సంతోష్ వివిధ యూనియన్ల అధ్యక్షులు కార్యదర్శులు సల్ల యాదయ్య, దేవరంపల్లి వెంకట్రెడ్డి కత్తుల యాదయ్య భీమనపల్లి శంకర్ గంజి నాగరాజు ఆవురేష్ మారయ్య రాజు మన్నె శంకరయ్య పందుల లింగయ్య రాములు శ్రీదేవి గిరిబాబు నోముల యాదయ్య. గదగోజ శ్రీనివాస చారి సైదాచారి. జేరిపోతుల సైదులు. కాసాని రమేష్. రాకింది. శీను. క్యాస రమేష్ సోమయ్య నాయుడు. తవ్డోజు నాగా చారి.తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ప్రతిఒక్కరు ఓటు నమోదు చేసుకోండి

బిజెపి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయండి

కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు



నారాయణపేట నవంబర్ 3: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేసుకోవాలని ఉద్యోగులు,నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పి బిజెపి గెలుపుకోసం కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన ప్రతి ఒక్క పట్టభ ద్రులని ఆన్లైన్ ద్వారా ఓటుహక్కు ఎన్రోల్మెంట్ చేసే విదంగా ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త కృషి చేయాలనీ పిలుపుని చ్చారు. హామీలను గాలికొ దిలేసి, ప్రజాపాలన అంటూ కలబొల్లి మాటలు మాట్లా డుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం పైన మండిపడ్డారు. ఈవీఎంల ద్వారా కాకుండ బ్యాలట్ పేపర్ ద్వారా ఎన్ని కలు నిర్వహిస్తే విజయం మాదేనని విర్రవీగిన కాంగ్రెస్ పార్టీ మొన్న జరిగిన ఎమ్మె ల్సీ ఎన్నికల్లో బొక్క బోర్లా పడిందని ఎద్దేవా చేసారు. కాంగ్రెస్ పార్టీ దుందుడుకు తనానికి విద్యావంతులు, ఉపాధ్యాయులు గట్టి బుద్ధి చెప్పారని, ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీల ను, పథకాలను అమలు చేయలేకపోతే త్వరలో తెలంగాణలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి ఖాయమని అన్నారు .యావత్ ప్రపం చం ప్రదానమంత్రి నరేంద్ర మోదీని ఆదర్శంగా తీసుకుంటుంటే,ఈ ప్రాంత కాంగ్రెస్ బడా ఓటు చోరీ అని ఈవియం ద్వారా ఎన్ని కలు వద్దు అని చెప్ప డం ,అటరాక గజ్జలు బరు వు అన్నట్లు ఉందని అన్నా రు, కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతన్నల ఉసురు తగిలి రాబోయే ఎన్నికల లో కొట్టు కు పోవడం కాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లక్ష్మీకాంత్,రామనారాయణ ,శ్యాంసుందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ యువత పాత్రపై అవగా హన



నారాయణపేట నవంబర్ 3: నారాయణపేట పట్టణం లోని ప్రభుత్వ గ్రౌండ్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థుల కోసం ఉద్యోగ అవకాశాలు, కెరీర్ గైడెన్స్ భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను ఎలా సాధించా లనే అంశాలపై డిఫెన్స్ వారియర్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ అంజనేయులు ఆర్మీ ప్రత్యేక అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ ఉద్యోగ అవకాశాలు, కెరీర్ ఎంపికలు, జీవితంలో క్రమశిక్షణ, పట్టుదల, సమ యపాలన యొక్క ప్రాము ఖ్యతను వివరించారు. అలాగే సమాజ అభివృద్ధి లో యువత పాత్ర ఏమిటి? తల్లిదండ్రుల పట్ల, ఉపా ధ్యాయుల పట్ల విద్యార్థులు ఎలా గౌరవంగా మెలగాలి? సమాజానికి బాధ్యతగల పౌరులుగా ఎలా ఎదగాలి? అనే అంశాలను ఎంతో చక్కగా, సులభంగా విద్యా ర్థులందరికీ అర్థమయ్యే విధంగా వివరించారు. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి మార్గదర్శ కులు. సరైన లక్ష్యం, క్రమశిక్షణ, కృషి ఉంటే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరుకోగలడు.” అనే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ గ్రౌండ్ హైస్కూల్ హెచ్ఎం నయీమ్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్‌లో అక్రమ నిర్మాణాల కలకలం!

రహమత్ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఐదు అంతస్తుల భవన నిర్మాణం

అనుమతులపై అనుమానాలు.. ప్రశ్నించిన స్థానికులకు బెదిరింపులంటూ ఆరోపణలు.. హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులకు బస్తీవాసుల విజ్ఞప్తి

హైదరాబాద్ నవంబర్ 03: (లోకల్ గైడ్ ప్రతినిధి) : హైదరాబాద్ నగరంలోని యూసుఫ్‌గూడ పరిధి రహమత్ నగర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్‌లో భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహమత్ నగర్‌లోని 641 నంబర్ ప్రాంతం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్‌లో 8-3-228/677 యజమానురాలు బి జెస్సికా 079890 66138 చిరునామాలో ఉన్న భవనంలో సరైన నిర్మాణ అనుమతులు లేకుండానే ఐదు అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాలని బస్తీవాసులు కోరుతున్నారు.స్థానికుల కథనం ప్రకారం.. సదరు భవన నిర్మాణానికి సంబంధించి మంజూరైన అనుమతులు, భవన నిర్మాణ ప్రణాళికకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తున్నారంటూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రశ్నించిన వారితో భవన యజమాని దురుసుగా వ్యవహరిస్తూ బెదిరింపులకు



పాల్పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా నిర్మాణ పనులపై వివరాలు తెలుసుకునేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధుల పట్ల కూడా అమర్యాదకరంగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు దిగుతున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. స్థానిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత అని, ప్రజలు తమ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాలపై ప్రశ్నించే హక్కు కలిగి ఉన్నారని బస్తీవాసులు పేర్కొంటున్నారు.నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో చుట్టుపక్కల నివసించే ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భవన నిర్మాణ అనుమతులు, మంజూరైన ప్లాన్, నిర్మిస్తున్న అంతస్తుల సంఖ్య, భద్రతా ప్రమాణాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.ఈ నేపథ్యంలో హైడ్రా, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి సదరు నిర్మాణాన్ని పరిశీలించాలని బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే స్థానికులు, మీడియా ప్రతినిధులను బెదిరిస్తున్నారనే ఆరోపణలపైనా విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహమత్ నగర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్ ప్రాంతాల్లో భవన నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనల అమలును పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

గీతం ఇన్నోవేషన్ ఛాలెంజ్

-- 2026కు యువ ఆవిష్కర్తలకు ఆహ్వానం

-వినూత్న ఆలోచనలకు రూ.50 లక్షల వరకు నగదు బహుమతులు..

-డిసెంబర్ 11న జాతీయ స్థాయి గ్రాండ్ ఫైనల్

పఠాన్ చేరు, నవంబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి ప్రతినిధి కృష్ణ: దేశవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి వినూత్న ఆలోచనలను విజయవంతమైన వ్యాపార వెంచర్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గీతం ఇన్నోవేషన్ ఛాలెంజ్ (జీఐసీ)- 2026 ఆరవ ఎడిషన్‌ను నిర్వహిస్తోంది. ఈ పోటీలో విజేతలకు దాదాపు రూ.50 లక్షల వరకు నగదు పురస్కారాలు అందించనుంది. గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో, బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. 10 నుంచి 12వ తరగతి చదువుతున్న పాఠశాల విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, 2025 నుంచి పట్టభద్రులైన యువత ఈ పోటీలో పాల్గొనవచ్చు. జూనియర్, సీనియర్ అనే రెండు విభాగాలలో పోటీలు నిర్వహిస్తారు. సమాజంలోని వాస్తవ సమస్యలకు వినూత్న పరిష్కారాలను అందించే ఆలోచనలను ఈ పోటీ ద్వారా ప్రోత్సహించనున్నారు. క్లైమేట్ టెక్, సుస్థిరత, వ్యవసాయం, ఫుడ్ టెక్, ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, డీప్ టెక్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, క్రీడలు, ఫిట్‌నెస్, డీ2సీ, కన్స్యూమర్ బ్రాండ్స్ తదితర రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు అవకాశం కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్, వర్చువల్ బూట్ క్యాంప్, నిపుణుల మార్గదర్శకత్వం అనంతరం ఈనెల 20, 21 తేదీల్లో ఆన్‌లైన్ సెమీ ఫైనల్స్ నిర్వహిస్తారు. డిసెంబర్ 11న గీతం హైదరాబాద్ క్యాంపస్‌లో జాతీయ స్థాయి గ్రాండ్ ఫైనల్ జరగనుంది. విజేతలకు నగదు బహుమతులతో పాటు నిపుణుల మార్గదర్శకత్వం, వెంచర్ కోచింగ్, ఇంక్యుబేషన్ అవకాశాలు కల్పిస్తారు. సీనియర్ విభాగంలో రూ.2 లక్షల వరకు నగదు బహుమతులు, గీతం ఐ-టీబీఐలో ఆరు నెలల ఇంక్యుబేషన్ సదుపాయం అందిస్తారు. జూనియర్ విభాగం ఫైనలిస్టులకు ఏడాది పాటు వ్యక్తిగత వెంచర్ కోచింగ్, లీడ్ ప్రోగ్రామ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. ప్రత్యేక విభాగాల్లోనూ అవార్డులు అందించనున్నారు. గత కార్యక్రమాల ద్వారా 5 వేలకు పైగా స్టార్టప్ ఆలోచనలు, 100కు పైగా పిచ్‌లు, 50 మందికి పైగా జ్యూరీ సభ్యులు, 30కి పైగా భాగస్వాములు, 29 రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం లభించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. పోటీలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 7వ తేదీలోగా జీఐసీ పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 90630 65811, 83283 34930 నంబర్లను సంప్రదించవచ్చు. లేదా gic@gitam.edu కు ఈ-మెయిల్ చేయవచ్చు.

బ్రహ్మకుమారీస్ దీపావళి స్నేహ సమ్మేళనం విజయవంతం

ఆత్మజ్యోతిని వెలిగించుకుని సుఖశాంతులతో జీవించాలి

తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్

కుత్బుల్లాపూర్ నవంబర్ 3 (లోకల్ గైడ్ ప్రతినిధి) : దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సరికొత్త వెలుగులు, ఆశలు నింపాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆనందంగా జీవించాలని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఆకాంక్షించారు. చేలాపుర బ్రహ్మకుమారీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం శాలిబండలోని సుధా టాకీస్ సమీపంలో గల భారత్ గుణవర్ధక సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన దీపావళి స్నేహ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పండుగల్లో



దీపావళి ఒకటని, ప్రజలు ఈ పండుగను ఎంతో ఉత్సాహంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారని పేర్కొన్నారు. దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించే పండుగ మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి జీవితంలో అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును నింపే పర్వదినమని అన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరిలో సానుకూల ఆలోచనలు, ప్రేమ, స్నేహభావం, మానవతా విలువలను పెంపొం దించాలని ఆకాంక్షించారు. చేలాపుర బ్రహ్మకుమారీస్ శాఖ పరిపాలకురాలు రజనీ సోదరి మాట్లాడుతూ మనలోని ఆత్మజ్యోతిని వెలిగించుకుని పరమపిత పరమాత్మ శివుని స్మృతిలో జీవించడమే దీపావళి పండుగలోని అసలైన ఆధ్యాత్మిక ఆనందమని వివరించారు. అంతరంగాన్ని పవిత్రమైన ఆలోచనలతో నింపుకుని ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు.ఈ కార్యక్రమానికి హిమాయత్‌నగర్ బ్రహ్మకుమారీస్ శాఖ పరిపాలకుడు బ్రదర్ ఆనంద్ హాజరై రాజయోగ ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. రాజయోగ సాధన ద్వారా మనస్సుకు ప్రశాంతత, ఆలోచనల్లో స్వచ్ఛత, జీవితంలో సానుకూల దృక్పథం అలవడతాయని తెలిపారు.రజనీ సోదరి, శిరీష సోదరి, శక్తి సోదరి, ప్రశాంత్, సవిత సోదరి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమలోని ఆత్మజ్యోతిని వెలిగించుకుని పరమాత్మ స్మరణలో ఉంటూ జీవితాల్లో సుఖశాంతులు, ఆనందాన్ని నింపుకోవాలని ఈ సందర్భంగా సందేశమిచ్చారు.దీపావళి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబించే ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ స్నేహ సమ్మేళనంలో పాతబస్తీలోని వివిధ బ్రహ్మకుమారీస్ శాఖలకు చెందిన ప్రతినిధులు, సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



డిసెంబర్ 15 నుంచి ఆశాల నిరవధిక సమ్మె



నారాయణపేట నవంబర్ 3: ఆశాలకు కనీస ఫిక్స్ వేత నం 18 వేల రూపాయలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలు నిరవ ధిక సమ్మెలో వెళ్తున్నారని అందులో భాగంగా నారా యణపేట జిల్లాలో ఉన్న ఆశా కార్యకర్తలు అందరూ కూడా సమ్మెలో భాగస్వా మ్యం అవుతున్నారని, కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తు న్న ఆశలు కూడా సమ్మే లో ఉంటారని ఆశ యూనియ న్ అధ్యక్షులు లక్ష్మీ కార్యద ర్శి నర్మదా తెలిపారు.మంగళవారం కోటకొండ పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ ప్రతిభకు సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనగుణంగా వేతనా లు పెంచడం లేదని, పారి తోషకం పేరుతో ఆశా కార్య కర్తల శ్రమను దోచుకుంటు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు.బడుగు బలహీన వర్గాలకు వైద్య సేవలు అందించడంలో రాత్రింబ గలు పనిచేస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వాలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తమ హక్కు ల కోసం డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగు తుందని ఆమె తెలిపారు. కరోనా కట్టడిలో ఆశా కార్య కర్తలు ముందుండి పని చేశారని ఆశా కార్యకర్తలకు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ గ్లోబల్ లీడర్ గా గుర్తించింది. కానీ మన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం కనీస వేతనం అమ లు చేయాలన్న ఆలోచన చేయడం లేదని అన్నారు . సమస్య పరిష్కారమయ్యే దాకా ఎన్ని రోజులైనా సమ్మెలో ఉండడానికి ఆశా కార్యకర్తలు అందరూ సిద్ధ పడాలని కోరారు.ఈ సమ్మె నోటీసు అందజేసిన వారి లో రత్నకుమారి, మంజుల, బాల్ నర్సమ్మ గౌరిక,రాధిక ఎం అంజమ్మ,ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు త్వరపడండి

యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రవికుమార్ గౌడ్



నారాయణపేట నవంబర్ 3: త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుకు నవంబర్ 6 తేదీ వరకు గడువు ఉన్నట్లు యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు సంబంధిత విద్యార్హత పత్రాలతో ఓటర్ గా నమోదు చేసుకోవాల న్నారు.మహబూబ్నగర్-రంగారెడ్డి- హైదరాబాద్ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సామ రామ్మోహన్ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉన్నా డన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఆయా రంగాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ నోటిఫికేషన్లు విడు దల చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల హామీలను క్రమంగా అమ లు చేస్తుందన్నారు. పట్ట భద్రులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలి పించాలని కోరారు. ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రా యుధం లాంటిదని ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగిం చుకోవాలన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: బాలకృష్ణ రెండెళ్లి

6న సబ్ జూనియర్ కబడ్డీ బాలుర ఎంపికలు

నారాయణపేట నవంబర్ 3: తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ బాలుర టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టును ఈ నెల 6న మినీ స్టేడియం నారాయణ పేటలో ఎంపిక చేస్తామని కబడి సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోటూ రు నాగేశ్వరెడ్డి చెన్నారం వెంకటప్ప ఓ ప్రకటనలో తెలిపారు. అర్హతలు క్రీడా కారులు 60 కిలోల లోపు బరువు కలిగి ఉండి తేదీ 13. 12. 2010 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు.అర్హత కలిగిన క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు పదవ తరగతి మెమో వెంట తీసుకొని రావాలని కోరారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ఈనెల 12 నుండి 14వరకు వికారాబాద్ జిల్లా ఎన్నప ల్లిలో ఉంటుందన్నారు.


తిర్మలాపూర్ లో తీఆర్ ఎస్ లో పలువురు చేరిక



నారాయణపేట నవంబర్: తెలంగాణ రక్షణ సేన పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, పార్టీలోకి వివిధ గ్రామాల నుంచి ప్రజలుస్వచ్ఛందంగా చేరుతున్నారని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్అన్నారు .మంగళవారం నారాయణపేట మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పలు వురు గ్రామస్తులు మాజీ వార్డు మెంబర్లు చుక్క దస్తప్ప, వెలుగు బలప్ప, కోమటి వీరేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు.ఈ సంద ర్భంగా గుంటుగారి కృష్ణయ్య, జి. నాగేష్, కమంగారి బాలకృష్ణ, చుక్క గోపాల్, కోరేమోని గోవిందు, కే. బాలరాజు, జోగు శివప్ప, సింగారం కానుకప్ప, దూల్లా గోవిందు, దూల్లా మల్లప్ప తదిత రులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి తెలం గాణ రక్షణ సేన నారాయ ణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి సాదరం గా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, గ్రామీ ణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. పార్టీ సిద్ధాం తాలు, ఆశయాలకు ఆకర్షితులై మరింత మంది పార్టీలో చేరడం సంతోషక రమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దామరగిద్ద మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, బండగొండ రాజు, కోటకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా నర్రా శేఖర్ రెడ్డి.
ప్రధాన కార్యదర్శిగా గేర నరసింహ.





నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : కట్టంగూర్ మండల కేంద్రంలో బీఎన్ గౌడ్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్. నల్లగొండ జిల్లా ఏడవ మహాసభలలో 2026 - 28 కాలానికి గాను నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలకు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎన్ సోమయ్య ఎన్నికల అధికారిగా మరో రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం పరిశీలకులు వ్యవహరించినారు. నూతన కమిటీ అధ్యక్షులు: నర్రా శేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు: బడుగు అరుణ, వడిత్య రాజు ప్రధాన కార్యదర్శి: గేర నరసింహ .కోశాధికారి: వెంకన్న నలపరాజు .కార్యదర్శులు: మోర్తాల శ్రీనివాస్ రెడ్డి . జాల అరుణ .రాచమల్ల రమాదేవి .అడావత్. చిన్న వెంకన్న .కోట్లయాదగిరి .గంటల వెంకటయ్య .కోమర్రాజు సైదులు.తాటిపాముల నరసింహమూర్తి.సభావాత్ భాను ప్రకాష్ .గండమల్ల రామారావు. కోడి రెక్క జయరాజు, పుట్ట రాములు. జింకల సత్యనారాయణ .జి. యాదమ్మ.ఆడిట్ కమిటీ కన్వీనర్: పగిళ్ళ సైదులు .ఆడిట్ సభ్యులు: పల్లా మధుసూదన్ రెడ్డి. కోదాటి మధుసూదన్. రాగి రాకేష్ కుమార్.ఎల్ హరి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వివిధ కమిటీలను ప్రకటించారు అవి. వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్స్ పత్రిక కన్వీనర్ గా కె రమణ, మహిళా కమిటీ కన్వీనర్ గా చింతమల్ల వరలక్ష్మి, అకాడమిక్ కన్వీనర్ గా మద్దెల ప్రసాద్,సాంస్కృతిక కమిటీ కన్వీనర్ గా గిరి యాదయ్య .క్రీడా కమిటీ కన్వీనర్ గా బెదదూరి సురేందర్ రెడ్డి,సోషల్ మీడియా కన్వీనర్ గా ఎరనాగుల సైదులు,స్టడీ సర్కిల్ కన్వీనర్ గా పి జయసాగర్,ప్రచురణల కమిటీ కన్వీనర్ గా పుట్టల శ్యామ్ కుమార్,ఎస్టిఎఫ్ఐ మహిళా కన్వీనర్ గా గుండా వేదశ్రీ లను ప్రకటించడం జరిగింది.అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్, రాష్ట్ర కార్యదర్శులు పెరుమాళ్ళ వెంకటేశం ఎన్ సోమయ్య నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపి రాబోయే కాలంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుండాలని ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు.నూతనంగా ఎన్నిక కాబడిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నర్రా శేఖర్ రెడ్డి, గేర నరసింహ , ఇతర సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం , ప్రభుత్వ విద్యారంగా బలోపేతం కోసం రాజీ లేని పోరాటం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, నల్లగొండ జిల్లా సంఘ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేస్తామని అన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు
ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలి

కాంగ్రెస్ యువ నాయకుడు.. మిరియాల ప్రీతమ్



శేరిలింగంవల్లి, నవంబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): అర్హులైన ప్రతి పట్టభద్రుడు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మిరియాల ప్రీతమ్ విజ్ఞప్తి చేశారు. మహబూ బ్‌నగర్ -రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రులు నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ పూర్తి చేసిన యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, వివిధ వృత్తుల్లో ఉన్న పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా నిర్దిష్ట గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర పట్టభద్రులకు కూడా ఈ విషయంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు సరైన నాయకుడిని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి పట్టభద్రులందరూ తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మిరియాల ప్రీతమ్ విజ్ఞప్తి చేశారు.

వర్షాభావ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి.

జిల్లా కలెక్టర్ ప్రియాంక.

నారాయణపేట నవంబర్ 3:ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల కారణంగా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీ లించారు. నారాయణపేట మండల పరిధిలోని అప్పక్ పల్లి, చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ ఆయా గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలను సందర్శించి వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా అప్పక్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సాగు చేసిన వరి, టమాట, మిరప పంటలను కలెక్టర్ పరిశీలించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలమట్టం తగ్గి పోవడంతో బోర్లలో నీరు అడుగంటిపోయి పంటలకు సాగునీరు అందకపోవ డంతో పంటలు ఎండి పోయిన పరిస్థితిని రైతు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా వరి పంటకు అవసరమైన నీరు అందు బాటులో లేకపోవడంతో పంటను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలి పారు.తాను ఇతరుల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నా నని, పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతు తన ఆవేదనను కలెక్టర్‌కు వివరించారు. రైతు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసు కున్న కలెక్టర్ విచారం వ్యక్తం చేస్తూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచిం చారు.అనంతరం చిన్న జట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో మరో ఇద్దరు రైతులు సాగు చేసిన వరి పంటలను కూడా కలెక్టర్ పరిశీలించా రు. వర్షాలు లేకపోవడం, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోవడంతో ఎండిపో యిన పంటలను పరిశీ లించి రైతులతో నేరుగా మాట్లాడారు. గత సంవ త్సరం ఇదే సమయంలో వర్షపాతం ఎలా ఉందని, అప్పట్లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారని,



ప్రస్తుత పరిస్థితులతో పోలిస్తే దిగుబడులు, పెట్టుబడులు, ఆదాయంలో ఎంత తేడా వచ్చిందని రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావర ణంలో చోటుచేసుకునే మార్పులు వర్షపాతంపై ప్రభావం చూపే అవకాశం ఉందని, వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవ డంతో వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొం టోందని కలెక్టర్ పేర్కొన్నా రు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలా లపై ఒత్తిడి పెరుగుతోందని, బోర్లలో నీటి లభ్యత తగ్గిపో వడం వల్ల ముఖ్యంగా అధి క నీటి అవసరం ఉన్న పంటల సాగు రైతులకు భారంగా మారుతోందని తెలిపారు.రైతులు కేవలం వర్షాలపైనే ఆధారపడ కుండా అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణన లోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీటి వినియోగం అవసరమయ్యే సంప్రదాయ పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నా య పంటలపై దృష్టి సారిం చాలని తెలిపారు. రైతులకు అండగా ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదు ర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పు డు క్షేత్రస్థాయిలో పరిశీ లించాలని కలెక్టర్ సూచిం చారు. గ్రామాల్లో పంటల పరిస్థితి, నీటి వనరుల లభ్యత, సాగు విస్తీర్ణం తది తర అంశాలను పరిశీలిస్తూ రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికా రులు రైతులకు ప్రత్యామ్నా య పంటల సాగుపై అవ గాహన కల్పించడంతో పాటు నీటి పొదుపు పద్ధ తులపై సూచనలు చేయా లని పేర్కొన్నారు.రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టి లో ఉంచుకుని పంటల సాగులో తగిన మార్పులు చేసుకోవాలని, ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పెట్టుబడి నష్టాలను తగ్గిం చుకునే ప్రయత్నం చేయా లని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.జిల్లాలో నెల కొన్న వర్షాభావ పరిస్థితుల పై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తు న్న నేపథ్యంలో రైతులకు సరైన సమయంలో వ్యవ సాయ సలహాలు అందించ డం, ప్రత్యామ్నాయ పంట ల సాగును ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగా నికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి, ఏఈ వోలు పాల్గొన్నారు.

మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇదేం దుస్థితి..
వీల్‌చైర్ కూడా దొరకని దౌర్భాగ్యం!

క్షతగాత్రుడిని నడిపించుకుంటూ తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు..

ప్రజారోగ్య వ్యవస్థపై తీవ్ర విమర్శలు

భూపాలపల్లి లోకల్ గైడ్ ప్రతినిధి: (లోకల్ గైడ్ ప్రతినిధి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామని చెబుతున్న పాలకుల మాటలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతనే లేకుండా పోతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రభుత్వ వైద్య సేవల నిర్వహణ తీరును ప్రశ్నిస్తోంది.

బొలెరో వాహనంపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గాయపడిన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. వైద్య పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి రిఫర్ చేశారు. అయితే, ఆసుపత్రి నుంచి క్షతగాత్రుడిని బయటకు తీసుకెళ్లే సమయంలో కనీసం వీల్‌చైర్ కూడా అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులే అతడిని పట్టుకుని నడిపించుకుంటూ తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.



అసలు ప్రభుత్వ ఆసుపత్రిలో వీల్‌చైర్ కూడా లేదా?

ప్రమాదంలో గాయపడి నడవలేని పరిస్థితిలో ఉన్న రోగికి కనీసం వీల్‌చైర్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంటే ఇక ప్రభుత్వ ఆసుపత్రుల్లో సామాన్యులకు అందుతున్న సేవలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అత్యవసర సమయంలో రోగులకు అండగా నిలవాల్సిన ఆసుపత్రి సిబ్బంది, కనీస సహాయక సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు విఫలమవుతున్నారు? రోగుల ప్రాణాలతో సంబంధం ఉన్న అంశాల్లో ఇంత నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఆసుపత్రి భవనాలు, బోర్డులు, హామీలు మాత్రమే సరిపోవు.. రోగులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించినప్పుడే ప్రభుత్వ వైద్య సేవలకు సార్థకత ఉంటుంది. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులే నడిపించుకుంటూ తీసుకెళ్లాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. జిల్లా వైద్యాధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా? లేక ఈ ఘటనను కూడా చూసీచూడనట్లు వదిలేస్తారా? మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశంపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవ
వేడుకల్లో పాల్గొనడం జిల్లాకు గర్వకారణం

(లోకల్ గైడ్ 3నవంబర్ కామారెడ్డి టౌన్) : దేశ ఐక్యత, సమగ్రతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం అభినందనీయం: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తా నగర్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా నిర్వహించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకలు, ఏక్తా దివస్ పరేడ్‌లో కామారెడ్డి జిల్లా నుంచి వెళ్లిన 19 మంది సభ్యుల బృందం పాల్గొని తిరిగి వచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను బృంద సభ్యులు కలిసి, తమకు ఈ అరుదైన అవకాశం కల్పించినందుకు జిల్లా యంత్రాంగానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జాతీయ ఐక్యత, దేశభక్తి, సమైక్యతా భావాలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాల్లో జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, రైతులు పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. గుజరాత్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించి, అందులో భాగస్వాములు కావడం ద్వారా దేశ ఐక్యత, సమగ్రత, సాంస్కృతిక వైవిధ్యంపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం లభించిందన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన కృషి, ఆయన





ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బృంద సభ్యులకు సూచించారు. జిల్లా నుంచి మొత్తం 19 మంది సభ్యులతో కూడిన బృందం గుజరాత్ పర్యటనకు వెళ్లిందని, ఈ బృందానికి నోడల్ అధికారిగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. కృష్ణ గౌడ్ వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ, గుజరాత్‌లో ఏక్తా దివస్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించడం, అందులో పాల్గొనే అవకాశం లభించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా పోలీసు అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా యంత్రాంగం అందించిన ప్రోత్సాహం, సహకారం మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఎస్. సంతోష్, ఏక నితిన్ గౌడ్, రోహిత్, ప్రభాస్, సాధన, రజిత, బి. సూరజ్, లక్ష్మి, దీప, రాధ, సుబ్బారావు, నరేందర్, లింగారెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల నిల్వకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పాత బోరుబావులు, బహిరంగ బావులను వర్షపు నీటి రీచార్జ్‌కు వినియోగించుకోవలి.. బద్దం కొండల్ రెడ్డి



శేరిలింగంపల్లి, నవంబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): ఎలినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సామాజిక కార్యకర్త, మదర్ సేవా సమితి చైర్మన్ బద్దం కొండల్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భూగర్భ జలాల నిల్వలను పెంచుకోవడానికి వర్షాకాలంలోనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటిని వృథాగా కాలువల్లోకి వదిలేయకుండా ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇళ్ల వద్ద, కాలనీల్లో నిరుపయోగంగా ఉన్న పాత బోరుబావులు, బహిరంగ బావులను వర్షపు నీటి రీచార్జ్ నిర్మాణాలుగా ఉపయోగించుకోవాలని సూచించారు. వీటి ద్వారా వర్షపు నీటిని భూగర్భంలోకి పంపించి భూగర్భ జలమట్టాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటి పైకప్పులపై పడే వర్షపు నీటిని వృథా చేయకుండా రీచార్జ్ గుంతలకు అనుసంధానం చేయాలని కోరారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల సంక్షేమ సంఘాలు కూడా ఈ దిశగా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వర్షాకాలంలో కురిసే ప్రతి చినుకును భవిష్యత్తు అవసరాల కోసం భూగర్భ జలాల రూపంలో నిల్వ చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎలినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కుళాయిల ద్వారా నీరు వృథా కాకుండా చూసుకోవాలని, అవసరమైనంత నీటినే వినియోగించాలని పిలుపునిచ్చారు. వాహనాల శుభ్రత, మొక్కలకు నీరు పోయడం వంటి అవసరాలలోను నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని బద్దం కొండల్ రెడ్డి పేర్కొన్నారు. నేటి తరం నీటిని సంరక్షిస్తేనే భావితరాలకు నీటి భద్రత కల్పించగలమని, ప్రతి ఒక్కరూ నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటూ కొనసాగుతున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర.

నల్లగొండ నుంచి మునుగోడు వైపు బీసీ రాజ్యాధికార యాత్ర.

సంప్రదాయ వృత్తిదారులు, చిరు వ్యాపారులు, రైతులు, యువకులతో ముచ్చట.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : బీసీ రాజ్యాధికార యాత్ర 41వ రోజులో భాగంగా తీన్మార్ మల్లన్న గారు నల్లగొండ నుంచి మునుగోడు వైపు పాదయాత్ర కొనసాగిస్తున్నారు.మార్గమధ్యంలో వివిధ వర్గాల ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. నల్లగొండ టౌన్ లైబ్రరీ వద్ద కేతేపల్లికి చెందిన విద్యార్థి సాయి మల్లన్నను కలిశారు.మేదరి సామాజికవర్గానికి చెందిన విజయ్ కుమార్ తమ సంప్రదాయ చాటలు అల్లే వృత్తి గురించి వివరించారు.పాతబస్తీలో ఇస్త్రీ దుకాణం నిర్వహిస్తున్న లక్ష్మణ్, శంకర్, భీమనపల్లి తమ సమస్యలను మల్లన్న దృష్టికి తీసుకువచ్చారు.హౌసింగ్ బోర్డు వద్ద అరటిపండ్ల వ్యాపారులు మల్లయ్య, వెంకటమ్మలను మల్లన్న కలిసి వారి జీవనోపాధి, వ్యాపార సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి వద్ద అరటిపండ్లు కొనుగోలు చేశారు.గుర్రంపోడుకు చెందిన బొడ్డు సతీష్ తనకు ఇల్లు మంజూరు కాకుండా జానారెడ్డి కుమారుడు అడ్డుకుంటున్నారని, తనకు న్యాయం చేయాలని మల్లన్నను కోరారు. నల్లగొండకు చెందిన లింగస్వామి మల్లన్నను శాలువాతో సత్కరించగా, స్వామి తన కుటుంబ సభ్యులతో కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి ప్రవీణ్ కూడా మల్లన్నను కలిసి మద్దతు ప్రకటించారు.నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో బీసీ మహిళా సంధ్య నేతృత్వంలో గ్రామస్తులు హారతులతో మల్లన్నకు ఘనస్వాగతం పలికారు. గణేష్ నేతృత్వంలో యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం గ్రామంలోని బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో మల్లన్న కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు రాములు మల్లన్నను కలిసి వ్యవసాయ సంబంధిత అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార యాత్ర మునుగోడు వైపు కొనసాగుతోంది.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: బాలకృష్ణ రెడ్డి

కామారెడ్డి మున్సిపాలిటీపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశం



(లోకల్ గైడ్ 3నవంబర్ కామారెడ్డి ప్రతినిధి టౌన్) : నిర్దిష్ట గడువులోగా విచారణ నివేదిక సమర్పించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కామారెడ్డి మున్సిపాలిటీలో కొందరు కౌన్సిలర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, మున్సిపల్ పాలనలో పలు అవకతవకలు జరుగుతున్నాయని ఇటీవల పలు దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరిని ఆదేశించారు. ఈ విచారణలో భాగంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో చేపట్టిన టెండర్ల ప్రక్రియ, పారిశుద్ధ్య సిబ్బంది నియామకాలు, వారి హాజరు, వేతనాల చెల్లింపులు, సీసీ కెమెరాల ఏర్పాటు పనులు, వాటిలో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యంపై వచ్చిన ఆరోపణలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అదేవిధంగా పట్టణ ప్రణాళికా విభాగం జారీ చేసిన నోటీసులు, వాటిపై తీసుకున్న తదుపరి చర్యలు, మున్సిపల్ కౌన్సిల్ నెలవారీ సమావేశాల నిర్వహణ, గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల కోసం కొనుగోలు చేసిన ఇనుప సామగ్రి వినియోగం, అనంతరం వాటి విక్రయానికి సంబంధించిన వివరాలను విచారణలో పరిశీలించనున్నారు. మున్సిపల్ వాహనాల నెలవారీ ఇంధన వినియోగం, వ్యాపార అనుమతుల జారీ, ఇంటి పన్ను మదింపు ప్రక్రియ తదితర అంశాలపైనా సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించనున్నారు. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చర్యలు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి అవకతవకలు, అక్రమ వసూళ్లు జరిగినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విచారణలో ఆరోపణలు రుజువైతే బాధ్యులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ సేవల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, ప్రజలను బెదిరింపులకు గురిచేసినా సంబంధిత ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఫిర్యాదులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కార్యాలయంలో లేదా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైతన్నలు కరువు పట్ల ఆలోచన చేయాలి

సూపర్ ఎల్నినో ద్వారా కరువు

ప్రతిపక్షాల ఆరోపణలు నమ్మవద్దు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో పని చేస్తోంది

రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు





పెద్దపల్లి జిల్లా నవంబర్ (లోకల్ గైడ్) : పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రంపల్లి, చీకురాయి గ్రామాల్లో పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో, చందపల్లిలో ఐకేపీ ఆ సింగిల్ విండో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ ఎల్నినో కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. కరువు పట్ల రైతన్నలు ఆలోచన చేయలని యాసంగిలో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సమృద్ధిగా పండే మొక్కజొన్న (మక్కలు), శెనగ వంటి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు పంటలను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దలారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు మండలంలో ఐకేపీ మరియు సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. రైతు తన పంట అమ్మిన రెండు రోజుల్లోనే తన ఖాతాలో డబ్బులు జమ అవుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉందని ధాన్యం కొనుగోళ్ల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేశారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు,రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కుసుమ్ పథకం కింద మరో 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ గ్రిడ్‌కు అనుసంధానం






ఖమ్మం: లోకల్ గైడ్ : పీఎం కుసుమ్ పథకం కింద ఖమ్మం సర్కిల్ పరిధిలోని తీర్దాల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో, మంగళగూడెం లో శ్రీ కిలారు రాజశేఖర్‌కు చెందిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఈరోజు విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానం (సింక్రనైజేషన్) చేసినట్లు ఖమ్మం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, పీఎం కుసుమ్ పథకం ద్వారా సౌరశక్తిని వినియోగించుకోవడంతో పాటు పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. వర్షాభావ పరిస్థితులలో, సరిపడా విద్యుత్ ఉత్పత్తి లేని క్లిష్ట పరిస్థితులలో, కొత్త ఉత్పత్తి కేంద్రం అందుబాటులోకి రావడం, సౌలభ్యంగా ఉందని తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంస్థకు అదనపు విద్యుత్ లభ్యత పెరిగి, స్థానికంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు. స్థానికంగా విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల ఆ మేరకు లైన్ల పై పెట్టుబడి తగ్గడమే కాకుండా సరఫరా నష్టాలు కూడా ఉండవు. మరియు ప్రాంత ప్రజలకు సమస్యలు కూడా ఉండవు. అలాగే రైతులకు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం లభించనుందని తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పీఎం కుసుమ్ పథకం కింద 55 సౌర విద్యుత్ ప్లాంట్ల ద్వారా 93.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళిక రూపొందించగా, ఇప్పటికే 8 ప్లాంట్లు,13 మెగావాట్లు మరియు ఇందిరా మహిళ శక్తి , స్వయం సహాయక బృందాల ద్వారా ఒక (1) మెగా వాట్స్ ప్లాంటు గ్రిడ్‌కు అనుసంధానం చేయబడ్డాయని, మిగిలిన ప్లాంట్ల పనులు పురోగతిలో ఉన్నాయని, నెల రోజుల్లో మరో 10 ప్లాంట్లు, మిగిలిన మొత్తం, ఈ సంవత్సరం మార్చి 31వ తేదీలోపు అందులో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్లు శ్రీ కిరణ్ చక్రవర్తి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్ మరియు స్టాప్ పాల్గొన్నారు.పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహిస్తూ, సుస్థిర విద్యుత్ ఉత్పత్తి దిశగా టీజీఎన్‌పీడీసీఎల్ ముందుకు సాగుతోందని ఎస్ఈ పేర్కొన్నారు..

ముదిరాజ్ యూత్ కమిటీ అధ్యక్షుడిగా నరేష్ ఏకగ్రీవ ఎన్నిక.

- యువత ఐక్యత, సంఘం బలోపేతమే లక్ష్యంగా నూతన కార్యవర్గం ఏర్పాటు.

- మండలంలోని పలు గ్రామాలకు కమిటీలో ప్రాధాన్యం.



లోకల్ గైడ్/బంట్వారం : ముదిరాజ్ సంఘం బంట్వారం మండల యూత్ కమిటీ అధ్యక్షుడిగా మంగాయపల్లె నరేష్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా యూత్ కమిటీ అధ్యక్షుడు లోంక నర్సింహులు ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాఘవ ముదిరాజ్ (తోర్మామిడి), సంజప్ప ముదిరాజ్ (బసవపూర్), ప్రధాన కార్యదర్శిగా బండ మహేశ్ ముదిరాజ్ (నాగ్వరం), కోశాధికారిగా ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ (సుల్తాన్‌పూర్), కార్యదర్శిగా శ్రావణ్ కుమార్ ముదిరాజ్ (బసవపూర్), సోషల్ మీడియా బాధ్యతలకు శ్రీకాంత్, వివేకానంద (తురుమామిడి) ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శాకల రాములు ముదిరాజ్, మండల సంఘం అధ్యక్షుడు సుబ్బానీటి, మోహన్ కుమార్, శాకల నర్సింహులు, రాజా, శ్రీశైలం, సిద్ధిరాములు, మైపాల్ తదితర ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

చిల్లర కాంటాలతో పత్తి రైతులను దోచుకుంటున్న మధ్య దళారులు

ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్

హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్(లోకల్ గైడ్ న్యూస్) : పత్తి ధరల వ్యత్యాసంతో రైతులకు తీవ్ర నష్టం, మార్కెట్లో వే బ్రిడ్జిలు పనిచేయకపోవడం సిగ్గుచేటు.పత్తి క్వింటా 12వేల రూపాయల మద్దతు ధర ప్రకటించాలి.ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో ఏనుమాముల మార్కెట్ సందర్శన, మార్కెట్ సమస్యలపై వినతి. గ్రామాల్లో చిల్లర కాంటాలను అరికట్టి, మార్కెట్లో ధరల వ్యత్యాసాన్ని తగ్గించి పత్తి పండించిన రైతులను నష్టపోకు ండా చర్యలు చేపట్టాలని అఖిలభారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. అలాగే పత్తి క్వింటాకు 12 వేల రూపాయల మద్దతు ధర ప్రకటించాలన్నారు. అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధి బృందం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సందర్శించి మార్కెట్లో రైతులు తీసుకువచ్చిన పత్తి ధరలు రైతుల ఇబ్బందులు జరుగుతున్న మోసాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా పత్తి పంట విస్తీర్ణం దిగుబడి తగ్గిందని అదే కోవలో రాష్ట్రంలో 49 లక్షల ఎకరాలు పత్తి పంట వేసిన ఎకరానికి నాలుగు ఐదు క్వింటాలకు



మించి ఉత్పత్తి రావడంలేదని ఇలాంటి పరిస్థితుల్లో పత్తికి మంచి డిమాండ్ ఏర్పడిందని ఇలాంటి పరిస్థితుల్లో పత్తి ధర పెరగాల్సింది



పోయి తగ్గించుకుంటూ వస్తున్నారని ఇది అన్యాయమని అన్నారు. మరోవైపు ఆసియాలోనే అతిపెద్ద రెండో మార్కెట్ ఎనుమాములలో ఈ సీజన్లో ఇతర మార్కెట్లలో పోల్చితే ఒక్కసారి కూడా హై రేట్ పలకకపోవడం దారుణం అన్నారు. జెండా పాట పేరుతో కొద్దిమంది రైతుల పత్తికి జెండా పాట వర్తింపజేసి మిగతా రైతాంగానికి క్వింటాకు ఐదు నుంచి 600 వరకు తగ్గించి కొనుగోలు చేయడం అన్యాయం అన్నారు. మార్కెట్లో 4 వే బ్రిడ్జి కాంటాలు ఉన్న పనిచేయకపోవడం దేనికి సంకేతం అన్నారు. లూజుగా వాహనాల్లో తీసుకువచ్చే పత్తిని మార్కెట్లో ధర నిర్ణయించినప్పటికీ బయట తూకం వేయడం మార్కెట్లో నిర్ణయించడం తగ్గించడం దారుణం అన్నారు.గ్రామాల్లో మధ్య దళారులు పత్తి రైతులను మభ్యపెట్టి మార్కెట్ ధర కన్నా తక్కువకు పత్తిని కొనుగోలు చేస్తూ తూకంలో మోసం చేస్తూ దోచుకుంటున్న మార్కెట్ యంత్రాంగం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా తక్షణమే గ్రామాల్లో చిల్లర కాంటాలను అరికట్టి ధరల వ్యత్యాసాన్ని తొలగించి జెండా పాట రైతులందరికీ వర్తింపజేసి మార్కెట్లో రైతులకు కార్మికులకు నాణ్యమైన ఉచిత భోజనాన్ని అందించి కనీసం మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పత్తికి క్వింటా 12వేల రూపాయల కనీస మద్దతు ధర నిర్ణయించి రైతులను ఆదుకోవాలని కోరారు.అనంతరం సమస్యలతో కూడిన మెమోరాండాన్ని మార్కెట్ చైర్మన్ ఎర్ర ప్రియాంక, మార్కెట్ కార్యదర్శి నిషాని శ్రీనివాస్ లకు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి కుసుంబ బాబురావు, రాష్ట్ర నాయకులు సింగతి సాంబయ్య, జిల్లా కోశాధికారి సింగతి మల్లికార్జున్, ప్రజా సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు వంగల రాగసుధ, గడ్డం నాగార్జున, ముక్కెర రామస్వామి, మాస్ సావిత్రి, మాలి ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య, ఏఐకేఎఫ్ జిల్లా నాయకులు ఐతం నాగేష్, మహమ్మద్ ఉస్మాన్, మంద భద్రయ్య, గోనె రామచంద్రు, రైతులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు...

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలో లబ్ధిదారులకు 2వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి

తిరుమలాయపాలెం, నవంబర్- 03: లోకల్ గైడ్ : పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్ళని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలోని శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో 2 వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తిరుమలాయపాలెం మండలంలో రెండో విడత క్రింద 187 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేస్తున్నట్లు



తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదవారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచితంగా రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇల్లు కట్టించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో 810 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు దాదాపు 700 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెండో విడత కింద ఇళ్లను అందజేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేది విడతలతో ముగిసేది కాదని, అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు అందేవరకు నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కుల, మత, రాజకీయ పార్టీల వ్యత్యాసాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామన్నారు. సొంతింటి కల నెరవేర్చుకోవాలనే నిరుపేద ఆడబిడ్డల చిరకాల కోరికను నెరవేర్చడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ఇందిరమ్మ ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ, మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించామన్నారు. డ్వాక్రా మహిళలకు 73 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించామన్నారు. 74 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని, 14 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని మంత్రి అన్నారు. ఏది ఏమైనా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం ముందు, నేటి ప్రతిపక్ష నాయకుడు రెండు సంవత్సరాలలో ఈ దేశానికి ప్రధానమంత్రిగా రాబోతున్నారన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత, ఇందిరమ్మ రాజ్యం ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో ఎలా ఉందో, దేశవ్యాప్తంగా కూడా



ఇందిరమ్మ రాజ్యం అలాగే ఉంటుందని, ఏవైతే ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామో, కేంద్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ఇదే తరహాలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వాట్లడుతూ, తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో భాగంగా దాదాపు 810 ఇళ్లు మంజూరు చేయబడ్డాయని, ఇందులో 600 ఇళ్లు పూర్తిగా పూర్తయి లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా పూర్తి చేసుకున్నారన్నారు. మరో 100 ఇళ్లు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయని, వీటిలో స్లాబ్ వేసిన ఇళ్లు 60 వరకు ఉండగా, ఇటీవల కొత్తగా సాంక్షన్ రావడం వలన త్వరలో పనులు ప్రారంభించనున్న మరో 90 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. రెండవ విడతలో భాగంగా అదనంగా మరో 185 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతోందని కలెక్టర్ అన్నారు. ఈ పథకం కింద పూర్తిగా అర్హత ఉన్న నిజమైన పేదలను మాత్రమే పారదర్శకంగా ఎంపిక చేస్తున్నట్లు, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, వారు ఇళ్లు కట్టుకుంటున్న దశలను బట్టి ఫోటో తీస్తే చాలు, నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పారదర్శకమైన విధానం అమలవుతోందని అన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో నమ్మకం, డిమాండ్ మరింత పెరిగిందని తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్ల లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మంత్రి తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెం గ్రామంలో ఎన్. నగేష్ - మంగమ్మ లు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం చేసి, లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. ఏలువారిగూడెం గ్రామంలో తెట్టెంపాడు-బీరోలు రోడ్డు నుండి ఏలువారిగూడెం వరకు రూ. 2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, బీరోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 48 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శేఖర్ రెడ్డి, పిఆర్ ఎస్ఈ జి. వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు వినోద, గుగులోతు తులసి నర్సింహ, గుమ్మడి దేవభిక్షం, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ప్రమాదపు అంచున పంచాయతీ రాజ్ కార్యాలయం!

కూత దూరంలో విద్యుత్ ఆఫీస్ పక్కనే ఉన్నా కనబడని తీగలు


ప్రమాదకరంగా వేలాడుతున్న కరెంట్ వైర్లకు చెట్ల కొమ్మలు

ఈదురు గాలులొస్తే విద్యుత్ అంతరాయం.. వికారాబాద్ పట్టణ ప్రజల అవస్థలు

లోకల్ గైడ్, వికారాబాద్ జిల్లా బ్యూరో : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని లైబ్రరీ నుంచి పంచాయతీ రాజ్ ప్రాంతీయ కార్యాలయం వరకు విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం బహిర్గతమవుతోంది. అనంతగిరి రహదారి పక్కనే ఉన్న ఈ ప్రధాన మార్గం గుండా నిత్యం పదుల సంఖ్యలో ప్రభుత్వ అధికారులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, ఇక్కడ కరెంట్ వైర్లు చెట్ల కొమ్మలు, పొదల్లో ప్రమాదకరంగా వేలాడుతుండటంతో బాటసారులు, స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మత్తు నిద్రలో అధికారులు.. పట్టించుకోని విద్యుత్ శాఖ పంచాయతీ రాజ్ కార్యాలయం ముందున్న విద్యుత్ స్తంభాలు, తీగల నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికొదిలేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైర్లు సరిగ్గా అమర్చకపోవడంతో అవి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దిగిపోయాయి. ఫలితంగా చిన్నపాటి ఈదురు గాలులు వచ్చినా



కొమ్మలు తగిలి షార్ట్ సర్క్యూట్ కావడం, గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం నిత్యకృత్యంగా మారింది.



వర్షం పడితే ప్రాణభయం!

వర్షాకాలం మరియు తేమ వాతావరణంలో ఈ పొదలకు విద్యుత్ ప్రసారమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన సమయంలో చెట్ల కొమ్మల్లో చిక్కుకున్న కరెంట్ తీగల నుంచి భారీగా మెరుపులు, షార్ట్ సర్క్యూట్ శబ్దాలు వస్తున్నాయని వాపోతున్నారు. ఏ క్షణంలో ఏ వైరు తెగి పడుతుందో, ఎవరి ప్రాణాల మీదకు వస్తుందో తెలియక వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. పక్కనే ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు కూడా ఈ పరిస్థితిని చూసి విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ అంతరాయంతో ప్రజల తీవ్ర అవస్థలు

తీగలు చెట్ల పొదల్లో చిక్కుకోవడంతో తరచూ విద్యుత్ లైన్లు ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతోంది. దీనివల్ల సమీప నివాస ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ లేక చీకటిగా మారడంతో చిన్న పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఈ సమస్యపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలి: స్థానికుల డిమాండ్

ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వికారాబాద్ పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వేలాడుతున్న కరెంట్ వైర్లను సరిచేసి, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు నిద్రమత్తు వీడి తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

వికారాబాద్ బస్టాండ్‌లో మరుగుదొడ్లకు తాళం వేయడంపై స్పందించిన డిఎం నమ్రత

పైప్‌లైన్ పగిలి నీరు చేరడంతోనే తాత్కాలిక మూసివేత

ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు



లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి : వికారాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్లకు తాళాలు వేశారంటూ ఇటీవల కొన్ని పత్రికలలో ప్రచురితమైన వార్తలపై వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ (డిఎం) నమ్రత స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్తలలో పేర్కొన్న అంశాలపై స్పష్టతనిచ్చారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్ల నీటి పైప్‌లైన్ హఠాత్తుగా పగిలిపోవడంతో నీరు పెద్దఎత్తున బయటికి వచ్చి చేరిందని, అందుకే పరిశుభ్రత దృష్ట్యా తాత్కాలికంగా మరుగుదొడ్లకు తాళం వేయాల్సి వచ్చిందని డిఎం నమ్రత తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి, పగిలిపోయిన పైప్‌లైన్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు మరమ్మతు పనులను వేగవంతం చేస్తామని వెల్లడించారు. బస్టాండ్‌కు వచ్చిపోయే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే మరుగుదొడ్ల పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఈ సందర్భంగా డిఎం నమ్రత తెలిపారు.

కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన.. జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్

మైనర్లకు వాహనాలు ఇచ్చినా, లైసెన్స్ లేకుండా నడిపినా కఠిన చర్యలు తీసుకోవాలి



కూకట్‌పల్లి, నవంబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల పరిరక్షణ, అధికారుల పనితీరు, ట్రాఫిక్ విధుల అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల నిర్వహణలో సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను అరికట్టడంతో పాటు వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ట్రాఫిక్-2 శేషాద్రి రెడ్డి, ఏడీసీపీ ట్రాఫిక్-2 వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐ తిమ్మప్పతో పాటు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం నందు పారామెడికల్ కోర్సుల ప్రవేశ గడువు పొడిగింపు... వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శంకర్

ఖమ్మం, నవంబర్ - 03: లోకల్ గైడ్ : ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం నందు డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో (2 సంవత్సరాల వ్యవధి) ప్రవేశాలకు సంబంధించి గడువును నవంబర్ 13 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కోర్సుల్లోనూ చెరో 30 సీట్ల చొప్పున (మొత్తం 60 సీట్లు) అందుబాటులో ఉన్నాయని, అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో 30 చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నట్లు, కోర్సు వ్యవధి 2 సంవత్సరాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులలో మొదట బైపిసి విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారని, ఆ తర్వాత ఎంపిసి, ఇతర అర్హత కలిగిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. వెబ్?సైట్?లో ఆన్?లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్?లైన్ దరఖాస్తు ఫారమ్?ను ప్రింట్ తీసి, అవసరమైన అన్ని ధ్రువపత్రాల (సర్టిఫికెట్ల) నకళ్లను జతచేసి 'ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం' కార్యాలయంలో నేరుగా సమర్పించాలని అన్నారు. దరఖాస్తుల సమర్పణకు పూర్వం అక్టోబర్ 31, 2026 చివరి తేదీగా నిర్ణయించగా, విద్యార్థుల సౌకర్యార్థం ఆ గడువును 13 నవంబర్ 2026 సాయంత్రం 5:00 గంటల వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భక్తి కార్యక్రమాలకు అండగా రామాంజనేయులు గౌడ్ దంపతులు



మిడ్జిల్ నవంబర్ 3(లోకల్ గైడ్) : మిడ్జిల్ గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ ఈదమ్మ దేవాలయంలో నవంబర్ నెల ధూప దీప కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం రామాంజనేయులు గౌడ్ దంపతులు రూ.15 వేల చందా డబ్బులను దేవాలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు.దేవాలయంలో నిత్యం పూజా కార్యక్రమాలు, ధూప దీప నైవేద్యాలు నిరంతరాయంగా కొనసాగేందుకు భక్తులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించిన రామాంజనేయులు గౌడ్ దంపతులను కమిటీ సభ్యులు అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ మాజీ ఎంపీపీ సుదర్శన్ బి ఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బాల్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంజి కృష్ణ సింగిల్ విండో మాజీ చైర్మన్ కుచురు శ్రీనివాసరెడ్డి ఆచారి కరుణాకర్ రెడ్డి భాస్కర్ శ్రీనివాస్ మల్లయ్య మిడ్జిల్ గ్రామ పెద్దలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు ప్రతి నెలా దూడలకు నట్టల నివారణ మందులు తాగించాలి





మిడ్జిల్ నవంబర్ 3(లోకల్ గైడ్): పశువుల ఆరోగ్య పరిరక్షణ, పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మిడ్జిల్ మండలంలోని బైరంపల్లి, బోయిన్‌పల్లి, వాడ్యాల గ్రామాల్లో ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 152 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు.మండల పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దూడలకు నట్టల నివారణ మందులు తాగించడం వల్ల రక్తహీనత నివారణ, శరీర బరువు త్వరగా పెరగడం, సంతానోత్పత్తి సామర్థ్యం మెరుగుపడటం, రోగనిరోధక శక్తి పెంపొందడం వంటి ప్రయోజనాలు ఉంటాయని పాడి రైతులకు వివరించారు. ఆరు నెలల లోపు వయసున్న దూడలకు ప్రతి నెలా నట్టల నివారణ మందులు తప్పనిసరిగా తాగించాలని సూచించారు. అదేవిధంగా బైరంపల్లి గ్రామంలోని నీటి తొట్టిని పరిశీలించారు. ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పాడి పశువులకు అవసరమైన పశుగ్రాసం పెంపకం, వేసవిలో పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, పాడి రైతులు కుమార్, మల్లేష్, అశోక్, కాదయ్య, పశువైద్య సిబ్బంది నర్సింలు, సత్యం (ఓఎస్), గోపాలమిత్రులు మల్లేష్, రామకృష్ణ, వేణుగోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎమ్మెల్యే మదన్ మోహన్ గారి ప్రత్యేక కృషి

లోకల్ గైడ్(3నవంబర్ కామారెడ్డి టౌన్) : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 73 ప్రభుత్వ పాఠశాలలకు రూ.22.33 కోట్ల భారీ నాబార్డ్ బ్యాంకు నిధులు మంజూరు:ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే శ్రీ మదన్ మోహన్ గారి ప్రత్యేక చొరవ, నిరంతర కృషి ఫలితంగా రూ.22.33 కోట్ల భారీ చీూదీూ=ఈ నాబార్డ్ బ్యాంకు నిధులు మంజూరయ్యాయి.నియోజకవర్గ చరిత్రలో గత అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఈ స్థాయిలో నిధులు మంజూరు కావడం విశేషం. మొత్తం 73 ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం, అదనపు భవనాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నారు.ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని సమస్యలను స్వయంగా అనుభవించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ గారు, నేడు అదే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యా వాతావరణం అందుబాటులో ఉండాలన్నదే ఆయన లక్ష్యం.

లింగంపేట్ మండలానికి రూ.4.87 కోట్ల నిధులు:

లింగంపేట్ మండలంలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 36 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.4.87 కోట్ల నిధులు మంజూరయ్యాయి.లింగంపేట్ మండలంలో పాఠశాలల వారీగా తరగతి గదుల నిర్మాణం, నిధుల కేటాయింపు వివరాలు:1. ఎంపీపీఎస్ కొండాపూర్ : 1 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు.2. ఎంపీయూపీఎస్ మేంబాజీపేట్ : 2 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.27.10 లక్షలు మంజూరు.3. ఎంపీపీఎస్ ఒంటేరుపల్లి : 2 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.27.10 లక్షలు మంజూరు.4. ఎంపీపీఎస్ బురుగిద్ద : 1 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు.5. జెడ్‌పీహెచ్ఎస్ లింగంపల్లి(ఖుర్దు): 1 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు.6. జెడ్‌పీహెచ్ఎస్ భవానిపేట్ : 3 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.40.65 లక్షలు మంజూరు.7. ఎంపీపీఎస్ భవానిపేట్ హర్దనవాడ : 1 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు. 8. ఎంపీయూపీఎస్ మెంగారం : 1 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు. 9. పీఎంఎస్‌హెచ్ఆర్ఐ జెడ్‌పీహెచ్ఎస్ లింగంపేట్: 7 తరగతి గదుల నిర్మాణానికి రూ.94.85 లక్షలు మంజూరు 10. జెడ్‌పీహెచ్ఎస్ శెట్పల్లి : 3 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.40.65 లక్షలు మంజూరు 11. ఎంపీపీఎస్ శెట్పల్లి: 1 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు. 12. ఎంపీపీఎస్ పర్మల్ల : 1 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు. 13. ఎంపీపీఎస్ పర్మల్లతండా : 1 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు. 14. ఎంపీపీఎస్ మాలపాటి : 1 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు. 15. ఎంపీపీఎస్ శెట్పల్లి సంగారెడ్డి : 1 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.13.55 లక్షలు మంజూరు. 16. జెడ్‌పీహెచ్ఎస్ శెట్పల్లి సంగారెడ్డి : 9 అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.1 కోటి 21 లక్షల 95 వేల మంజూరు ఎమ్మెల్యే మదన్ మోహన్ గారి సంకల్పం:ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలి.. పేద విద్యార్థులు చదువులో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకూడదు.. అనే లక్ష్యంతో ఎమ్మెల్యే మదన్ మోహన్ గారు విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 73 ప్రభుత్వ పాఠశాలలకు రూ.22.33 కోట్ల నిధులు మంజూరు కావడం ఆయన కృషికి నిదర్శనం.ఇది కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాదు.. రాబోయే తరాల భవిష్యత్తుకు వేసే బలమైన పునాది.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ద్వారా ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో విద్యారంగానికి నూతన దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ గారికి ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పత్తి రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

ఎం.ఎస్.పీ. కంటే మార్కెట్ ధర ఎక్కువగా ఉన్నప్పుడు సీసీఐ కమర్షియల్ పద్ధతిలో కొనుగోళ్లు చేపట్టాలి

సోమిడి శ్రీనివాస్‌రాష్ట్ర కన్వీనర్‌తెలంగాణ రైతు సంఘం...వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,నవంబర్03 (లోకల్ గైడ్ న్యూస్) : సీసీఐ వరంగల్ జనరల్ మేనేజర్ కు తెలంగాణ రైతు సంఘం వినతిపత్రం అందజేత. తెలంగాణ రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి సి ఐ) వరంగల్ జనరల్ మేనేజర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సంవత్సరం అనుకూల వాతావరణ పరిస్థితులు, సరైన వర్షాలు లేకపోవడంతో పత్తి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని, ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీసం పెట్టుబడి కూడా తిరిగి రాని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల కష్టాన్ని గుర్తించి వారికి గిట్టుబాటు ధర కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులు ఎంఎస్‌పీ కంటే ఎక్కువ ధర చెల్లించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, కొంతమంది రైతుల పత్తికి మాత్రమే అధిక ధర ప్రకటిస్తూ, మిగతా రైతుల పత్తిని క్వింటాకు రూ.200 నుంచి రూ.1,000 వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని అన్నారు.మార్కెట్‌లో ఎం.ఎస్.పీ కంటే ఎక్కువ ధర ఉన్నప్పుడు సీసీఐ ఎందుకు కమర్షియల్ పద్ధతిలో కొనుగోళ్లు చేపట్టడం లేదని ప్రశ్నించారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ సంస్థలు ప్రేక్షకపాత్ర వహించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. పత్తి రైతులను ప్రైవేటు వ్యాపారుల దోపిడీకి వదిలేయకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రైతు సంఘం ప్రధాన డిమాండ్లు:1). తెలంగాణ రాష్ట్రంలోని పత్తి రైతులకు క్వింటాలుకు రూ.12,000 ధర కల్పించాలి.2). నాణ్యత, తేమ శాతం పేరుతో అన్యాయంగా ధరలు తగ్గిస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలి.3). మార్కెట్‌లో ఎం.ఎస్.పీ కంటే ఎక్కువ ధర ఉన్నప్పుడు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి సి ఐ) కమర్షియల్ పద్ధతిలో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలి.4). పత్తి కొనుగోళ్లలో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.5). మార్కెట్లలో పారదర్శకమైన వేలం విధానం అమలు చేసి ప్రతి పత్తి రైతుకు న్యాయమైన ధర లభించేలా చూడాలి.రైతుల కష్టాన్ని వ్యాపారుల లాభాలకు బలి చేయవద్దని, పత్తి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సీసీఐ ద్వారా కమర్షియల్ పద్ధతిలో కొనుగోళ్లు చేపట్టకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పత్తి రైతులను ఐక్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.రైతులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రైతు సంఘం రైతాంగం పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఉపాధ్యక్షులు ఊరాటి అంశాలు రెడ్డి, కోశాధికారి సిరుల రవీందర్, కత్తి సుధాకర్, బొల్లి ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ బాలు కు సన్మానం

19 సంవత్సరాల నుండి రక్తదానంలో సేవలు అభినందనీయం

కామారెడ్డి జిల్లా ఐవిఎఫ్ విభాగం ఆధ్వర్యంలో



లోకల్ గైడ్ 3నవంబర్ కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయంలో ఈ రోజు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) ఆధ్వర్యంలో దేశంలోనే అత్యంత శ్రీ రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ పురస్కారం - 2026 ను ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు పొందిన సందర్భంగా అభినందన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్,ఐవిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,ఫార్మా కౌన్సిల్ సభ్యులు చిలువేరి మారుతి లు మాట్లాడుతూ 19 సంవత్సరాల నుండి నిర్విరామంగా రక్తదాన సేవలు చేస్తూ కామారెడ్డి ఖ్యాతిని ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లిన డాక్టర్ బాలు సేవలు అభినందనీయమని నేటి యువతకు మార్గదర్శకంగా ప్రేరణగా ఉంటాయని అన్నారు. జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ బాలు మాట్లాడుతూ నిస్వార్థంగా సేవ చేస్తే ఎంత గొప్ప అవార్డులైనా వస్తాయని,డబ్బు లేకుండా చేయగలిగే అత్యంత విలువైన సహాయం రక్తదానం మాత్రమే అని రక్తదాతలు ప్రాణదాతలే అని అన్నారు.తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని అన్నారు. రక్తదానానికి సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్,కోశాధికారి కష్ప వెంకన్న,ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షుడు ఎల్లంకి సుదర్శన్,నంగునూరి కాశీనాథం,ఉపాధ్యక్షులు రాజూరి మనోహర్, అర్వపల్లి రమేష్,ఎర్రం నారాయణ లు పాల్గొనడం జరిగింది.

పట్టభద్రులందరూ ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ శాంభీపూర్ రాజు

వేమన రెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం





శేరిలింగంపల్లి, నవంబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ శాంభీపూర్ రాజు కోరారు. కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేమన రెడ్డి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ శాంభీపూర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియకు గడువు సమీపిస్తున్నందున అర్హులైన పట్టభద్రులు ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమని, పట్టభద్రులకు ప్రత్యేకంగా కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఓటరు నమోదు ద్వారా పట్టభద్రులు తమ హక్కును పొందడంతోపాటు, భవిష్యత్తులో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో తెలియజేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కాలనీల్లోని పట్టభద్రులను గుర్తించి నమోదు ప్రక్రియలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొబ్బ నవతారెడ్డి, రంగారావు, పలువురు బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో చీఎవీ ఉద్యోగుల సమ్మెకు టీడీపీ సంఘీభావం!

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.. జీతాలు పెంచాలి

-- ప్రొఫెసర్ తిరుణగరి జ్యోత్న డిమాండ్!



పెద్దపల్లి;; నవంబర్, 3: (లోకల్ గైడ్) : చీఎవీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ తిరుణగరి జ్యోత్స్న డిమాండ్ చేశారు.పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ (చీఎవీ) ఉద్యోగులకు ఆమె సంఘీభావం తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్ కుమార్ టీడీపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతితో కలిసి సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ..ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు కేడర్‌తో సంబంధం లేకుండా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. విధుల్లో ఉన్న ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి 20 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ ఏడుకొండలు, కోటగిరి పాపయ్య, , మహిళా నాయకురాలు షరీఫా, అంజలి, ఇతర టీడీపీ నాయకులు, పెరక శ్రీనివాస్ పెరక సుధాకర్ కుక్క సుధాకర్ పాల్గొన్నారు కార్యకర్తలు, చీఎవీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మియాపూర్ భూములు ఉద్యమకారుల కుటుంబాలకు కేటాయించాలి

పేదల ఇళ్లను క్రమబద్ధీకరించి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

శేరిలింగంపల్లి తెరాస ఇంచార్జి.. వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్





సైబరాబాద్, నవంబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మియాపూర్‌లోని 100, 101 సర్వే నంబర్లలో ఉన్న భూములను సుప్రీంకోర్టు ప్రభుత్వ భూములుగా గుర్తించిన నేపథ్యంలో ఆ భూములను తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు, అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, శేరిలింగంపల్లి ఇంచార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రక్షణ సేన నాయకులతో కలిసి ఆయన మియాపూర్‌లోని సదరు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గత 30 ఏళ్లుగా ఈ ప్రాంతంలో సుమారు 15 వేల పేద, నిరుపేద కుటుంబాలు నివాసముంటున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, వారి నివాసాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు, అర్హులైన ఉద్యమకారులకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇళ్లులేని నిరుపేదలకు ఈ భూములను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఇప్పటికే నివాసముంటున్న వారి జోలికి వెళ్లబోమని కలెక్టర్ ప్రకటిస్తుండగా, మరోవైపు ఖాళీ భూములతో పాటు మొత్తం 550 ఎకరాలను విక్రయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం ప్రజలలో అయోమయానికి కారణమవుతోందన్నారు. ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు కేటాయించకుండా పేదల ప్రయోజనాలకే వినియోగించాలని, ఎంఏ నగర్, స్టాలిన్ నగర్, పీఏ నగర్, ప్రశాంత్ నగర్ వాసుల ఇళ్లను క్రమబద్ధీకరించాలని కోరారు. పేదలకు అన్యాయం జరిగితే తెలంగాణ రక్షణ సేన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడ లావణ్య, విష్ణు చారి, కుమార్ యాదవ్, సుజాత, ప్రవీణ్ బిజిలి, శ్రీనివాస్ నేత, సందీప్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చలకపల్లి రెండెప్ప

న్యాయ శాస్త్ర విద్యార్థిని చంద్రకళ పార్థివ దేహానికి నివాళ్లకు అర్పించిన డా.విశారాధన్ మహారాజ్..

బాధిత కుటుంబానికి న్యాయం కోసం అండగా నిలుస్తామని హామీ ..



లోకల్ గైడ్ న్యూస్ 03 కొందుర్గ్.. : గత మూడు రోజుల క్రితం కరీంనగర్లోని శాతవాహన యూనివర్సిటీలో న్యాయ శాస్త్ర విద్యార్థినీఅత్యంత నిమ్న పేద వర్గానికి చెందిన ధాకూరి చంద్రకళ ఆత్మ హత్యా చేసుకున్న విషయాన్ని కార్యకర్తల ద్వారా తెలుసుకున్న డీఎస్పీ ఉద్యమ వ్యవస్థాపకులు విశారదన్ మహారాజ్ నేడు ఉదయం 11 గంటలకు ఆమె పార్థివ దేహాన్ని ,షాద్ నగర్ పట్టణంలోని ఆమె స్వగృహంలో అంతివ నివాళులు అర్పించారు,ఈసందర్భంగా విధారాధన్ మహారాజ్ మాట్లాడుతూ కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎల్,ఎల్,బి రెండో సంవత్సరం చదువుతున్న దక్కలి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థి ధాకూరి చంద్రకళకు యూనివర్సిటీలో ఆత్మహత్య చేసుకుంది ఈ ఘటనపై ఆమె కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కరీంనగర్ కళాశాల వైస్ ఛాన్సలర్ తో ఫోన్లో మాట్లాడి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.చనిపోయిన చంద్రకళ కు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు విశారదన్ మహారాజ్.వెంట సామాజిక ఉద్యమ కారులైన,డి ఎస్ పి కార్యకర్తలు భారీగా హాజరైనారు..

న్యాయ శాస్త్ర విద్యార్థిని చంద్రకళ అంతిమ యాత్రలో పాల్గొన్న పద్మశ్రీ ..

బాధిత కుటుంబానికి న్యాయం కోసం అండగా నిలుస్తాం మందకృష్ణ మాదిగ...



లోకల్ గైడ్ న్యూస్ 03 కొందుర్గ్.. : గత మూడు రోజుల క్రితం కరీంనగర్లోని శాతవాహన యూనివర్సిటీలో న్యాయ శాస్త్ర విద్యార్థినీఅత్యంత నిమ్న పేద వర్గానికి చెందిన ధాకూరి చంద్రకళ ఆత్మ హత్యా చేసుకున్న విషయాన్ని కార్యకర్తల ద్వారా తెలుసుకున్న కృష్ణమాదిగ నేడు మధ్యాహ్నం 2 గంటలకు ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించిఅనంతరం,షాద్ నగర్ పట్టణంలో జరుగనున్న అంతిమ కార్యక్రమాలలో పాల్గొన్నారు,ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎల్,ఎల్,బి రెండో సంవత్సరం చదువుతున్న దక్కలి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థి ధాకూరి చంద్రకళకు యూనివర్సిటీలో ఆత్మహత్య చేసుకుంది ఈ ఘటనపై ఆమె కుటుంబానికి తగిన న్యాయంజరిగే వరకు ప్రభుత్వం పై రాజీలేని పోరాటం చేస్తామని ,ఆమె కుటుంబాన్ని యంఆర్పిఎస్ అండగా నిలుస్తుందని ప్రభుత్వం ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని తెలిపారు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ వెంటా దండోరా సామాజిక ఉద్యమ శ్రేణులు భారీగా హాజరైనారు....

పాలకులు జనాభా ప్రాతిపదికన బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి ....

నేటికి సమాజంలో అంటరానితనం పాటిస్తూ సామాజిక న్యాయం అమలు చేయటం లేదు..

జీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య...




లోకల్ గైడ్ న్యూస్ 03 కొందుర్గ్..: సిపిఐ పార్టీ తెలంగాణ వ్యవసాయ కార్మిక ఆధ్వర్యంలో నేడుకొందుర్గు జిల్లేడు చౌదరిగుడా మండలాలముఖ్యకార్యకర్తలసమావేశం రామచంద్రపూర్ లో కాళపూరం బాల్ రాజ్ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమం లో ముందుగా కొందుర్గ్ ,-- జిల్లేడు చౌదరిగూడ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు కొందుర్గు మండల అధ్యక్షులుగా సత్యనారాయణ మండల ఉపాధ్యక్షులు యాదమ్మ మండల ప్రధాన కార్యదర్శి భూపాల్ మండల సహాయ కార్యదర్శి ఎం మల్లేష్ కోశాధికారి సి సురేష్ జిల్లేడు చౌదరిగుడా నూతన కమిటీ అధ్యక్షులుగా ఎస్ భాస్కర్ ప్రధాన కార్యదర్శిగా కాళ్ళ పురం బాలరాజు యాదవ్ ఉపాధ్యక్షులుగా యాదయ్య కార్యదర్శిగా వీరేశం కోశాధికారిగా కే మల్లేష్ తో పాటు మరో 11 మందిని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా విచ్చేసిన బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య మాట్లాడుతూ భారతదేశంలో 50శాతం ఉన్న బీసిలకు విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలలో తగిన ప్రాధాన్యత లేదని ప్రధాని నరేంద్ర మోడీ నీ ప్రశ్నించారు కులగణన చేపట్టి బీసీ లందరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలను షెడ్యూల్ జీఓ నెంబర్ 9 ప్రకారం జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని కొన్ని కులాలకు నేటికీ కులవివక్ష అంటరానితనం ఉందన్నదని బీసీలలో అట్టడుగు వర్గాలు సంచార జాతులు అనేకం కూడు గూడు గుడ్డ సమాజంలో గౌరవం నోచు కోకపోవడం కడు సోచనీయమని,తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బిసి డిక్లరేషన్ బహిరంగ సభ పెట్టి బీసీల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి నేడుబీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం విడ్డూరం,ఇకనైనా ప్రభుత్వాలు 50 శాతం ఉన్న బీసీ లందరికీ తగిన ప్రాధాన్యత ఇచ్చి బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేకమైన మంత్రివర్గంలో బీసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధి కోసం తోడుపాటి ఇవ్వాలనీ లేనియెడల బీసీలు అందరూ ఏకమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై తిరగబాటు తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బి కే ఎం యు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య సిపిఐ జిల్లేడు చౌదరిగుడా మండల కార్యదర్శి జిల్లెల వెంకటేష్, కొందుర్గు మండల కార్యదర్శి భాగళ నరసింహ పాల్గొన్నారు ...

అనుమతులు ఉన్నా మట్టి టిప్పర్లకు అడ్డంకులు..

డ్రైవర్లపై దాడి చేసినట్లు ఆరోపణలు!

పదిమందికి ఉపాధి కల్పిస్తున్న వ్యాపారికి వేధింపులు.. మద్దికుంటలో నిలిచిపోయిన మట్టి రవాణా



పెద్దపల్లి జిల్లా, నవంబర్ 3:(లోకల్ గైడ్) : పెద్దపల్లి జిల్లా మద్దికుంట గ్రామంలో మట్టి రవాణా విషయంలో వివాదం నెలకొంది. అన్ని ప్రభుత్వ అనుమతులు పొందిన అనంతరం మట్టి తరలింపు చేపడుతున్న సానుకొమ్ము రామిరెడ్డికి చెందిన టిప్పర్లను గ్రామంలోని కొంతమంది వ్యక్తులు అడ్డుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా టిప్పర్ డ్రైవర్లపై దాడి చేసి చితకబాదినట్లు బాధిత వర్గం ఆరోపిస్తోంది. సానుకొమ్ము రామిరెడ్డి తన వ్యాపారం ద్వారా సుమారు పదిమందికి ఉపాధి కల్పిస్తూ జీవనోపాధి కల్పిస్తున్నప్పటికీ, స్థానికంగా కొంతమంది వ్యక్తులు కావాలనే మట్టి టిప్పర్ల రాకపోకలకు అడ్డంకులు సృష్టిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామిరెడ్డి వర్గం ఆరోపిస్తోంది. ముఖ్యంగా సల్లు అనే వ్యక్తి తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని రామిరెడ్డి వర్గం ఆరోపిస్తోంది. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ మట్టి రవాణాను అడ్డుకోవడం, డ్రైవర్లపై దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలతో టిప్పర్ల రవాణా నిలిచిపోవడమే కాకుండా, వాటిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల ఉపాధి కూడా ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించి, మట్టి రవాణాకు సంబంధించిన అనుమతులను పరిశీలించి, నిజానిజాలు విచారించాలని బాధితులు కోరుతున్నారు. డ్రైవర్లపై దాడులకు పాల్పడిన వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, చట్టబద్ధంగా వ్యాపారం చేసుకునే వారికి మరియు కార్మికులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నెలకు రూ.18 లక్షల అద్దె.. తీరని కష్టాలు!

మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో భగ్గుమన్న నిరసన

హాస్టల్, క్యాంటీన్, రవాణా సౌకర్యాల కోసం రోడ్డెక్కిన కాబోయే వైద్యులు

రెండు రోజులుగా ధర్నా.. మూడేళ్లుగా హామీలకే పరిమితం



ఇబ్రహీంపట్నం నవంబర్ 3 (లోకల్ గైడ్) : ప్రభుత్వం వైద్య విద్యకు పెద్దపీట వేస్తున్నామని ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. వసతి గృహం, క్యాంటీన్, రవాణా సౌకర్యాలు వెంటనే ఏర్పాటు చేయాలంటూ కళాశాల ఎదుట విద్యార్థులు చేపట్టిన ధర్నా వరుసగా రెండో రోజు కొనసాగింది.

లక్షల్లో అద్దె.. శూన్యంలో సౌకర్యాలు

ఇబ్రహీంపట్నం మండలంలోని భరత్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో గత మూడేళ్లుగా మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని కొనసాగిస్తున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం నెలకు సుమారు రూ. 18 లక్షల మేర అద్దె చెల్లిస్తోంది. లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ, విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని విద్యార్థులు మండిపడుతున్నారు.

తీరని హాస్టల్, క్యాంటీన్ గోస

కళాశాలలో సరైన హాస్టల్, నాణ్యమైన ఆహారం అందించే క్యాంటీన్ లేకపోవడంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా సదుపాయాలు లేక నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సమస్యలపై గత మూడేళ్లుగా కలెక్టర్, ఆర్డీవో సహా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని.. కేవలం హామీలతోనే సరిపెడుతున్నారని వాపోయారు.

తక్షణమే పరిష్కరించాలి..

అధికారుల నిర్లక్ష్యం వీడి విద్యార్థుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక హాస్టల్ భవనం, క్యాంటీన్, రవాణా సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రూ.6.78 కోట్ల నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు!

అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద భారీ రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

నలుగురు నిందితుల అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ

తయారీ సామగ్రి, డమ్మీ తుపాకీ, వాకీటాకీలు, కారు స్వాధీనం





ఇబ్రహీంపట్నం,అబ్దుల్లాపూర్‌మెట్ నవంబర్ 3(లోకల్ గైడ్) : రాష్ట్రంలో భారీ ఎత్తున నకిలీ కరెన్సీ ముఠా కార్యకలాపాలను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, ఎస్ఓటీ షాద్‌నగర్ బృందం సంయుక్తంగా భగ్నం చేశాయి. ఏకంగా రూ.6.78 కోట్ల విలువైన నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకుని సంచలనం సృష్టించాయి. ఈ దందాకు పాల్పడుతున్న నలుగురు సభ్యులను అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు నిందితులు తప్పించుకున్నారు.

వాహన తనిఖీల్లో దొరికిన కీలక ఆధారాలు

నవంబర్ 1వ తేదీ రాత్రి జాతీయ రహదారి-65పై రామోజీ ఫిల్మ్ సిటీ ప్రధాన ద్వారం సమీపంలోని బాలాజీ ధాబా వద్ద పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ మారుతి డిజైర్ కారును ఆపి సోదా చేయగా, భారీ ఎత్తున నకిలీ రూ.500 నోట్ల కట్టలతో పాటు డమ్మీ పిస్టల్, వాకీటాకీలు, నకిలీ పోలీస్ ఐడీ కార్డులు బయటపడ్డాయి. దీంతో కారులోని వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు బాగోతం వెలుగుచూసింది.

కుంట్లూరులో అద్దె ఇల్లే అడ్డా!

నిందితులు కుంట్లూరు ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా నకిలీ నోట్ల ముద్రణా కేంద్రాన్ని నడుపుతున్నట్లు గుర్తించారు. పోలీసులు ఆ స్థావరంపై దాడి చేసి హై-ఎండ్ కలర్, లేజర్ ప్రింటర్లు, స్కానర్లు, ల్యాప్‌టాప్‌లు, లామినేషన్ యంత్రాలు, ప్రత్యేక నోట్ల కటింగ్ మెషిన్లను సీజ్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అచ్చం అసలైన నోట్లను తలపించేలా రూ.500 నోట్లను పెద్ద ఎత్తున ముద్రించి మార్కెట్లోకి వదిలేందుకు ప్లాన్ చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

నకిలీ పోలీసుల అవతారంలో బెదిరింపులు.. వసూళ్లు

ఈ ముఠా నకిలీ నోట్ల చెలామణితో పాటు మోసాలకు కూడా తెరలేపింది. నకిలీ కరెన్సీని తక్కువ ధరకు ఇస్తామంటూ అమాయకులను నమ్మించేవారు. తీరా లావాదేవీల సమయానికి వీరే నకిలీ ఐడీ కార్డులు, వాకీటాకీలు, డమ్మీ తుపాకులతో పోలీస్ అధికారులమంటూ ప్రత్యక్షమై ఎదుటివారిని బెదిరించి అసలు నగదును దోచుకునేవారు. ఈ తరహాలోనే గతంలో ఇద్దరు బాధితుల నుంచి రూ.2 లక్షలు, రూ.3 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తేలింది.

నలుగురు కటకటాల్లోకి.. పరారీలో ఉన్నవారి కోసం గాలింపు

పట్టుబడిన నిందితులను మడుపోజు కర్ణాకర్, చిన్నోళ్ల మాణిక్యరెడ్డి, చెరుకుపల్లి రత్నాకర్‌రెడ్డి, కరణం అజయ్‌కుమార్‌లుగా గుర్తించి అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న జెల్లి వెంకటేష్, కుంజ బాలరాజు, కాంపసాటి శ్రీనివాస్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశారు. వీరి వెనుక ఇంకెవరైనా సూత్రధారులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది...ఫ్యూచర్ సిటీ సీపీ డాక్టర్ తరుణ్ జోషి ఐపీఎస్ పర్యవేక్షణలో డీసీపీ కె. నారాయణరెడ్డి, ఏసీపీ కేవీపీ రాజు, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజుల ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. నిందితులను పట్టుకున్న పోలీస్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాల ఆరోపణలు!

- పనికి రాకుండానే హాజరు..
చివర్లో ఫొటో దిగితే చాలు.
- కూలీల ఖాతాల్లో డబ్బులు పడగానే 50 శాతం వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు.
- మేటీలు, సంబంధిత సిబ్బంది తీరుపై అనుమానాలు.. సమగ్ర విచారణకు గ్రామస్తుల విజ్ఞప్తి.

లోకల్ గైడ్/బంట్వారం : గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించి, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న వీబీ--జీ రామ్ జీ ఉపాధి పథకం కొందరి అక్రమాలకు వేదికగా మారుతోందన్న ఆరోపణలు బంట్వారం ప్రాంతంలో చర్చనీయాంశంగా మారాయి. కష్టపడి పనిచేసే కూలీలకు అండగా నిలవాల్సిన పథకంలోనే అక్రమాలు చోటుచేసుకుంటున్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనికి రాకుండానే హాజరు.. డబ్బుల పంపకాలు!

కొంతమంది మేటీలు, కూలీలు, మరికొందరు స్థానికులు కుమ్మక్కై పనులకు పూర్తిస్థాయిలో హాజరుకాకుండానే కూలీ వేతనాలు పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజంతా పనులకు హాజరుకాకపోయినా చివర్లో వచ్చి ఫొటో దిగితే సరిపోతుందని కొందరు మేటీలు చెబుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కూలీల ఖాతాల్లో వేతనాలు జమ అయిన అనంతరం వాటిలో 50 శాతం వరకు వాటాగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంలో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ పాత్రపైనా గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

నిజమైన కూలీలకు అన్యాయం.. అధికారుల స్పందన ఏదీ?


ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్న నిజమైన కూలీలకు ఇలాంటి వ్యవహారాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకం లక్ష్యం పక్కదారి పట్టకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో విచారణ జరిపితేనే నిజాలు వెలుగులోకి!

సంబంధిత ఉన్నతాధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల ప్రదేశాలు, కూలీల హాజరు, మస్టర్ రోల్స్, పని దినాల ఫొటోలు, వేతనాల చెల్లింపులు, బ్యాంకు ఖాతాల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులైన మేటీలు, సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పేద కూలీల చెమటకు దక్కాల్సిన సొమ్ము మధ్యలోనే పక్కదారి పట్టకుండా ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆపదలో అండగా నిలిచిన జీవన్ జ్యోతి బీమా..

బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత



పెద్దపల్లి , నవంబర్ 03: (లోకల్ గైడ్) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికారులు తెలిపారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సబితం శాఖ పరిధిలో ఖాతాదారుడిగా ఉన్న అగ్గి శ్రావణ్ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకంలో సభ్యత్వం పొందారు. ఆయన మృతి చెందడంతో పథకం నిబంధనల ప్రకారం ఎల్‌బీసీ ఆఫ్ ఇండియా ద్వారా మంజూరైన రూ.2 లక్షల బీమా పరిహారం చెక్కును సోమవారం బ్యాంకు అధికారులు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ, తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల్లో ప్రతి ఒక్కరూ చేరి బీమా రక్షణ పొందాలని సూచించారు. ఆపద సమయంలో ఈ పథకాలు బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రమేష్, అసిస్టెంట్ మేనేజర్ దేవాన్ష్, క్యాషియర్ సదయ్య, బ్యాంకు సిబ్బంది, లబ్ధిదారుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తే సైబర్ నేరాలకు అసలైన రక్షణ జిల్లా ఎస్పీ :అక్షాంష్ యాదవ్

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి భువనగిరి నవంబర్ 3 (లోకల్ గైడ్) : భువనగిరి ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణ, సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారు మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎవరితోనూ ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు, యూపీఐ పిన్ నంబర్ లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా ఎఎవెతీ-ఎతీఅఎవ.స్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఎస్ఐలు నాగరాజు, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చంద్రకుమార్ తొండెపి

ఎమ్మెల్సీ ఓటరు నమోదులో నిర్లక్ష్యం తగదు!అజ్మీరా వీరన్న

అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలి



కారేపల్లి, నవంబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు విషయంలో అర్హులైన వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని మండల మాజీ సీనియర్ జర్నలిస్టు అజ్మీరా వీరన్న పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని వృథా చేసుకోవద్దని ఆయన సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కారేపల్లి మండల పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు చాలామంది దరఖాస్తు చేసుకోకపోవడం ఆందోళనకరమన్నారు. పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకుని, వారి హక్కుల కోసం శాసనమండలిలో గళం వినిపించే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం పట్టభద్రుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు.ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోకుండా ఎన్నికల సమయంలో నాయకులను ప్రశ్నించడం వల్ల ప్రయోజనం ఉండదని, ముందుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందాలని హితవు పలికారు. విద్యావంతులు రాజకీయ వ్యవస్థలో చురుకైన పాత్ర పోషించినప్పుడే ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన సమర్థ నాయకత్వం ఏర్పడుతుందని అన్నారు. మండలంలోని డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు, ఇతర పట్టభద్రులు నిర్లక్ష్యం వీడి ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అజ్మీరా వీరన్న విజ్ఞప్తి చేశారు.

మియాపూర్ 550 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనాలకు కేటాయించాలి

-కాలనీవాసులకు ఇంటి పట్టాలివ్వాలి.. ప్రభుత్వ భూమిని అమ్మితే

-ప్రజా పోరాటాలు తప్పవు..గాధగోని రవి





సైబరాబాద్, నవంబర్ 03 (లోకల్ గైడ్ ప్రతినిధి): మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101లో ఉన్న 550 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్మకుండా ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలని, స్టాలిన్ నగర్, ముజాఫర్ అహ్మద్ నగర్ కాలనీవాసులకు ఇంటి పట్టాలు ఇచ్చి నివాసాలకు చట్టబద్ధత కల్పించాలని యంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాధగోని రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యంసిపిఐ (యు) ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు మియాపూర్ ప్రభుత్వ భూములను, కాలనీలను సందర్శించి నివాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గాధగోని రవి మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా మియాపూర్ ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. 1994లో అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శాసనసభలో ఈ భూముల అంశాన్ని ప్రస్తావించారని, 1996లో ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిషన్ నివేదికలో ఈ భూములు ప్రభుత్వానివేనని తేలిందన్నారు. తాంద్ర కుమార్ నాయకత్వంలో పేదలకు నివాసాలు కల్పించేందుకు స్టాలిన్ నగర్, ముజాఫర్ అహ్మద్ నగర్ కాలనీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి. నరసింహారావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు జే.వి.చలపతిరావు, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు హన్మేష్, ఎస్యూసీఐ(సి) రాష్ట్ర కమిటీ సభ్యులు జానీ పాషా మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించకుండా పేదల అవసరాలకు వినియోగించాలని, నివాసాలకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వల్లెపు ఉపేందర్ రెడ్డి, మోర్తాల చందర్రావు, వనం సుధాకర్, కుంభం సుకన్య, వి.తుకారాం నాయక్, పానుగంటి నరసయ్య, మైదం శెట్టి రమేష్, తుడుం అనిల్ కుమార్, అంగడి పుష్ప, తాంద్ర కళావతి, కర్ర దానయ్య, ఇస్లావత్ దశరథ్ నాయక్, పల్లె మురళి, సి.శోభన్, కృష్ణ, జి.శివాని, డి. శ్రీనివాసులు, మహేష్, ఎన్.నాగభూషణం, డి.కె.నారాయణ, సూర్తనా బేగం, రజియా బేగం, ఎం.రాణి, ఎన్. గణేష్, కొడిపాక రాజు, యం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో రైల్వే పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ : ఇండియన్ రైల్వేస్ ఆధ్వర్యంలో రాబోయే వేసవి కాలంలో ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక పర్యాటక ప్రాంతాల సందర్శనకు ప్యాకేజీలు నిర్ణయించినట్లు. రైల్వేస్ పర్యాటక విభాగం అసిస్టెంట్ మేనేజర్ వివి వెంకటేశం తెలిపారు మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధి చెందిన ఆలయాలకు పర్యాటక ప్రాంతాలకు ఇండియన్ రైల్వే ప్యాకేజీలు నిర్ణయించిందని ఈ అవకాశాన్ని దేశ ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్లైన్లో బుక్ చేసుకోవాలన్నారు తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ రైల్వే స్టేషన్లలో కూడా బుక్ చేసుకోవచ్చన్నారు మరిన్ని వివరాల కోసం 040 27702407, 9701360701 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు

నీటి నాణ్యత పరీక్షలు, శుద్ధి విధానం పట్ల సంతృప్తి చెందిన జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనీవేష్ భట్టాచార్య.

పనగల్ సమీపంలోని జిల్లా నీటి నాణ్యత ప్రయోగశాల, మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం పరిశీలన.







నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ : నల్గొండజిల్లాలో ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు చేపడుతున్న నీటి శుద్ధి ప్రక్రియలు, నీటి నాణ్యత పరీక్షల నిర్వహణ పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య సంతృప్తి వ్యక్తం చేశారు.మంగళ వారం ఆయన పానగల్లు ప్రాంతంలో మిషన్ భగీరథ నీట్ శుద్ధ కేంద్రాన్ని , జిల్లా నీటి నాణ్యత ప్రయోగశాల (ఎన్ఏబీఎల్ ల్యాబ్)ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయోగశాలలో నిర్వహిస్తున్న రసాయనిక, మైక్రోబయోలాజికల్ పరీక్షల వివరాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు.పరీక్షలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు.పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల నుంచి సేకరించిన నీటి నమూనాల పరీక్షా నివేదికలను తనిఖీ చేశారు. ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న విధానం, నాణ్యత ప్రమాణాల అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పానగల్లోని ఉదయసముద్రం వద్ద ఉన్న మిషన్ భగీరథ ఇంటేక్ వెల్, 35 ఎంఎల్డీ నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నీటిని శుద్ధి చేస్తున్న విధానం, ప్రయోగశాలలో నిర్వహిస్తున్న పరీక్షలు, నిర్వహణ రిజిస్టర్లు, ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్న విధానం గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.నీటి శుద్ధి ప్రక్రియను, నాణ్యత పరీక్షలను పరిశీలించిన ఆయన ఇక్కడ అమలు చేస్తున్న విధానాలను అభినందించారు. ఇదే తరహా నీటి శుద్ధి, నాణ్యత పర్యవేక్షణ విధానాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు.మిషన్ భగీరథ ఎస్.ఈ. నాగేశ్వరరావు , ఈ ఈ శాంతకుమారి, ఎఈఈ సంతోష్, ప్రయోగశాల ఇంచార్జీ పి. వీరారెడ్డి (డబ్ల్యూక్యూఎం కెమిస్ట్), బి. సుజాత (మైక్రోబయాలజిస్ట్), ఎస్. రేణుక (కెమిస్ట్), ప్రశాంతి, సత్యనారాయణ వెంట ఉన్నారు.

జిల్లాలో రక్షిత మంచినీరు పారిశుద్ధ పరిశుభ్రత నిర్వహణ తీరు బాగుంటుంది

జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అన్వేష్ భట్టాచార్య.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్. : నల్గొండ జిల్లాలో రక్షిత మంచినీరు , పారిశుద్ధ్యం, పరిశుభ్రత నిర్వహణ తీరు బాగుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య అన్నారు. నల్గొండ జిల్లాలో తాగునీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతల అమలు తీరు అధ్యయనం నిమిత్తం 2 రోజుల జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రానికి రాగా, ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదన కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో జై. అశోక్ రెడ్డి ,జిల్లా అధికారులు పూల మొక్కలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు .జిల్లాలో ప్రజలకు అందిస్తున్న రక్షిత మంచినీరు, పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలు, మారుమూల గిరిజన ప్రాంతాలలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం , పరిశుభ్రత, విద్య ,వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో గతంలో ఫ్లోరైడ్ సమస్యను ఎదుర్కొన్న ప్రాంతాలు, అక్కడ తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తాగునీటి పథకాలు, మిషన్ భగీరథ వచ్చిన తర్వాత ప్రజలకు అందిస్తున్న తాగునీటి సరఫరా వివరాలను మిషన్ భగీరథ ఎస్ ఈ నాగేశ్వరరావు తెలియజేశారు .పారిశుధ్య ,ఆరోగ్య విషయాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ తెలియజేయగా, పాఠశాల విద్య ,విద్యార్థుల సౌకర్యాల పై జిల్లా విద్యాశాఖ అధికారి సుశేందర్రావు, అంగన్వాడి కేంద్రాల నిర్వహణ, తాగునీరు, పిల్లల ఆరోగ్యం,తదితర అంశాలను జిల్లా సంక్షేమ అధికారి లావణ్యలు తెలియజేశారు.అనంతరం జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనివేశ్ భట్టాచార్య మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో తాగునీరు ,పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ బాగుందని, అలాగే పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న వైద్యం, ఆరోగ్యం పారిశుధ్య కార్యక్రమాలను చక్కగా నిర్వహిస్తుండడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని, అధికారులను ఆయన అభినందించారు .మారు మూల గిరిజన ప్రాంతాలతో పాటు, అన్ని గ్రామాలు, మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా కొనసాగించాలని, అలాగే ఎల్ నినో పరిస్థితి దృష్ట్యా నీటిని వృధా చేయకుండా వినియోగపడేలా చూడాలని తెలిపారు.పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తరచూ తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, అప్పుడే విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించిన వారం అవుతారని అన్నారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో ఆర్ఓ ప్లాంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ ఈ నాగేశ్వరరావు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, వైద్య, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన విషయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్ హెచ్ ఆర్ సి స్పెషల్ మానిటర్ కు వివరించారు.

మహిళల రక్షణలో సమర్థవంతంగా పనిచేస్తున్న నల్లగొండ షీ టీమ్స్.

మహిళలు మౌనం వీడి నిర్భయంగా ఫిర్యాదు చేయాలి--

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ..

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి లోకల్ గైడ్ : మహిళలు, బాలికలు, చిన్నారులు, విద్యార్థినుల భద్రతకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తన వంటి ఘటనలను అరికట్టేందుకు షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తూ బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.నల్లగొండ, మిర్యాలగూడ కేంద్రాలుగా రెండు షీ టీమ్స్ బృందాలు పనిచేస్తున్నాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ తదితర జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి వేధింపులకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాయి.మహిళలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను తెలియజేసేందుకు షీ టీమ్స్ భరోసా కల్పిస్తున్నాయి.ఫిర్యాదు చేయడానికి మహిళలు నేరుగా పోలీస్ స్టేషన్లకు రావాల్సిన అవసరం లేకుండా డయల్ 112, పోలీస్ శాఖ అందించిన క్యూ.ఆర్ కోడ్, వాట్సాప్ తదితర మార్గాల ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించామని ఎస్పీ తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మైనర్ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమస్యను ప్రారంభంలోనే తెలియజేస్తే బాధితులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవచ్చని, మౌనంగా ఉండటం వల్ల వేధింపులు మరింత పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఒక్క ఫోన్ కాల్ ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వినియోగంలో మహిళలు, యువతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయాలు పెంచుకొని ఫోటోలు సేకరించడం, వాటిని మార్ఫింగ్ చేసి బ్లాక్మెయిల్ చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని హెచ్చరించారు.తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్ట్లను అంగీకరించవద్దని, వ్యక్తిగత ఫోటోలు, వివరాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని, ఖాతాల్లో ప్రైవసీ సెట్టింగ్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.మహిళలు బయటకు వెళ్లే సమయంలో తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన టి – సేఫ్ యాప్ను డౌన్లోడ్ చేసుకొని వినియోగించుకోవాలని, ప్రయాణ సమయంలో భద్రతా సేవలను ఉపయోగించుకోవాలని ఎస్పీ సూచించారు.





అక్టోబర్ నెలలో షీ టీమ్స్ పనితీరు:

అక్టోబర్ నెలలో షీ టీమ్స్కు 14 ఫిర్యాదులు అందగా, వాటిలో 3 పెట్టీ కేసులు నమోదు చేశారు. మహిళల భద్రతపై 57 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 49 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వేధింపులకు పాల్పడుతున్న 38 మందిని రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. హాట్స్పాట్ ప్రాంతాలను 492 సార్లు సందర్శించి నిఘా కొనసాగించారు. ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: జిల్లా షీ టీమ్: 8712670235 జిల్లా షీ టీమ్ ఇన్చార్జి కె. మంజుల, ఇన్స్పెక్టర్: 8712670143 నల్లగొండ షీ టీమ్ ఇన్చార్జి గౌస్, ఎస్ఐ: 8712576870 మిర్యాలగూడ షీ టీమ్ ఇన్చార్జి ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్ఐ: 8712582094. మహిళల భద్రతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.మహిళలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా వేధింపులపై ఫిర్యాదు చేయాలని, వారి రక్షణకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

-- సిఐటియూ.

రాజేంద్ర **నగర్, (లోకల్ గైడ్):** ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. డిసెంబరు 15వ తేదీన నిర్వహించే ఆశా వర్కర్ల సమ్మె నోటీసును మంగళవారం ఆశావర్కర్లతో కలిసి సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే రుద్ర కుమార్, జగదీష్, సిఐటియు ఆశా వర్కర్ల యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కవిత ల ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి సిసికి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు:

1. ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 స్థిర వేతనం చెల్లించాలి.



2. రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50,000 ప్రసూతి ఖర్చులు కల్పించాలి. 3. రిటైర్మెంట్ బెనిఫిట్గా రూ.5 లక్షలు చెల్లించాలి. పెన్షన్ సౌకర్యం కల్పించాలి. 4. ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు, సంవత్సరానికి 20 రోజుల క్యాజువల్ లీవ్, ఆరు నెలల ప్రసూతి సెలవులు కల్పించాలి. 5. అర్హత కలిగిన ఆశా వర్కర్లకు ప్రమోషన్ అవకాశాలు కల్పించాలి. 6. రెండవ పి ఆర్ సి లో ఆశా వర్కర్లకు కనీసం రూ.30,000 వేతనం నిర్ణయించాలి. 7. ఆశా



వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలి. ఈ డిమాండ్ల సాధన కోసం సిఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అందుకోసం ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

ఇసుక లారీ డికొని.. ద్విచక్ర వాహనదారుడు పెద్దస్వామి మృతి!

రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలి..

బాధిత కుటుంబానికి న్యాయం

జరిగే వరకు ఆందోళన ఆపేది లేదు

ఇసుక క్వారీలపై మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన హామీ ఏమైంది? అధికారులను నిలదీసిన నాయకులు

భూపాలపల్లి, (లోకల్ గైడ్ ప్రతినిధి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని బీరసాగర్--కన్నెపల్లి ఇసుక క్వారీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. క్వారీలో ఇసుక లోడ్ చేసుకుని బయటకు వచ్చిన లారీ, మహాదేవపూర్ నుంచి బిరాసాగర్--కన్నెపల్లి మీదుగా రాంపూర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఒక్కసారిగా ఢీకొని మీదికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఒక్కడే ప్రయాణిస్తున్న పోత పెద్దస్వామి (46) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న పెద్దస్వామి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో మహాదేవపూర్లో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతదేహం తరలింపుపై కుటుంబ సభ్యుల ఆగ్రహం...

ప్రమాద స్థలంలో మృతుడి ఆధార్ కార్డు లభించినప్పటికీ, తమకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఆసుపత్రికి ఎలా తరలిస్తారని కుటుంబ సభ్యులు పోలీసులను, కాళేశ్వరం ఎస్సైని ప్రశ్నించారు. అనంతరం మహాదేవపూర్ కమాన్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం నిర్వహించేందుకు అంగీకరించబోమని స్పష్టం చేశారు.

రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాల్సిందే..

ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, కేదారి గీత పోత వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇసుక లారీల కారణంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తూ ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్నాడని, ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం



జరిగేంత వరకు రోడ్డుపైనే బైఠాయించి ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

మంథని ఎమ్మెల్యే హామీ ఏమైంది?

ఎన్నికల సమయంలో స్థానిక ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్బాబు గెలిచిన మొదటి రెండు మూడు రోజుల్లోనే ఈ ప్రాంతంలో ఇసుక క్వారీలు, ఇసుక లారీలను లేకుండా చేస్తామని హామీ ఇచ్చారని కేదారి గీత గుర్తుచేశారు. అయితే నేటికీ ఇసుక లారీల రాకపోకలు కొనసాగుతుండటంతో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

హామీ ఇచ్చేవారు లేరు.. ఆందోళన విరమించేది లేదు!

ప్రమాదానికి కారణమైన లారీ యజమాని గానీ, టీఎస్ఎండీసీ అధికారులు గానీ, వారి ప్రతినిధులు గానీ సంఘటనా స్థలానికి వచ్చి బాధిత కుటుంబానికి ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు తమ నిరసన కొనసాగిస్తామని రోడ్డుపై బైఠాయించారు. ఇసుక రవాణా ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పటికీ, అదే ఇసుక రవాణా సామాన్యుల ప్రాణాలను బలితీసుకుంటే బాధ్యత ఎవరిది? ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ ఇద్దరు కుమార్తెల భవిష్యత్తుకు భరోసా ఎవరు కల్పిస్తారు? బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు ఇసుక లారీల రాకపోకలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చాలకపల్లి రెండెళ్లి

రైస్ ట్రేడర్స్ దుకాణాలలో ఆకస్మిక తనిఖీ

తక్కువ తూకం కలిగిన రైస్ బ్యాగులను విక్రయిస్తున్న రైస్ ట్రేడర్స్ యజమానిపై కేసు నమోదు





మూడు రైస్ ట్రేడర్స్ దుకాణాలలో విస్తృత తనిఖీలు,హనుమకొండ నయీమ్ నగర్ లోని గణపతి రైస్ ట్రేడర్స్, చిదర సంపత్ కుమార్ ఫుడ్ గ్రేన్ డీలర్, శ్రీ శ్యామ్ ట్రేడర్స్ దుకాణాలలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పౌర సరఫరాల శాఖ అధికారులు, తూనికలు కొలతలు శాఖల అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు.ఈ తనిఖీల సందర్భంగా రైస్ బ్యాగుల తూకాలు సరిగ్గా ఉన్నాయా లేదా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైస్ విక్రయాలు జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకుని వాటి రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కాగా గణపతి రైస్ ట్రేడర్స్ లో తనిఖీల సందర్భంగా అక్కడి బియ్యం బస్తాలను తూకం వేశారు. ఇందులో ఇరవై ఐదు కిలోల సంచులలో ఒక్కోదానిలో ఒకటి నుండి ఒకటిన్నర కిలోల వరకు తక్కువగా బియ్యం ఉన్నట్లు అదనపు కలెక్టర్, అధికారులు గుర్తించారు. వినియోగదారులను మోసం చేస్తూ తక్కువ బరువు కలిగి ఉన్న బియ్యం సంచులను విక్రయిస్తున్నందుకు గణపతి రైస్ ట్రేడర్స్ యజమానిపై ప్రభుత్వ నిబంధనల మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు కలెక్టర్ రవి తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ రైస్ విక్రయ దుకాణాలలో ప్రభుత్వ నిర్దేశిత ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా నిర్ణీత తూకం కంటే తక్కువ తూకం ఉన్న రైస్ బ్యాగులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.ఈ తనిఖీలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు భద్రు నాయక్, భాస్కర్ రెడ్డి, తూనికలు కొలతల శాఖ అధికారులు విశ్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు స్వచ్ఛంద సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పించడం మంచి పరిణామం..

నల్లగొండ డి.ఎస్.పి కొలను శివ రాం రెడ్డి.

ఎస్.కె.ఎస్.ఎస్ సంస్థ ప్రతినిధులను అభినంధించిన డి.ఎస్.పి శివ రాం రెడ్డి

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన.

జాబ్ మేళాలో పాల్గొన్న అంతర్జాతీయ స్థాయి కంపెనీలు ఫాక్స్‌కాన్,ఓరియంట్ ఎలక్ట్రిక్,ప్రీమియర్ ఎనర్జీస్ కంపెనీలు.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి లోకల్ గైడ్ : స్థానిక జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల డా.బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ సెంటర్ సెమినార్ హాల్లో ఎస్.కె.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో పొట్టిపాక నాగరాజు అధ్యక్షతన జరిగిన మెగా జాబ్ మేళాకు నల్లగొండ డి.ఎస్.పి కొలను శివ రాం రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ నిరుద్యోగులు అధైర్య పడకుండా,చెడు వ్యసనాలకు బానిస కాకుండా,ఈజీ మనీ కి అలవాటు పడకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగం చేస్తూ కష్టపడి తమ కలలను సహకారం చేసుకుంటూ, లక్ష్యాలను విజయవంతంగా నెరవేర్చుకోవాలని అన్నారు.ప్రస్తుత సమయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వందల మంది నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి కల్పించాలని సదుద్దేశంతో ఎస్.కె.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన వివిధ కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం గొప్ప విషయమని,ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ముందుకు వచ్చిన ఎస్.కె.ఎస్.ఎస్ సంస్థ ప్రతినిధులను డి.ఎస్.పి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్జి కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డా. ఎస్. ఉపేందర్,టూ టౌన్ ఎస్ఐ సైదా బాబు ,అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్ , ఫోక్స్ కాన్ హెచ్.ఆర్ మేనేజర్ శ్రీనివాస్ , ఎస్ కె ఎస్ ఎస్ మేనేజర్ మూర్తి ,సంస్థ ప్రతినిధులు ,తరాల నరేష్,తోగిటి అనుదీప్,నల్ల మధు,కట్ట హరి బాబు,నాంపల్లి మధు,తోనుకునూరి సన్నీ,కొవూరు అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోద్ పేట్ ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థి సౌండ్ సిస్టం బహుకరణ.రాజేంద్రనగర్



(లోకల్ గైడ్): విద్యాబుద్దులు నేర్పి సమాజంలో గౌరవంగా బ్రతుకు పాఠాలు నేర్పిన పాఠశాలకు ఏదో ఒకటి మంచి చేయాలి అనే తపనతో తనవంతుగా సౌండ్ సిస్టమ్ విరాళంగా ఇచ్చినట్లు పూర్వ విద్యార్థి - మంగలారం బాబురావు తెలిపారు. మంగళవారం ప్రేమావతి పేట్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యాబుద్దులు నేర్చుకొని ఇప్పుడు ప్రభుత్వ సంస్థలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తనవంతు బాధ్యతగా విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా పూర్వవిద్యార్థిగా పాఠశాలకు నిత్యం అవసరం అయ్యే విధంగా (50,000/-)అక్షరాల యాభై వేయిల రూపాయలతో సౌండ్ సిస్టమ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి మునీరాబేగం గారికి అందజేసినట్లు మంగళారం బాబురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వవిద్యార్థులు పి. మల్లేష్ యాదవ్,గోల్కొండ రాజు కుమార్,ఎడ్లకాడి సూర్యం,చంద్రశేకర్,బి.ఆర్. సుమన్,సురేష్,మోజెస్,నరేష్,ఎడ్లకాడి రవి,కవ్వగూడెం జనార్దన్,చిలుకూరి శ్రీనివాస్,టీచర్లు దాసరి సరిత,గాయత్రి,అంగన్వాడీ టీచర్ వినోద, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ లో పలువురు చేరిక..



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : మంచిర్యాల జిల్లా హాజీపూర్ గ్రామ సర్పంచ్ మాదవరపు శ్రీలత,నాయకులు రామారావు అద్వర్యంలో పుస్కూర్ రామ్మోహన్ రావు నాయకత్వంలో ఆయన నివాసం వద్ద కొండపల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామ పెద్దలు సీనియర్ నాయకులు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బిఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి రావాలిని,కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని,మంచిర్యాల నియోజకవర్గంలో బిఆర్ఎస్ జండా ఎగరవేస్తామని దీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేష్,జిల్లా మాజీ చైర్మన్ అత్తి సరోజ,మాజీ సర్పంచ్ పూదరి శంకరయ్య,వార్డు సభ్యులు జనార్దన్,తానయ్య,సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి,ఉమ,మాజీ కౌన్సిలర్ పద్మ,బోర్లకుంట రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్వారీ నీటి గుంతలో పడి ఇద్దరు గొర్రెల కాపరులు దుర్మరణం



లోకల్ గైడ్,ధరూర్ వికారాబాద్ జిల్లా(బ్యూరో ప్రతినిధి) : ధరూర్ మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో క్వారీ తవ్వకాల వల్ల ఏర్పడిన లోతైన నీటి గుంతలో పడి ఇద్దరు గొర్రెల కాపరులు ప్రాణాలు కోల్పోయారు. మృతులను తరిగోపుల గ్రామానికి చెందిన సకీలా శ్రీనివాస్ (43), మున్నూరు అశోక్ (21)గా గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో తరిగోపులలో శోకసంద్రం అలుముకుంది. గ్రామ పరిధిలోని ప్రభుత్వ, పట్టా భూముల్లో నామమాత్రపు అనుమతులతో, నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున సుద్ద క్వారీ మైనింగ్ నిర్వహించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తవ్వకాల వల్ల అక్కడ భారీ లోతైన గుంతలు ఏర్పడి, వర్షపు నీటితో నిండిపోయాయి. రోజువారీగా గొర్రెలను మేపేందుకు వెళ్లిన శ్రీనివాస్, అశోక్ ప్రమాదవశాత్తు ఈ నీటి గుంతలో పడి మునిగిపోయి ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న ధరూర్ సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి వివరాలు సేకరించారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. మృతుడు శ్రీనివాస్ భార్య దేవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు స్థానికులను తీవ్రంగా కలచివేశాయి.

అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం :

అక్రమ క్వారీ తవ్వకాల వల్ల ఏర్పడిన లోతైన గుంతలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్ద క్వారీ తవ్వకాల అనుమతులు, నిర్వాహకులు పాటించాల్సిన భద్రతా చర్యలపై మైనింగ్ శాఖ అధికారులు తక్షణమే పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదానికి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి..

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

టపాసుల దుకాణాల కేటాయింపులో

పారదర్శకత పాటించాలి

టపాసుల దుకాణాలలో భద్రతా

ప్రమాణాల్లో రాజీ పడొద్దు

ప్రతి దుకాణంలో విద్యుత్ వైరింగ్

తనిఖీ చేసి ధృవీకరించాలి

దుకాణాల మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండాలి

అగ్నిమాపక వాహనాలు, 108 సేవలు, అత్యవసర

వైద్య చికిత్సలు అందుబాటులో ఉంచాలి

దీపావళి వేడుకలపై సంబంధిత అధికారులు,

విక్రయదారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, నవంబర్- 03: లోకల్ గైడ్ : దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి దీపావళి పండుగ వేడుకలు, టపాసుల విక్రయ దుకాణాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన దీపావళి పండుగ ఉన్న నేపథ్యంలో టపాసుల విక్రయాలు, వినియోగం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సాధారణంగా దీపావళి తర్వాత వారం రోజుల వరకు కూడా టపాసులు కాల్చే అవకాశం ఉన్నందున ఆ మేరకు అగ్నిమాపక, వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.టపాసుల దుకాణాల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేపట్టాలని అన్నారు. టపాసుల దుకాణాలను బహిరంగ ప్రదేశాల్లోనే ఏర్పాటు చేయాలని, తాత్కాలిక నిర్మాణాల ఏర్పాటులో మండే స్వభావం కలిగిన పదార్థాలను వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రతి దుకాణం మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండేలా చర్యలు తీసుకోవాలని, దుకాణాల మధ్య తగినంత ఖాళీ స్థలం ఉండేలా చూడాలని, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ప్రతి దుకాణంలోని విద్యుత్ వైరింగ్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. అగ్నిమాపక యంత్రాలు, ఇతర అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచడంతో పాటు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవలు అందించేందుకు టపాసుల విక్రయ కేంద్రాల వద్ద 108 వాహనాన్ని అందుబాటులో ఉంచాలని, ప్రథమ, ద్వితీయ స్థాయి కాలిన గాయాలకు అవసరమైన మందులు, వైద్య చికిత్సలను సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. టపాసుల విక్రయ కేంద్రాల వద్ద త్రాగునీటి సదుపాయం, పరిసరాల పరిశుభ్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారుల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి, దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. వ్యాపార లాభాల కంటే ప్రజల భద్రతే ముఖ్యమని, ఆదాయం కోసం భద్రతా ప్రమాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో రెండు ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, నగరంలో మరో అనువైన బహిరంగ ప్రదేశం ఉంటే అధికారులు గుర్తించి తెలియజేయాలని, అక్కడ కూడా దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.. పోలీస్ శాఖ ఏసీపీ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు 224 దరఖాస్తులు అందాయని, అందుబాటులో ఉన్న దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, డీపీఓ వినోద్ కుమార్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారులు, టపాసుల దుకాణాల యజమానులు, విక్రయదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ ఎత్తిపోతల పథకంతో నే నారాయణపురం మండలానికి శాశ్వత సాగునీరు

75 కిలోమీటర్ల పాదయాత్ర

పాదయాత్ర బృందానికి ప్రజల ఘన స్వాగతం



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి చౌటుప్పల్ నవంబర్ 3 (లోకల్ గైడ్) : రాచకొండ ఎత్తిపోతల పథకం ద్వారా నారాయణపురం మండలానికి శాశ్వత సాగునీరు సాధించడమే లక్ష్యంగా సీపీఐ(ఎం) సమస్త నారాయణపురం మండల పార్టీ ఆధ్వర్యంలో 28 గ్రామాలలో 79.3 కిలోమీటర్ల పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. ఆదివారం మర్రిగూడ మండలం చెర్లగూడెం--శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర మూడు రోజులపాటు కొనసాగి మంగళవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంది. సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే డిమాండ్‌తో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలను చైతన్యపరుస్తూ ముందుకు సాగారు. నారాయణపురం మండలం 63,630 ఎకరాల భౌగోళిక విస్తీర్ణంతో పాటు 44,335 మంది జనాభాను కలిగి ఉంది. మండల పరిధిలో 44,567 ఎకరాల సాగుభూమి ఉండగా, ఏడు పెద్ద చెరువులతో పాటు 69 చిన్న చెరువులు, కుంటలు ఉన్నాయి. అయితే ఈ చెరువులు, కుంటలు భారీ వర్షాలు కురిసినప్పుడే నిండే పరిస్థితి నెలకొంది. వర్షాధారంగా వ్యవసాయం సాగుతుండటం తో రైతులు ప్రతి ఏటా సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి మండలానికి శాశ్వత సాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్టు అమలుతో సాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని వారు పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అమలు కావాల్సి ఉందని పాదయాత్ర బృందం అభిప్రాయపడింది. 2014లో ఏర్పడిన ప్రభుత్వం శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ, పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని నాయకులు విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి రాచకొండ ప్రాంతానికి సాగునీరు అందించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లు, నిధులు ఇతర ప్రాంతాలకు మళ్లించకుండా స్థానిక ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాచకొండ ఎత్తిపోతల పథకం సాధన లక్ష్యంగా నారాయణపురం మండలంతో పాటు చౌటుప్పల్, మర్రిగూడ, చండూరు మండలాలకు చెందిన సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు పాదయాత్రలో భాగస్వాములయ్యారు. మూడు రోజులపాటు 75 కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్రలో గ్రామగ్రామాన పర్యటిస్తూ ప్రాజెక్టు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. రాచకొండ ప్రాంత రైతుల భవిష్యత్తు, వ్యవసాయ అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం ప్రాజెక్టుతోనే సాధ్యమని ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రాజెక్టు సాధన కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టు సాధన కోసం పాదయాత్ర చేపట్టిన సీపీఐ(ఎం) బృందానికి గ్రామాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పాదయాత్రలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు పూలదండలు, కండువాల తో స్వాగతం పలికారు. ఎండలో సుదీర్ఘంగా పాదయాత్ర చేస్తున్న వారికి వాటర్ బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రజల నుంచి లభించిన ఆదరణ పాదయాత్ర బృందానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. రాచకొండ ఎత్తిపోతల పథకం సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సీపీఐ(ఎం) శ్రేణులు స్పష్టం చేశాయి. ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీరాలంటే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి శాశ్వత నీటి వసతి కల్పించాల్సిందేనని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాదయాత్ర బృందం సభ్యులు సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి,దోడ యాదిరెడ్డి, మల్లేపల్లి లలిత గుంటూరు శ్రీనివాస చారి, ఐత రాజు గాలయ్య, ఆరుట్ల రాజు కేసాని కృష్ణ గుండు జంగయ్య ఉప్పలపల్లి బాలకృష్ణ కుకుడాల మంగమ్మ వెలిజాల సుందరయ్య దూద భరత్ రెడ్డి దొంతగోని శంకరయ్య జనగల యాదయ్య లతోపాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనూరు నర్సిరెడ్డి,సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మాటూరి బాలరాజు,పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం,సీనియర్ నాయకులు దొంతగాని పెద్దలు, పిట్ట రాములు, చింతకాయల నరసింహ,చాపల మారయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి పేర్లు మాజీ ఎమ్మెల్సీ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.జంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మాటూరి బాలరాజు గౌడ్ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా,రాగిరి కిష్టయ్య,కోట రామచంద్రారెడ్డి చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్ నాయకులు దుబ్బాక జంగయ్య,అలివేలు సంజీవరెడ్డి,ఆదిమూలం నందీశ్వర్,మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక
ఎడిటర్: చుక్కపల్లి రాంరెడ్డి

బీఆర్ఎస్ నేతల జన్మదిన వేడుకలకు బానోత్ మనీషా లక్ష్మి ప్రత్యేక శుభాకాంక్షలు!

డొంకెన రవీందర్, సోమందల నాగరాజులకు కేక్ పంపించి వేడుకలు నిర్వహించిన వైరా నియోజకవర్గ నాయకురాలు



కారేపల్లి, నవంబర్ 3 (లోకల్ గైడ్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డొంకెన రవీందర్, తెలంగాణ ఉద్యమకారుడు, సింగరేణి మండల యువజన నాయకుడు సోమందల నాగరాజు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బస్టాండ్ సెంటర్‌లో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి మదన్‌లాల్ స్వయంగా కేక్ పంపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె పంపించిన కేక్‌ను నాయకులు, కార్యకర్తలు కలిసి కట్ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డొంకెన రవీందర్, సోమందల నాగరాజులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సింగరేణి మాజీ మొదటి వార్డు సభ్యుడు గంగరబోయిన సత్యనారాయణ, మాజీ దిశా కమిటీ సభ్యులు రాము లక్ష్మణ్, పాలిక వీరస్వామి, మండల యువజన నాయకులు జడల కళ్యాణ్ యాదవ్, పేరిని వెంకటేశ్వర్లు, పొదుగు హరీష్, తురక రవి, చింతల సంపత్, గంగరబోయిన శ్రీను, కాకాటి ఉపేందర్, ఇరానీ చాయ్ నిర్వాహకుడు నరేష్, ఆటో మెకానిక్ షెడ్ యజమాని షరీఫ్, జంగా జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి నిశ్చితార్థానికి సీఎం, డిప్యూటీ సీఎంకు ఆహ్వానం





ఖమ్మం జిల్లా ప్రతినిధి వైరా నవంబర్ 03 : లోకల్ గైడ్: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తన పెద్ద కుమార్తె గాయత్రి నిశ్చితార్థ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆయన సతీమణి నందినిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ నెల 6వ తేదీన జరగనున్న నిశ్చితార్థ వేడుకకు హాజరుకావాలని కోరుతూ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దంపతులకు ఎమ్మెల్యే ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ శుభకార్యానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దంపతులను తన కుటుంబ శుభకార్యానికి ఆహ్వానించడం పట్ల ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆనందం వ్యక్తం చేశారు.

విధుల పట్ల బాధ్యత రాహిత్యంగా వ్యవహరించొద్దు..

మెనూ పాటించని వార్డెన్ పై చర్యలు ఏవి...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) : విధుల పట్ల బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తు మెనూ పాటించని వార్డెన్ పై చర్యలు తీసుకోవాలంటు సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు మంగళవారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బెల్లంపల్లి బీసీ బాలుర కళాశాల హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు మేను ప్రకారం భోజనం పెట్టడం లేదని,ఆటలకు గ్రౌండ్ కి పంపించడం లేదని,అంతేకాకుండా నాణ్యత లేని పాలు ఇస్తున్నారంటు ఆరోపించారు.వార్డెన్ రెగ్యులర్ గా హాస్టల్ కు రావడం లేదని,హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదంటు హాస్టల్ విద్యార్థులు 2026 జూలై 27న బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ప్రజావాణిలో ఉన్న బెల్లంపల్లి సబ్ కలెక్టర్ ఫిర్యాదు చేసారని పేర్కొన్నారు.ఈ ధర్నా పై సబ్ కలెక్టర్ వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలని విచారణ నిమిత్తం 4మెన్ కమిటీ వేసినట్లు తెలిపారు.విచారణ కమిటీ అధికారులు సంక్షేమ వసతి గృహానికి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడడం ద్వారా విచారణ కమిటీ నిర్ధారించిన అంశాలను తెలిపారు.ప్రభుత్వం నిర్దేశించిన హాస్టల్ మెనూ సరిగ్గా పాటించడం లేదని,వడ్డించిన ఆహారం నాణ్యత,రుచి సంతృప్తికరంగా లేవని హాస్టల్ విద్యార్థులు నిరంతరం చెబుతున్నారని విచారణలో తేలిందని,హాస్టల్ మెనూ వడ్డించడానికి సంబంధించిన,ఆహార కమిటీ నిర్దేశించిన రికార్డులను హాస్టల్ సంక్షేమ అధికారి నిర్వహించడం లేదని కూడా కమిటీ గమనించిందని,విచారణ కమిటీ అధికారులు తయారు చేసిన రిపోర్ట్ పై అధికారులకు పంపామని చెబుతున్నారని,కానీ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.అదే హాస్టల్లో కామాటిగా ఉన్న ఔట్సోర్సింగ్ వర్కర్ ను విద్యార్థులు చేసిన ధర్నాలో తన ప్రమేయం ఉందంటు తను వివరణ ఇచ్చినా కూడా అకారణంగా విధుల నుంచి తొలగించారని,లక్షట్టిపేట బిసి కళాశాల హాస్టల్ లో వరలక్ష్మి అనే అవుట్సోర్సింగ్ వర్కర్ విద్యార్థులకు వంట చేసి పెట్టడానికి వార్డెన్ సరుకులు సరిగ్గా ఇవ్వడం లేదని పై అధికారులకు చెప్పినందుకు ఆ వర్కర్ ను ఆకారణంగా తొలగించారని పేర్కొన్నారు.ఇలా అధికారులు తప్పు చేసి వర్కర్లను బలి పశువులుగా మారుస్తున్నారని,దీనికి తోడు సంబంధించిన అధికారులు సైతం సరే అంటున్నారని తెలిపారు.విచారణ కమిటీ నిర్ధారించిన అంశాలకు బాధ్యులైన సంక్షేమ హాస్టల్ వార్డెన్ ను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేసారు.

వేధింపులపై మౌనం వద్దు ధైర్యంగా ఫిర్యాదు చేయండి జిల్లా ఎస్పీ: అక్షాంష్ యాదవ్

ఆడపిల్లల భద్రతకు అండగా షీ టీమ్స్



యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ఆలేరు నవంబరు 3 (లోకల్ గైడ్): ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళల భద్రత, మహిళా హక్కులు, ఈవ్ టీజింగ్, వేధింపులు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. షీ టీమ్స్ అందిస్తున్న సేవలు, ఫిర్యాదు చేసే విధానం, అత్యవసర సమయంలో పోలీసుల సహాయం పొందే మార్గాల గురించి వివరించారు. డయల్ 112 , షీ టీం ఫోన్ నెంబర్ 8712665338 మహిళల భద్రతకు యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విద్యార్థినులు అప్రమత్తంగా ఉంటూ తమ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు

మేడిగడ్డను బూచిగా చూపి రైతుల నోట్లో మట్టి కొడుతున్న కాంగ్రెస్!

బ్యారేజీ కూలిందన్న ప్రచారం అవాస్తవం.. 85 పిల్లర్లు నిటారుగా ఉన్నాయంటూ బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు

గోదావరి జలాలు సముద్రం పాలు..

రైతుల పంటలు ఎండుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

నీళ్లు ఎత్తిపోయకుంటే కేటీఆర్ నాయకత్వంలో రైతు పోరుబాట తప్పదు: వేముల ప్రశాంత్‌రెడ్డి



భూపాలపల్లి:(లోకల్ గైడ్ ప్రతినిధి) : మేడిగడ్డ బ్యారేజీ కూలిపోయిందని, కొట్టుకుపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారంపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బ్యారేజీ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బ్యారేజీ మొత్తం 85 పిల్లర్లు నిటారుగా ఉన్నాయని, ప్రాజెక్టు కూలిపోయిందంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం రాజకీయ దుష్ప్రచారమేనని విమర్శించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సాగునీరు లేక ఎండిపోతున్న పంటలను, రైతుల దీనస్థితిని ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మేడిగడ్డను సందర్శించారు. తొలుత ప్రాణహిత--గోదావరి సంగమ ప్రాంతం, సిరోంచ--కాళేశ్వరం బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం, కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రాంతాన్ని పరిశీలించి అనంతరం మేడిగడ్డ బ్యారేజీ వద్దకు చేరుకున్నారు.

ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేష్ గుప్త, జీవన్‌రెడ్డి, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జజ్జాల సురేందర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు. బ్యారేజీపైకి వాహనాలను అనుమతించకుండా పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

85 పిల్లర్లు కనిపిస్తున్నా.. కూలిపోయిందని ఎలా చెబుతారు?

మీడియాతో వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ వద్ద వాస్తవ పరిస్థితులను ప్రజలు స్వయంగా గమనించాలని అన్నారు. గత మూడు వర్షాకాలాల్లో భారీ వరదలను తట్టుకుని బ్యారేజీ నిలిచిందని, కొన్ని పిల్లర్లకు మరమ్మతులు అవసరమైతే వాటిని పూర్తి చేయకుండా మొత్తం ప్రాజెక్టు కూలిపోయిందంటూ ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. మరమ్మతులు చేయడంలో ప్రభుత్వం విఫలమై, ఆ వైఫల్యాన్ని రాజకీయ ప్రచారంతో కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

గోదావరి నీళ్లు సముద్రం పాలు.. రైతుల పంటలు ఎండిపోతున్నాయ్!

మేడిగడ్డ వద్ద దాదాపు 22 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని, రోజుకు సుమారు రెండు టీఎంసీల నీరు దిగువకు వెళ్తోందని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కన్నెపల్లి పంపులను ప్రారంభించి అందుబాటులో ఉన్న నీటిని ఎత్తిపోస్తే ఎస్సారెస్పీ, నిజాంసాగర్, మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ వంటి రిజర్వాయర్లకు నీటిని అందించే అవకాశం ఉందన్నారు. నీటి కోసం రైతులు ఎదురుచూస్తుంటే, కళ్లముందే గోదావరి జలాలు వృథాగా దిగువకు వెళ్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంతరెడ్డి, నవాబు, వేంపల్లి, సారంగాపూర్, మెంట్రాజ్‌పల్లి లిఫ్టులతో పాటు నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ పేరు వస్తుందనే రాజకీయ కక్ష?

కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే రాజకీయ కక్షతోనే గోదావరి నీటిని ఎత్తిపోయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రైతులకు ఉపయోగపడాల్సిన నీటిని వృథాగా వదిలేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ కక్షలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. తక్షణమే బ్యారేజీ భద్రతపై నిపుణుల సూచనలు తీసుకుని, సాధ్యమైన మేరకు నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతాంగాన్ని ఏకం చేసి పెద్దఎత్తున రైతు పోరుబాట నిర్వహిస్తామని హెచ్చరించారు. చంద్రబాబు ప్రయోజనాల కోసమే తెలంగాణ నీటి ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు: పుట్ట మధూకర్ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడుకు ప్రయోజనం చేకూర్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ బ్యారేజీని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ వద్ద నీరు దిగువకు వెళ్లిపోతుంటే తెలంగాణ రైతులకు మాత్రం సాగునీరు అందడం లేదని మండిపడ్డారు. గతంలో బ్యారేజీలో నీటి నిల్వల వల్ల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగేవని, ప్రస్తుతం నీటి నిల్వలు లేకపోవడంతో పరిస్థితి మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకు పెద్దపీట వేయడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్యారేజీల పరిరక్షణకు, నీటి వినియోగానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు కష్టాలే: బాజిరెడ్డి గోవర్ధన్

మాజీ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మేడిగడ్డ వద్ద నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రాజెక్టులను నింపేందుకు చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రైతులను ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టి సారించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ మరింత నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు.

కాళేశ్వరంపై చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలి: గణేష్ బిగాల

మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ. ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును 'కాలేశ్వరం' అంటూ ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు ఎందుకు అందించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవైపు నీటి పొదుపు గురించి మాట్లాడుతూనే మరోవైపు అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోకపోవడం రైతు వ్యతిరేక విధానమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా మేడిగడ్డను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, రైతులకు సాగునీరు అందించే విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రైతులకు కావాల్సింది రాజకీయ ప్రకటనలు కాదు.. సాగునీరు!

మేడిగడ్డ బ్యారేజీ భద్రత, గోదావరి జలాల వినియోగం, రైతులకు సాగునీటి సరఫరా అంశాలపై ప్రభుత్వం తక్షణం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శల మధ్య రైతుల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మేడిగడ్డ నీటి వినియోగంపై ప్రభుత్వ తదుపరి నిర్ణయం ఎలా ఉండబోతోందన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

వందే భారత్ స్లీపర్‌లో ఘూజీపూర్ మహిళకు కీలక బాధ్యత.. శ్రీని శ్రీవాస్తవ ఎవరో తెలుసా



ఘూజీపూర్‌కు చెందిన అసిస్టెంట్ లోకో పైలట్ శ్రీని శ్రీవాస్తవకు వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ ఆపరేటింగ్ క్రూలో కీలక బాధ్యత లభించింది. 2017లో భారతీయ రైల్వేలో చేరిన ఆమె.. 2024లో వందే భారత్‌తో గుర్తింపు పొందారు. తాజాగా వారణాసి--న్యూఢిల్లీ వందే భారత్ స్లీపర్‌లో బాధ్యతలు చేపట్టి మరోసారి వార్తల్లో నిలిచారు. వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌లో మహిళా ఉద్యోగుల భాగస్వామ్యం ఇప్పుడు ప్రత్యేకంగా నిలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ఘూజీపూర్‌కు చెందిన అసిస్టెంట్ లోకో పైలట్ శ్రీని శ్రీవాస్తవ ఈ రైలులో ఆపరేటింగ్ సిబ్బందిలో చోటు దక్కించుకున్నారు. 2026 అక్టోబర్ 31న వారణాసి--న్యూఢిల్లీ వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైన నేపథ్యంలో శ్రీని పేరు మరోసారి వార్తల్లో నిలిచింది. రైల్వేలో 2017లో ఉద్యోగంలో చేరిన ఆమె.. వరుసగా కొత్త బాధ్యతలు స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నారు. శ్రీని శ్రీవాస్తవ ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతమైన ఘూజీపూర్ జిల్లాకు చెందినవారు. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన అనంతరం సాంకేతిక నైపుణ్యం, శిక్షణ, అప్రమత్తత అవసరమైన రైల్వే ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. 2017 ఏప్రిల్‌లో భారతీయ రైల్వేలో అసిస్టెంట్ లోకో పైలట్‌గా చేరారు. అనంతరం ఆమెకు వారణాసి రైల్వే డివిజన్‌లో పోస్టింగ్ లభించింది. 2024లో వందే భారత్ రైలును నడిపిన మహిళా రైల్వే ఉద్యోగుల్లో ఒకరిగా శ్రీని గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆమె ప్రయాణం రైల్వే రంగంలో మహిళల పెరుగుతున్న భాగస్వామ్యానికి ఉదాహరణగా నిలిచింది. ఇక తాజాగా వందే భారత్ స్లీపర్ ఆపరేటింగ్ క్రూలో ఆమెకు బాధ్యతలు అప్పగించడం మరో కీలక పరిణామంగా మారింది.


13 మంది సిబ్బందిలో ఏడుగురు మహిళలు

అక్టోబర్ 31న వారణాసి నుంచి వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సమక్షంలో ఈ రైలుకు జెండా ఊపారు. ఈ రైలు ఆపరేటింగ్ సిబ్బందిలో మొత్తం 13 మంది ఉండగా, వారిలో ఏడుగురు మహిళలు ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. శ్రీని అసిస్టెంట్ లోకో పైలట్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండగా, జ్యోతి కుమారికి గార్డ్‌గా బాధ్యతలు అప్పగించారు.

వారణాసి--న్యూఢిల్లీ మధ్య స్లీపర్ ప్రయాణం

ఈ వందే భారత్ స్లీపర్ రైలు రాత్రి ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా మార్చే లక్ష్యంతో రూపొందించారు. వారణాసి నుంచి రాత్రి 8:50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6:10 గంటలకు న్యూఢిల్లీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో న్యూఢిల్లీ నుంచి రాత్రి 9:40 గంటలకు బయలుదేరి ఉదయం 7:10 గంటలకు వారణాసి చేరుతుంది. ఈ రైలు ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ సెంట్రల్, అలీగఢ్, ఘూజియాబాద్ మీదుగా ప్రయాణిస్తుంది. స్లీపర్ కోచ్‌లతో పాటు మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలు, రీజెనరేటివ్ బ్రేకింగ్ వంటి సాంకేతికతలను ఇందులో ఉపయోగించారు. లోకో పైలట్ ఉద్యోగంలో ఎక్కువ పని గంటలు, కఠినమైన షెడ్యూల్, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన కీలక బాధ్యతలు ఉంటాయి. ఇలాంటి రంగంలో మహిళలు కూడా తమ సామర్థ్యాన్ని చాటుకుంటున్నారు. 2017లో రైల్వేలో అడుగుపెట్టిన శ్రీని.. 2024లో వందే భారత్‌తో గుర్తింపు పొంది, ఇప్పుడు వందే భారత్ స్లీపర్ ఆపరేటింగ్ క్రూలో భాగమయ్యారు. ఆమె ప్రయాణం పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగితే కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవచ్చనే సందేశాన్ని ఇస్తోంది.

ఇజ్రాయెల్ ఎన్నికల్లో నెతన్యాహుకు బిగ్ షాక్.. మెజారిటీకి దూరం.. ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ!



ఇజ్రాయెల్ పార్లమెంటరీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠకు తెరలేపాయి. అక్టోబర్ 27న జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తికాగా, ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని అధికార కూటమికి స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. మొత్తం 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 స్థానాలకు నెతన్యాహు కూటమి దూరంగా నిలిచింది.జెరూసలేం: ఇజ్రాయెల్ పార్లమెంటరీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠకు తెరలేపాయి. అక్టోబర్ 27న జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తికాగా, ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని అధికార కూటమికి స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. మొత్తం 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 స్థానాలకు నెతన్యాహు కూటమి దూరంగా నిలిచింది. దీంతో తదుపరి ప్రభుత్వం ఎవరిదనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి.

53 స్థానాలకే పరిమితమైన నెతన్యాహు కూటమి

ఎన్నికల తుది ఓట్ల లెక్కింపు ప్రకారం నెతన్యాహు నేతృత్వంలోని కూటమి 53 స్థానాలను గెలుచుకుంది. ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు లభించగా, అరబ్ పార్టీలకు మొత్తం 19 స్థానాలు దక్కాయి. నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ 27 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని యషార్ పార్టీ 21 స్థానాలు సాధించగా, నఫ్తాలి బెన్నెట్‌కు చెందిన బి'యాచాద్ పార్టీ 12 స్థానాలు గెలుచుకుంది. జాయింట్ లిస్ట్ 11 స్థానాలు దక్కించుకుంది. ఇతర పార్టీల విషయానికి వస్తే.. డెమోక్రాట్స్, రా'అమ్ పార్టీలు చెరో 8 స్థానాలు గెలుచుకున్నాయి. యునైటెడ్ తోరా జుడాయిజం, యిస్రాయెల్ బీటెను, ఓట్జ్మా యెహుదిత్ పార్టీలు చెరో 7 స్థానాలు సాధించాయి. షాస్, రిలిజియస్ జియోనిజం పార్టీలు చెరో 6 స్థానాలతో సరిపెట్టుకున్నాయి. ప్రత్యేక బ్యాలెట్లుగా పరిగణించే డబుల్ ఎన్వలప్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఈ తుది సీట్ల కేటాయింపులు వెలువడ్డాయి.

విదేశీ జోక్యంపై ఆరోపణలు.. దర్యాప్తు

మరోవైపు ఎన్నికల ఫలితాలపై వివాదం రాజుకుంది. అరబ్ నేతృత్వంలోని పార్టీలు ఓట్ల కొనుగోలు, అక్రమ ఓటర్ల సమీకరణకు పాల్పడ్డాయని నెతన్యాహు పార్టీ లికుడ్ ఆరోపించింది. విదేశీ నిధుల సహాయంతో అరబ్ ఓటర్ల ఓటింగ్ శాతాన్ని ప్రభావితం చేశారనే అనుమానాలు కూడా వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో ఖతార్, టర్కీ ప్రమేయం ఉందనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. ఖతార్ సైతం తమపై వచ్చిన ఆరోపణలను ఖండించింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ దేశీయ భద్రతా సంస్థ షిన్ బెట్ విదేశీ జోక్యానికి సంబంధించిన అనుమానాలపై దర్యాప్తు చేస్తోంది. మరోవైపు ఎన్నికల అక్రమాలపై పోలీసులు కూడా విచారణ చేపట్టారు. అయితే ఎన్నికల సమగ్రతను వ్యవస్థాగతంగా ఉల్లంఘించారనే ఆరోపణలకు ఆధారాలు లేవని కేంద్ర ఎన్నికల కమిటీ స్పష్టం చేసింది.

అరబ్ పార్టీలే కీలకం.. నెక్స్ట్ ఏం జరగనుంది?

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో అరబ్ పార్టీలకు లభించిన 19 స్థానాలు అత్యంత కీలకంగా మారాయి. ప్రతిపక్ష కూటమి ఈ పార్టీల మద్దతు లేదా సహకారం పొందగలిగితే 61 స్థానాల మెజారిటీని దాటే అవకాశం ఉంది. అయితే అరబ్ పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై ప్రతిపక్షంలోని కొన్ని పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి నెలకొంది. మరోవైపు నెతన్యాహు కూడా తన మిత్రపక్షాలను వదులుకోకుండా ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు చేసే అవకాశం ఉంది. చర్చలు విఫలమైతే మరోసారి ఎన్నికలు జరిగే పరిస్థితి కూడా తలెత్తవచ్చు. కాగా, ఎన్నికల లెక్కింపు పూర్తయినప్పటికీ అధికారిక ఫలితాలను నవంబర్ 4న అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు సమర్పించనున్నారు. నవంబర్ 10న కొత్త క్నెసెట్ ప్రమాణ స్వీకారం చేయనుంది. మొత్తంగా ఇజ్రాయెల్ రాజకీయాల్లో తదుపరి ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగుతోంది. అక్టోబర్ 30 నాటికి ఎన్నికల కమిటీ ప్రకటించిన తుది సీట్ల కేటాయింపుల ప్రకారం నెతన్యాహు కూటమికి 53, ప్రతిపక్షానికి 48, అరబ్ పార్టీలకు 19 స్థానాలు వచ్చాయి. ఓటింగ్ శాతం 77.9 శాతంగా నమోదైంది.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.local-guidenews.com,contact:8977761499\\\